సండే వైబ్స్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-6-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 137 పేజీలు: 12 వెల: 6.50

## ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## 9 ఎయిరిండియా విమానాలు రద్దు

9లో

## మన ఆరోగ్యానికి మహా 'యోగా'



### 21న ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలి

### దేశ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం ఈనెల 21వ తేదీన జరుగుతున్న సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ప్రజలందరూ మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రజలందరూ యోగా కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు యోగా దినోత్సవ సందేశంతో కూడిన లేఖను విడుదల చేసారు. ఏపి ప్రభుత్వం సమాచార, పౌరసంబంధాల శాఖ ద్వారా ఈ లేఖను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుని వెళ్తుంది. ప్రధాని మోడీ ఈ లేఖలో ఈ సంవత్సరం జూన్ 21న మనం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోనున్నామని తెలిపారు. ఈ చారిత్రాత్మక యోగా ప్రస్థానం విజయవంతంగా 10 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరింత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. గత దశాబ్ద కాలంగా దేశ ప్రజలు ఈ గొప్ప కార్యక్రమానికి అందిస్తున్న ఆదరణ ఒక ప్రత్యేకమన్నారు. గత పదేళ్లుగా యోగా కేవలం భారత దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ ఎడాది జూన్ 21న విశాఖపట్నం కేంద్రంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా.. ఒక భూమి, ఒక ఆరోగ్యం' అనే థీమ్‌తో ముందుకు వెళ్తున్నామన్నారు. యోగా కేవలం వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ, మరియు ప్రపంచ ఐక్యత స్ఫూర్తినికూడా ప్రతిబింబిస్తుందన్నారు. యోగా మన గొప్ప సాంస్కృతిక వారసత్వంలో >>2

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

## రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేద్దాం..

### సర్క్యులర్ ఎకానమీపై త్వరలో కొత్త పాలసీ

### యేడాదిలోగా 3 సర్క్యులర్ ఎకానమీ పార్కులు

### ఉత్తమ నిర్వహణకు 'స్వచ్ఛతా అవార్డు'లు

### సమీక్షలో సిఎం చంద్రబాబు



మంగళవారం సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను పటిష్ట పరిచేలా. రెండు నెలల్లో సర్క్యులర్ ఎకానమీకి సంబంధించి తుది పాలసీని తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మొదటగా రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో సర్క్యులర్ ఎకానమీ పార్కులను ఏడాదిలోగా ఏర్పాటు చేయాలని, అలాగే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో ఆధునిక యంత్రాలను వినియోగాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలిగించాలని సిఎం ఆదేశించారు. 90 రోజుల్లోగా రీసైక్లింగ్, చెత్తను వేరు చేయడంపై కార్యాచరణ ప్రణాళిక ఇవ్వాలన్నారు. మంగళవారం సచివాలయంలో సర్క్యులర్ ఎకానమీపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు..వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై రివ్యూలో సిఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో 'సర్క్యులర్ ఎకానమీ పార్కులు' ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వ యోచన చేస్తుందన్నారు.
ఇందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసిన మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. రాష్ట్రంమున్సిపల్, వాహనాలు, లిథియంబ్యాటరీలు, జిప్సం,టైర్లు, రబ్బర్, >>2

# బనకచర్లపై తెలంగాణ ఆరోపణలు అవాస్తవం



### అక్కడ అంతర్గత రాజకీయ పోరు కోసమే వివాదం చేస్తున్న నాయకులు

### యేటా సముద్రంలో కలిసే 3వేల టిఎంసిల గోదావరి నీటి సద్వినియోగానికే బనకచర్ల ప్రాజెక్టు

### సిఎం చంద్రబాబుకు రెండు రాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యమే: పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణలో అంతర్గత రాజకీయ పోరు కోసమే పోలవరం- బనకచర్లపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. నికరజలాల్ని ఈ ప్రాజెక్టుకోసం ఎట్టి పరిస్థితుల్లోనూ వాడట్లేదనే విషయాన్ని ఎగువ రాష్ట్రాలు గ్రహించాలన్నారు. రాయలసీమ దాహార్తి తీర్చి ఆ ప్రాంత కరవు నివారణ కోసమే వినియోగిస్తున్నట్లు చెప్పారు. సముద్రంలో కలిసే ఉప్పునీటినే వాడుకుంటున్నామని తెలిపారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు పేరిట ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.
పోలవరం బనకచర్లకు అభ్యంతరాలు పెడుతున్న వారికి తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులకు నిబంధనలు ఎందుకు వర్తించవో సమాధానం చెప్పాలని నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. ఎన్నో ప్రాజెక్టులు కెసిఆర్ ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టలేదా అని నిలదీశారు. దిగువ రాష్ట్రమైన ఏపి ప్రయోజనాలు పట్టించుకోకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా అనేక ప్రాజెక్టులు చేపట్టారని గుర్తు చేశారు. కానీ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్న బనకచర్లపై అభ్యంతరాలు చెప్పున్నారని నిమ్మల మండిపడ్డారు.
చంద్రబాబుకు రెండుతెలుగురాష్ట్రాల ప్రయోజనాలు ముఖ్యం. అందుకే అనుమతులు లేకుండా చేపట్టిన తెలంగాణ ప్రాజెక్టులకు అభ్యంతరం చెప్పలేదు. ప్రతీ ఏటా సముద్రంలో కలిసే 3000ల టీఎంసీల గోదావరి నీటిలో 200ల టీఎంసీల నీరు సద్వినియోగం చేసుకోవటం కోసమే పోలవరం- బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదు. పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వాస్తవాలు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెలియాలి అని నిమ్మల పేర్కొన్నారు. 'గోదావరి వరదల వల్లవచ్చే నష్టం దిగువ రాష్ట్రమైన ఏపి మాత్రమే భరిస్తోంది. వరద నష్టం భరిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు వరద జలాలను సద్వినియోగం చేసుకోవటం సహజ న్యాయమైన హక్కు. పోలవరం వల్ల లభ్యమయ్యే వరద జలాలను >>2



ఇజ్రాయెల్ దాడుల్లో మండుతున్న ఇరాన్ షారన్ ఆయిల్ డిపో

# మండుతున్న మధ్యప్రాచ్యం

### ఇరాన్, ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు ముమ్మరం

### పశ్చిమాసియాలో ఎయిర్‌పోర్టులు మూసివేత

### టెల్అవివ్‌పై క్షిపణుల వర్షం కురిపించిన టెహ్రాన్

### జి-7 సదస్సునుంచి ట్రంప్ అర్ధాంతరంగా అమెరికా పయనం

**టెల్అవీవ్, జూన్ 17:** ఇజ్రాయెల్ -ఇరాన్ యుద్ధం ఐదో రోజుకు చేరుకుంది. ఆ దేశాలు ప్రతీకార చర్యలతో రగిలిపోతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమాసియావ్యాప్తంగా ఎయిర్‌పోర్టులను మూసివేయడంతో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గగనతలాలపై ఆంక్షలు విధించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గగనతలాన్ని ఇరాన్ పూర్తిగా మూసివేయగా.. అత్యంత కీలకమైన అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఇజ్రాయెల్ మూసివేసింది. దీంతో లెబనాన్, జోర్డాన్, ఇరాక్‌లోనూ >>2

# అప్పు తీర్చలేదని మహిళను చెట్టుకు కట్టేసి కొడతారా?



బాధిత మహిళతో ఫోన్‌లో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

### కుప్పం ఘటనపై సిఎం చంద్రబాబు ఆగ్రహం

### వారిపై కఠిన చర్యలకు ఆదేశం

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లాలోని కుప్పంలో మహిళపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేసారు. అప్పు తీర్చలేదని కుప్పం నియోజకవర్గం నారాయణపురంలో ఓ మహిళపై దాడిచేశారు. మహిళను చెట్టుకు కట్టేసి మునికన్నప్ప, అతని కుటుంబ సభ్యులు అమానుషంగా వ్యవహరించారు. కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఘటనపై ఇప్పటికే సిఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా ఎస్పీ సిఎం చంద్రబాబుకు తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని స్పష్టంగా ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని జిల్లా అధికారులకు సిఎం చెప్పారు. తిమ్మరాయప్ప అనేవ్యక్తి మునికన్నప్ప వద్ద కొంత అప్పుతీసుకున్నారు. అప్పుల భారం భరించ >>2

## రూ. 5 లక్షల ఆర్థిక సాయం.. పిల్లల చదువుకు హామీ

2లో

### ధైర్యంగా ఉండాలని కుప్పం మహిళ శిరీషకు సిఎం భరోసా



# తిరుపతి ఎయిర్‌పోర్టుకు తిరుమలేశుని పేరు

### విమానయాన శాఖకు సిఫారసు చేసిన టిటిడి బోర్డు

### బెంగళూరులో బాలాజీ ఆలయ నిర్మాణం

### న్యూఢిల్లీలోని ఎస్వీ కళాశాల ఆధునీకరణ


### టిటిడి బోర్డు కీలక నిర్ణయాలు

**తిరుమల, జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి పాదాలచెంతన ఉన్న రేణిగుంటలోని విమానాశ్రయానికి 'శ్రీవేంకటేశ్వర అంతర్జాతీయ విమానాశ్రయం'గా పేరు మార్చాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు పాలక మండలి కీలకంగాచర్చించి పేరుమార్పుకు ఆమోదం తెలుపుతూ కేంద్రవిమానయానశాఖకు సిఫార్సు చేసింది. ఇప్పటికే దేశవిదేశాల నుండి రోజువారీగా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం విమానాల్లో వస్తున్న భక్తులసంఖ్య పెరిగింది. రేణిగుంట విమానాశ్రయానికి స్వామివారి పేరున అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు మార్చడం, తిరుమలకు ఐకానిక్‌గా విమానాశ్రయానికి ఆధ్యాత్మిక శోభను తీసుకువచ్చేలా సిఫార్సు చేశారు. తిరుమలలో భక్తులను ఒకచోట నుండి మరోచోటుకు ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అవసరమైన వంద విద్యుత్‌బస్సులను కేంద్రప్రభుత్వం సమకూర్చేలా కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామి సానుకూలత చూపారు. బెంగళూరులో ప్రధాన ప్రాంతంలో శ్రీవారి నూతన ఆలయం విశాలంగా నిర్మించాలని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ కోరారు. ఆయన కోరికతో ఇందుకోసం 47ఎకరాల స్థలాన్ని కర్నాటక ప్రభుత్వం కేటాయించగానే ఆలయం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఉదయం టిటిడి పాలకమండలి అత్యవసర సమావేశం జరిగింది.
టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి. బోర్డుసభ్యులు జి.భానుప్రకాశ్ రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, జ్యోతుల నెహ్రూ, తమ్మిశెట్టి జానకిదేవి, >>2

# కొల్లేరు ప్రాంతీయుల ప్రయోజనాలు కాపాడుతాం

### ప్రజల సమస్యలు విని, వారి నుంచి వినతి పత్రాలు స్వీకరించిన సిఇసి

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



మంగళవారం కొల్లేరు ప్రజల సమస్యలు పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీ సభ్యులకు వినతిపత్రాలు అందజేస్తున్న దృశ్యం

**కైకలూరు, జూన్, 17(ప్రభాతవార్త):** కొల్లేరు ప్రాంత ప్రజలకు అండగా ఉంటూ వారి ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తామని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో మంగళవారం సాయంత్రం కొల్లేరు ప్రజల సమస్యలు, వారి ప్రస్తుత జీవన పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీ సభ్యులు కొల్లేటికోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి నుండి వినతిపత్రాలు స్వీకరించారు.
ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కేంద్ర సాధికారిక కమిటీ సభ్యులతో కలిసి, రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసినసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో 3లక్షలకుపైగా ప్రజలు నివసిస్తున్నారని, కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణతో పాటు ఆ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు కూడా ముఖ్యమేనన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలు పర్యావరణ ప్రేమికులని, పక్షులను కాపాడుతూ అటవీ చట్టాలను గౌరవిస్తూ ఉంటారన్నారు. పర్యావరణం, పక్షులతోపాటు ఈ ప్రాంతంలోని ప్రజలు కడుపునిండా ఆహారం అందించేలా వారికి న్యాయం చేసేందుకు కృషిచేస్తామన్నారు. కొల్లేరు ప్రాంత సమస్య ఎన్నో దశాబ్దాల నాటిదన్నారు. గతంలో కొల్లేరు ఆపరేషన్ సమయంలో సరిహద్దులు సరిగ్గా గుర్తించని కారణంగా వచ్చిన గందరగోళమని, దాంతో అక్కడి ప్రజల మనుగడ ప్రస్నార్థకమైందన్నారు. ఆ ప్రాంతంలోని జీరాయితీ రైతుల హక్కులు హరించబడ్డాయన్నారు. కొల్లేరు ప్రాంతాల ప్రజల సమస్యలపై డిప్యూటీ >>2

## పట్టాలెక్కనున్న 200 కొత్త రైళ్లు

## ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్‌లతో దాడి

9లో

# 67 వేల మంది టీచర్ల బదలీ

### రికార్డు స్థాయిలో 4 వేల మందికి పైగా పదోన్నతులు

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. 67,732 మందికి స్థానచలనం కలిగింది. అత్యధికంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ) 31,174 మంది బదిలీ అయ్యారు. వీరికి మాన్యువల్‌గా, మిగతా కేటగిరీల వారికి ఆన్ లైన్ వెబ్ ఆధారిత కౌన్సిలింగ్ నిర్వహించారు. కొంత మది ఎస్జీటీలు, స్కూలు అసిస్టెంట్లకు బదిలీలు అయినప్పటికీ, వారు పాత బడుల్లోనే పనిచేయాల్సిన అనివార్యత నెలకొంది. వీరు కొత్త పాఠశాలలో చేరి, పాత పాఠశాలలో కొన్నాళ్లు కొనసాగాల్సి ఉంటుంది. మెగా డిఎస్సీ నియామకాల తర్వాత వీరిని రిలీవ్ చేస్తారు.
కొన్ని చోట్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు బదిలీ అయినప్పటికీ, అక్కడికి కొత్తవారు రాని పక్షంలో పాతవారే కొనసాగాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. సబ్జెక్ట్ టీచర్లలో సగం మంది ఉండాలన్న నిబంధన పెట్టడంతో కొందరు కొత్త పాఠశాలల్లో చేరి, వెనక్కి వచ్చారు. డిఎస్సీ నియామకాల తర్వాత వీరందరూ ఆగస్టులో రిలీవ్ అయ్యే అవకాశం ఉంది.
అత్యధికంగా అనంతపురం జిల్లాలో 7,172 మందికి, అత్యల్పంగా విజయనగరంలో 3,587 మందికి స్థాన చలనం కల్గింది. రాష్ట్ర వ్యాప్తంగా 4,477 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. ఇందులో స్కూలు అసిస్టెంట్ గ్రేడ్-2 గా >>2



ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్‌సింగ్ ధామి మంగళవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌తో భేటీ అయిన దృశ్యం

# ఆరోపణలు అవాస్తవం

>> మాత్రమే బనకచర్ల కోసం సద్వినియోగం చేసుకుంటున్నామని ప్రజలు గ్రహించాలి. ఎక్కడా నికర జలాల్ని వాడకుండా వరద జలాల్ని మాత్రమే వాడుకుంటున్నామని అంతా తెలుసుకోవాలిలని నిమ్మల రామానాయుడు అన్నారు. ప్రతీ ఏటా సగటున 100 రోజులు గోదావరికి వరద వస్తున్న చరిత్ర ఆధారంగా 200 టీఎంసీల వరద జలాల్ని మాత్రమే తీసుకుంటున్నామని నిమ్మల వివరించారు. ప్రాజెక్టుపై ప్రాథమిక నివేదిక సిడబ్ల్యూసికి అందచేయటంతోపాటు అన్నీ నిబంధనల ప్రకారమే ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. సిడబ్ల్యూసి ప్రాథమిక నివేదికకు ఆమోదం తెలిపాకే డిపిఆర్ రూపొందిస్తామని చెప్పారు. పర్యావరణ అనుమతులు వచ్చాకే ఈ ప్రాజెక్టుపై ముందుకెళ్తామని నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గోదావరి జలాలపై ద్వంద్వ వైఖరి అంటూ కెసిఆర్, జగన్ వివిధ సందర్భాల్లో మాట్లాడిన వీడియోలను నిమ్మల రామానాయుడు ప్రదర్శించారు. నాటి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు జగన్ కెసిఆర్‌లు మాట్లాడిన మాటలకు భిన్నంగా ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతల వాదన ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమను కరువు నుంచి కాపాడాలి అంటే గోదావరి వరద జలాల తరలింపు ఒక్కటే మార్గం అని కెసిఆర్ చెప్పారని గుర్తు చేశారు. ఇవాళ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అభ్యంతరం చెప్పడం ఎంతవరకు సమంజసమని నిమ్మల నిలదీశారు. తాజా పరిణామాలపై రాయలసీమ బిడ్డనని చెప్పుకునే నాటి సిఎం జగన్ ఎందుకని నోరు మెదపడం లేదు? అధికారం ఉంటే ఒకలా లేకుంటే మరోలా ఉంటారనే ఇద్దరి నేతల ద్వంద్వ వైఖరి ఇక్కడ స్పష్టమవుతోందన్నారు. తెలంగాణ ప్రాజెక్ట్‌లు అడ్డుకోవాలనే దురుద్దేశాలు చంద్రబాబుకు కానీ ఎపి ప్రభుత్వానికి ఎప్పుడూ లేవు. 75 శాతం పనులు పూర్తయిన సీతారాం సాగర్ లిఫ్ట్‌కు ఇటీవలే అనుమతులు రాలేదా? దేవాదుల, భీమా ఎత్తి పోతల ఇలా అనేక ప్రాజెక్ట్‌లకు చంద్రబాబు సహకరించారు. దిగువ రాష్ట్రాలకు ఉన్న హక్కుల ప్రకారం చంద్రబాబు కొన్ని ప్రాజెక్టల విషయంలో అభిప్రాయం చెప్పారు తప్ప అడ్డుకోలేదు. అపెక్స్‌లో ఇరు రాష్ట్రాల సిఎంల మాటలు మినిట్స్ రూపంలో ఉన్నాయి. రెండు రాష్ట్రాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలన్నదే చంద్రబాబు అభిమతమని వివరించారు. గోదావరి నదికి చిట్ట చివరి రాష్ట్రమైన ఎపిది సహేతుక వాదనఅని నిమ్మల స్పష్టం చేశారు.

# వ్యర్థాల నుంచి సంపద సృష్టి

>> ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల నుంచి సర్క్యులర్ ఎకానమీ సృష్టించేలా కేంద్రం కార్యాచరణ ఉందన్నారు. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ (సర్క్యులర్ ఎకానమీపై ఉత్పత్తి, వినియోగానికి సంబంధించి మాదిరి కరమైన ప్రయోగాలు చేయవచ్చునన్నారు., దీనిలో వీలైనంతకాలం ఉన్న పదార్థాలు,. ఉత్పత్తులను పంచుకోవడం, లీజుకు ఇవ్వడం, తిరిగి ఉపయోగించడం, మరమ్మత్తు చేయడం, పునరుద్ధరించడం మరియు రీసైక్లింగ్ చేయడం వంటివి సర్క్యులర్ ఎకానమీలో కీలకమన్నారు., ఈ విధంగా, ఉత్పత్తుల సుదీర్ఘ నాణ్యత విలువలతో ఉంటాయన్నారు. ఇక ఆచరణలో, ఇది వ్యర్థాలను కనిష్ట స్థాయికి తగ్గించడాన్ని సూచిస్తుంది. ఒక ఉత్పత్తి దాని జీవితకాలం ముగిసినప్పుడు, రీసైక్లింగ్ ద్వారా సాధ్యమైన చోట దాని పదార్థాలు ఆర్థిక వ్యవస్థలోనే ఉంచబడతాయి. వీటిని మళ్లీ మళ్లీ ఉత్పాదకంగా ఉపయోగించవచ్చు, తద్వారా మరింత విలువను సృష్టించవచ్చు ఇది సాంప్రదాయ, సరళ ఆర్థిక నమూనా నుండి నిష్క్రమణ, ఇది టేక్‌మేక్‌కంస్యూమ్‌త్రో అవే నమూనాపై ఆధారపడి ఉంటుంది. ఈ నమూనా పెద్దమొత్తంలో చౌకైన, సులభంగా అందుబాటులో ఉండే పదార్థాలుశక్తిపై ఆధారపడుతుంది. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై ప్రధానంగా చర్చించారు. సర్క్యులర్ ఎకానమీ పార్కులు ఏర్పాటుపై మెటీరియల్ రీసైక్లింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలను పరిశీలించారు. మొదటిదశలో భాగంగా విశాఖపట్నంలో 400 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న సర్క్యులర్ ఎకానమీ పార్కును అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని, ఇందుకోసం వివిధ దేశాల్లోని పార్కులను పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వీటితో భారీగా పెట్టుబడులు వచ్చేలా చూడాలని చెప్పారు.

**సర్క్యులర్ ఎకానమీ ప్రయోజనాలు**

రాష్ట్రంలో సర్క్యులర్ ఎకానమీ సమర్ధంగా అమలు చేయగలిగితే జిఎస్డీపీకి ఏడాదికి అదనంగా రూ.15,000 కోట్లు జత చేరుతుందని అంచనా. అలాగే మరో రూ.10,000 కోట్ల విలువైన మెటీరియల్‌ను ఉత్పత్తి రంగానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ విలువ జోడింపుతో రాష్ట్రం జిఎస్టీ రూపంలో రూ.3,000 కోట్ల ప్రతీ ఏటా ఆర్జించవచ్చు. మరోవైపు ప్రత్యక్షంగా 1,00,000 మందికి ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి. 10 వేల మైక్రో ఎంట్రప్రెన్యూర్లకు ఉపాధి లభిస్తుంది. దీంతోపాటు పరోక్షంగా 10 లక్షల మందికి ఉపాధి కలుగుతుంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కర్బన వాయువుల విడుదల తగ్గుతుంది. భూ, జల, వాయ కాలుష్యాన్ని గణనీయంగా అరికట్టవచ్చు.

**ప్లాస్టిక్ రహిత నగరాలు**

ఈ ఏడాది అక్టోబర్ 2 కల్లా రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, రాజమండి. 4 నగరాలతో పాటు మరో 17 కార్పొరేషన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా అరికట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ నగరాల్లో క్లాత్ బ్యాగులు వినియోగాన్ని పెంచాలని చెప్పారు. అలాగే 87 పట్టణ ప్రాంతాల్లో 157 రెడ్యూస్‌రీయూజ్‌రీసైకిల్ సెంటర్ల ఏర్పాటు చేయాలని నిర్దేశించారు.

జిల్లాకు రెండు చొప్పున రాష్ట్రంలోని పట్టణాలు, పంచాయతీ ప్రాంతాల్లో మొత్తం 52 వేస్ట్ క్లస్టర్లు ఏర్పాటు చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రం నుంచి ప్రతీ ఏటా బ్యాటరీలు, ఇతర ఆటోమోటివ్ వ్యర్థాలు 36,588 టన్నులు, ప్లాస్టిక్ పెట్ బాటిల్స్ వేస్ట్ 61,996 టన్నులు, ఇంజిన్ ఆయిల్స్ ఇతర హైడ్రాలిక్ చమురు వ్యర్థాలు 23,928 లీటర్లు, టైర్లురబ్బర్ 59,654 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అత్యధికంగా వ్యవసాయరంగం నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు, పశువులు ఆక్వాపౌల్ట్రీ ఈ మూడు రంగాల నుంచి 347 లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ రోజూ 88 లక్షల గృహాల నుంచి 1,329 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు వస్తున్నాయని తెలిపారు. రాజస్థాన్, కర్నాటక, మహారాష్ట్రలో సర్క్యులర్ ఎకానమీ కోసం అందిస్తున్న ప్రోత్సాహకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మరణించిన పైలట్ సుమిత్ సబర్వాల్ భౌతిక కాయానికి మంగళవారం ముంబయిలో నివాళులర్పిస్తున్న తండ్రి, బంధువులు

# మన ఆరోగ్యానికి మహా 'యోగా'

>> అంతర్భాగమని, ఇది శరీరం మరియు మనస్సు మధ్య సంపూర్ణ సమతుల్యతను సాధించడంలో సహాయ పడుతుందన్నారు. అంతేకాకుండా యోగా సమగ్రమైన, ప్రశాంతమైన మరియు సంతృప్తికరమైన జీవనశైలి వైపు మనకు మార్గనిర్దేశం చేస్తుందన్నారు. శారీరకంగా మరియు మానసికంగా సాధికారత పొందిన పౌరులు దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన, ప్రభావవంతమైన పాత్ర పోషిస్తారన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో యోగా ఒక శక్తివంతమైన సాధనమన్నారు. యోగా ద్వారా మనం స్వావలంబన మరియు అభివృద్ధి చెందిన భారతదేశం అనే మన జాతీయ సంకల్పాన్ని మరింత బలంగా, వేగంగా సాధించ గలుగుతామన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి పంచాయతీ పరిధిలో జూన్ 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వీలైనంత ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలని కోరారు. ఈ మహత్తర కార్యక్రమంలో అందరూ పాల్గొనేలా, బహిరంగ ప్రదేశాల్లో సామూహిక యోగా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా పంచాయితీ భవన్, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వంటి ప్రదేశాల్లో నిర్వహించాలని సూచించారు. దీనివల్ల పిల్లలు, యువత, మహిళలు మరియు పెద్దలు సహా అన్ని వర్గాల ప్రజలు యోగా వల్ల ప్రయోజనాలు పొంది, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచు కోగలరన్నారు. అందరం కలిసి ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో ప్రజలు యోగాను తమ దైనందిన జీవితంలో ఒక అంతర్భాగంగా చేసుకోవడానికి గొప్ప ప్రేరణనిస్తుందని ప్రధాని గట్టిగా విశ్వసిస్తున్నానన్నారు. యోగా ద్వారా వారు మరింత ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవితం వైపు అడుగులు వేస్తారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఆశిస్తున్నానని ఆ లేఖలో పేర్కొన్నారు.

# బెంగళూరు ఎయిర్‌పోర్టులో వైసిపి నేత చెవిరెడ్డికి ఝలక్

## లుకౌట్ నోటీసు కింద చెవిరెడ్డిని అడ్డుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు

**తిరుపతిరూరల్, జూన్17 ప్రభాతవార్త:** బెంగళూరు ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు వెళ్లాలనుకున్న వైఎస్సార్సీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అనుమతి లభించలేదు. చెవిరెడ్డిపై లుకౌట్ నోటీసులు ఉండటంతో ఎయిర్‌పోర్టు పోలీసులు అదుపులోకి తీసుకుని విజయవాడ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. తనపై కేసులు లేవని, ఎఫ్ఐఆర్‌లు లేవని, అయిన ఎందుకు ఆపారని చెవిరెడ్డితో పోలీసులతో వాగ్వివాదానికి దిగినట్లు తెలుస్తోంది. తాజాగా చెవిరెడ్డిపై లిక్కర్ కేసుతో పాటు మనీ లాండరింగ్‌లో ప్రధాన పాత్ర పోషించినట్లు కీలకమైన వ్యక్తులు అసలు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల సమయంలో దొరికిన ఎనిమిది కోట్లకు లెక్కలున్నాయని, ఆడబ్బులు తనవి కాదని చెప్పుకున్న విషయం తెల్సిందే. దీంతో పాటు పోలీసులను బెదిరించిన ఘటనలు, ఇతర కేసులు ఆయనపై చాలానే ఉన్నాయి. సైలెంట్‌గా బెంగళూరు ఎయిర్‌పోర్టు నుండి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేసారని ఆరోపణలు ఉన్నాయి. చెవిరెడ్డిని అదుపులోకి తీసుకున్న ఎపి పోలీసులు సిట్ అధికారులకు అప్పగిస్తే విచారణ చేస్తారా లేక వదిలేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

# టీచర్ల బదలీ

>> 1,375, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా 1,592, స్కూల్ అసిస్టెంట్‌లుగా 1,510 మందికి పదోన్నతులు లభించాయి. ఎక్కడా ఆరోపణలు, విమర్శలు లేకుండా ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలను క్రమబద్ధీకరించారు. సబ్జెక్ట్ టీచర్లలో అత్యధికంగా గణితం టీచర్లు 346 మందికి, అత్యల్పంగా సంస్కృత భోధకులిద్దరికి పదోన్నతులు లభించాయి.

# ప్రయోజనాలు కాపాడుతాం

>> స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యేలు డా. కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు ప్రభృతులు కేంద్ర పర్యావరణ శాఖ మంత్రివర్యులు భూపేంద్రయాదవ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించగా, సుప్రీం కోర్ట్ కేంద్ర సాధికార కమిటీని నియమించిందని, ఇది కొల్లేరు ప్రాంత ప్రజల మొదటి విజయమన్నారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణతో పాటు ప్రజల జీవనస్థితిగతులు కూడా పరిశీలించి ఇక్కడి ప్రజలకు న్యాయం జరిగేలా కేంద్ర సాధికార కమిటీ నివేదిక ఇస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను ఈ ప్రాంత ఎమ్మెల్యేలు అందరూ కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి వారికి న్యాయం చయవలసిందిగా కోరామని, అదేవిధంగా కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణి సంరక్షణకు ఎటువంటి విఘాతం కలగకుండా ఉండేలా కొల్లేరు పరిధిని కాంటూర్ 5 నుండి 3 కు తగ్గించేందుకు కోరామన్నారు. కొల్లేరు ఆపరేషన్ సమయంలో భూములు కొల్పిన రాయితీ భూమిదారులకు పరిహారంగా 5వ కాంటూర్ బయట భూమి అందించాలని కోరామన్నారు. కొల్లేరు ప్రాంత ప్రజలకు న్యాయం చేసేందుకు కృషిచేస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా కొల్లేరుప్రాంతంలో పక్షులను కాపాడుకుంటాం, పర్యావరణాన్ని పరిరక్షిస్తామని అక్కడి ప్రజల చేత రఘురామకృష్ణరాజు ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో 122 గ్రామాలున్నాయని, కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణ, ప్రజల సమస్యలను పరిశీలించేందుకు కేంద్ర సాధికార కమిటీ సభ్యులు రెండురోజులపాటు జిల్లాలో పర్యటిస్తారన్నారు. కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, కొల్లేరు ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెంచి, కొల్లేరు సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఉప్పుటేరులో ఆక్రమణల కారణంగా వర్షాకాలంలో వరదల సమయంలో కొల్లేరు ప్రాంతంలో నీరు నిలబడి కొల్లేరు ప్రాంతంలోని గ్రామాలు ముంపు భయాన్ని ప్రతీ ఏటా ఎదుర్కొంటున్నాయన్నారు. కొల్లేరు ప్రాంతంలో పర్యావరణం, వన్యప్రాణులతో పాటు ఆ ప్రాంతంలో జీవించే ప్రజల జీవన స్థితిగతులను కూడా కమిటీ సభ్యులు పరిశీలించాలని కోరారు. దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు ఎన్నోదశాబ్దాలుగా కొల్లేరు ప్రాంతంలో జీవిస్తున్న ప్రజలకు కూడా రక్షణ కల్పించాలని కోరారు. వారి మనోభావాలను కూడా పరిగణనలోనికి తీసుకోవాలన్నారు. కేంద్ర సాధికార కమిటీ గౌరవ సభ్యులు చంద్రశేఖర్ గోయల్ మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ పరిమితులకు లోబడి కొల్లేరు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల స్థితిగతులను కూడా పరిశీలించి నివేదిక అందించడం జరుగుతుందన్నారు.

# రూ. 5 లక్షల ఆర్థిక సాయం.. పిల్లల చదువుకు హామీ

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరు జిల్లా ,కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించినఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్ర బాబు నాయుడు మాట్లాడారు. ఫోన్‌లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమెచెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని.. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి...అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుం టుందని శిరీషకు ఫోన్‌లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందు బాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సిఎం అధికారులను ఆదేశించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిరీష

# మహిళను చెట్టుకు కట్టేసి కొడతారా?

>> లేక తిమ్మరాయప్ప గ్రామం వదిలి వెళ్లిపోయారు. ఈ క్రమంలో తిమ్మరాయప్ప భార్యను అప్పు చెల్లించాలని గొడవపడి, మునికన్నప్ప, ఆయన కుటుంబ సభ్యులు ఆమెను చెట్టుకు కట్టేశారు. వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే స్పందించిన సిఎం చంద్రబాబు బాధితురాలి పట్ల దారుణంగా ప్రవర్తించిన మునికన్నప్పతో పాటు అతని కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా పోలీసులు చూడాలని ఆదేశించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలని జిల్లా అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. కుప్పం పురపాలిక పరిధిలోని నారాయణపురం అనే గ్రామంలో సోమవారం ఈ విషయం వెలుగు చూసింది. పోలీసుల సమాచారాన్ని అనుసరించి నారాయణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన మునికన్నప్ప దగ్గర రూ.80 వేలను అప్పుగా తీసుకున్నాడు. అప్పుల భారం భరించలేక ఊరు విడిచిపెట్టి వెళ్లిపోగా, అతని భార్య పుట్టిల్లు శాంతిపురం మండలంలో ఉండి కూలీ పనులు చేసుకుంటూ కుమారుడిని పోషిస్తున్నారు.

ఈ క్రమంలో నారాయణపురం పాఠశాలలో కుమారుడి టిసి తీసుకునేందుకు వచ్చిన ఆమెను మునికన్నప్ప, అతని భార్య మునెమ్మ, కుమారుడు రాజా, కోడలు జగదీశ్వరి పట్టుకొని భర్త తీసుకున్న డబ్బు చెల్లించాలని తీవ్రంగా వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజుల్లో డబ్బులను తిరిగి చెల్లిస్తామని ఆమె చెప్పినా వారు వినిపించుకోలేదు. ఆమెను చెట్టుకు కట్టి విచక్షణారహితంగా దాడి చేయగా స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహిళను విడిపించారు. ఈ ఘటనలో బాధితురాలు స్కూల్‌లో నా పిల్లల టిసి తీసుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చానని వివరించారు, నాపై దాడి చేసిన వాళ్లు గతంలో నాతో సంతకం చేయించుకొని రూ.80 వేలు అప్పు ఇచ్చారు. నేను అప్పు కట్టేస్తాను అని ఎంత చెప్పినా వినలేదు. నేను వస్తానని ముందుగానే తెలుసుకున్న వారు అక్కడికి వచ్చి ఉన్నారు. ఆ తరువాత నన్ను లాక్కెళ్లి చెట్టుకు కట్టేశారు. ఇంకా వేరే వాళ్ల దగ్గర కూడా మాకు అప్పు ఉంది. వాళ్ల దగ్గర కూడా మాకు చాలా ప్రమాదం ఉంది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. నన్ను కొడుతుంటే మా అమ్మను కొట్టొద్దంటూ నా కొడుకు ఏడుస్తూ వాళ్ల కాళ్లు పట్టుకున్నా వదలేదు. నేను ఎంత వేడుకున్నా వదలలేదు. ఇక్కడ మాకు ఎవరూ లేరు. మమ్మల్ని చంపేస్తాం అని బెదిరించారు. ఇంక మా పిల్లలు స్కూల్‌కి వెళ్లి వచ్చేటప్పుడు వాళ్లని బెదిరించేవారు. వాళ్లు నాకు ఫోన్ చేసి ఏడ్చేవారు. ఒకప్పుడు మేము బాగా బతికేవాళ్లమని భాదితురాలు ఫిర్యాదులోని అంశాలను పోలీసులు సిఎం చంద్రబాబుకు వివరించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి తక్షణం స్పందించిన సిఎం చంద్రబాబు జిల్లా ఎస్పీతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనతో పాటు ఇటువంటి అప్పుల వాళ్ల వేదింపులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులపై స్పందించాలన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 18-06-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి మ.1.35
పూర్వాభాద్ర రా.12.24
వర్జ్యం రా.9.48-12.38
దు.ఉ.11.42-మ.12.35
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు. సోదరుల నుండి ధనలాభం పొందుతారు.

**వృషభం :** పోటీ పరీక్షలలో, ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మిథునం:** చేజారిన విలువైన డాక్యుమెంట్లు లభ్యమవుతాయి. కోర్టుకేసులనుండి బయటపడతారు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**సింహం :** కొత్త కార్యక్రమాలను చేపట్టినా సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**కన్య :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. కోపతాపాలకు దూరంగా వుండండి.

**తుల :** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**వృశ్చికం:** అకారణంగా వివాదాలు ఏర్పడతాయి. జాగ్రత్త అవసరం. సమస్యలు కొంతవరకు తీరుతాయి.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాలవారు అరుదైన సత్కారాలు పొందుతారు. వస్తులాభం.

**మకరం:** దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారంవల్ల కొంత ఊరటచెందుతారు.

**కుంభం :** ఉన్నత హోదాల్లోని వారితో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**మీనం :** పనులు శ్రమానంతరం పూర్తికాగలవు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు. ధన లాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మండుతున్న మధ్యప్రాచ్యం

>> విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు, తమ అణు స్థావరాలను ధ్వంసం చేయడంతో అత్యున్నత సైనికాధికారులను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో సోమవారం ఉదయం క్షిపణుల వర్షం కురిపించింది.

టెల్‌అవీవ్, పెటా తిక్వా ప్రాంతాల్లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. దట్టమైన నల్లటి పొగ అలముకుంది. ఈ దాడుల్లో కనీసం 8 మంది ఇజ్రాయెల్ పౌరులు మృతి చెందారు. పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ క్రమంలో టెహ్రాన్ విమానాశ్రయమే లక్ష్యంగా టెల్‌అవీవ్ దాడులు చేసింది. రెండు ఎఫ్-14 యుద్ధ విమానాలు ధ్వంసం అయ్యాయి. దీనిని సంబంధించిన విడియోను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ విడుదల చేసింది.

**జి-7 సదస్సు నుంచి అర్థాంతరంగా ట్రంప్ పయనం**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేతసౌధంలోని సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి, జి-7 సదస్సు నుంచి హుటాహుటిన స్వదేశానికి పయనమయ్యారు. దీంతో పశ్చిమాసియాలో ఏవో కీలక పరిణాలు చోటుచేసుకుంటున్నాయన్న సంకేతాలు ప్రపంచానికి వెళ్లాయి. గతంలో అల్‌ఖైదా అగ్రనేత బిన్‌లాడెన్, ఐసిస్ నాయకుడు అబూబకర్ అల్ బాగ్దాదీని అమెరికా సేనలు మట్టుపెట్టినప్పుడు కూడా అగ్రరాజ్యాధినేత ఈ గదిలోనే ఉండి ఆపరేషన్లు పరిశీలించారు.

**తక్షణమే టెహ్రాన్‌ను వీడండి.. భారతీయులకు ఇండియన్ ఎంబసీ అడ్వైజరీ**

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారతీయులకు ఇండియన్ ఎంబసీ తాజాగా మంగళవారం మళ్లీ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారతీయులంతా వెంటనే నగరాన్ని వీడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించింది. ఇప్పటివరకు ఎంబసీని సంప్రదించని భారతీయులు.. తక్షణమే అధికారులతో మాట్లాడి తమ లోకేషన్లను షేర్ చేయాలని సూచించింది. ఈ క్రమంలో హెల్ప్‌లైన్ నంబర్లు +98 9010144557, +98 9128109115, +98 9128109109 లకు తమ వివరాలు తెలియజేయాలని కోరింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. అమెరికా రాయబార కార్యాలయంతోపాటు పలు కార్యాలయాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి 'ఆలస్యం చేయకుండా నగరాన్ని వీడాలి' అంటూ భారతీయుల కోసం భారత రాయబార కార్యాలయం అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం ఇరాన్‌లో సుమారు 10,000 మంది భారతీయులు ఉన్నట్లు ఓ అంచనా. వీళ్లలో ఆరు వేల మందికిపైగా విద్యార్థులే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**ఇరాన్ నుంచి 110 భారతీయ విద్యార్థుల తరలింపు**

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో భారత్ అప్రమత్తం అయింది. భారతీయులను అలర్ట్ చేసింది. తక్షణమే ఖాళీ చేయించాలని సూచించింది. ఇందులో భాగంగా 110 మంది భారతీయ విద్యార్థులతో కూడిన మొదటి బ్యాచ్ అర్మేనియ చేరుకుంది. బుధవారం ఉదయం కల్లా ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు తరలించనున్నారు. ఈ మేరకు భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసింది. ఇక సొంత వనరులు కలిగిన వారు కూడా తరలి వెళ్లాలని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

**ఖమేనీ అంతంతోనే యుద్ధం ముగింపు: నెతన్యాహు**

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా ఖమేనీని అంతం చేస్తేనే యుద్ధం ముగుస్తుందని స్పష్టం చేశారు. ఖమేనీని హత్య చేసేందుకు వేసిన ప్లాన్‌ను ట్రంప్ వ్యతిరేకించారంటూ అమెరికా అధికారులు ధ్రువీకరించిన తర్వాత నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు.

# తిరుమలేశుని పేరు

>> నరేశ్, సదాశివరావు, శాంతారామ్, రామ్మూర్తి, కృష్ణమూర్తి పాల్గొన్నారు. కీలకంగా నిర్ణయించిన వివరాలను మధ్యాహ్నం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు క్యాంపు కార్యాలయంలో మీడియాప్రతినిధులకు వివరించారు. బెంగుళూరు పయ్యావలికావలిలోని టిటిడి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని, శ్రీనివాసకల్యాణంలో పాల్గొన్నానన్నారు. ఆ ఆలయం చిన్నదిగా ఉండటంతో విశాలంగా భక్తులు మరింతమంది దర్శనం చేసుకునేలా నిర్మించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి శివకుమార్ కోరారన్నారు. వారి అభ్యర్థన మేరకు బెంగుళూరునగరంలోని ప్రధానప్రాంతంలో టిటిడి ఆలయాన్మి నిర్మించనుందన్నారు. తిరుపతిలో కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేయనున్న సిఎస్ఐఆర్ ల్యాబ్‌కు అద్దెప్రాతిపదికన టిటిడి స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించింది. తద్వారా టిటిడి అవసరాలకు వినియోగించే నెయ్యి, నీరు, ఆహారపదార్థాల నాణ్యతను ఉచితంగా తనిఖీ చేసేందుకు అవకాశం కలుగుతుంది. 1952లో ఏర్పాటుచేసిన న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక ఎస్వీకళాశాలను ఆధునీకరించాలని నిర్ణయం తీసుకున్నారు. సమరసతాసేవాఫౌండేషన్ సహకారంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న అర్చకుల శిక్షణకార్యక్రమంతోబాటు వివిధ వ్రతాలు, పూజా విధానాలలో కూడా శిక్షణాకార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం. అలాగే అక్షరగోవిందం, హరికథావైభవం, భగవద్గీత అనుష్టాన బోధన, భజేశ్రీనివాసం, వన నిధి, గిరి జనార్ధనం, సన్మార్గం వంటి కార్యక్రమాలను నిర్వహించి జనబాహుళ్యంలోనికి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టేలా చర్చించారు. టిటిడి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు హిందూ సనాతన ధార్మిక విలువలతోబాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు 120కోట్లు రూపాయలు ఖర్చుచేయనున్నారు. ఆగస్ట్‌లో వరలక్ష్మీవ్రతం పర్వదినాన తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయంలో సౌభాగ్యం పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం. టిటిడిలో అధ్యాపకుల పోస్టుల భర్తీని నిలిపివేయాలని ఎపిపిఎస్‌సికి సిఫార్సు చేశారు. ఇప్పటికే పనిచేస్తున్న 200మంది కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో దేవాదాయశాఖమంత్రి, టిటిడి ఛైర్మన్, టిటిడి ఇఒలతో త్రిసభ్యకమిటీ ఏర్పాటు జరిగింది. దళితవాడల్లో శ్రీవాణి నిధులతో ఆలయాల నిర్మాణంపై చర్చించారు.

18-06Pg3exHMNWJQERCLK.qxd:18-06Pg3exHMNWJQERCLK.qxd 01/01/01 8:27 AM Page 1



# ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యాచరణ

## -15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపకల్పన: సిఎం చంద్రబాబు

**విజయవాడ.,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఆదాయం వృద్ధి గణనీయంగా పెంచే దిశలో కీలక కార్యచరణ చేపట్టినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. జాతీయవృద్ధి రేటుతో పొల్చుకుంటే ఇప్పటికే మన గ్రోత్ ఉందన్నారు.,15శాతం వృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మంగళవారన సాయంత్రం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, జీఎస్డీపీ అంచనాలు, అభివృద్ధి సూచికలు, గ్రోత్ డ్రైవర్స్ వంటి అంశాలపై చంద్రబాబు అధికారులతో చర్చించారు. ఈ సమీక్షలో ప్రణాళిక శాఖ దృష్టి సారించాల్సిన వివిధ అంశాలపై ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. రుణాలు తగ్గించుకోవడం, సంక్షేమానికి వనరులు సమకూర్చుకోవడం వంటివి అత్యంత కీలక అంశాలని చంద్రబాబు వివరించారు. వనరుల సమీకరణలో రాష్ట్ర సొంత ఆదాయం, కేంద్రం నుంచి వచ్చే నిధులతో పాటు కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక శాఖ పని చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేందుకు అవసరమైన ప్రామాణిక సమాచారాన్ని రూపొందించుకోవాలన్నారు. ఈ దిశగా ప్రణాళిక శాఖ పనితీరు మెరుగు పరుచుకోవాలని చంద్రబాబు చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఏపీ బ్రాండ్ ప్రమోషన్ నిరంతరం జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 25 కెబినెట్ సమావేశాలు, 25 ఎస్ఐబీపీ సమావేశాలు నిర్వహించి.. పెద్ద ఎత్తున పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చామని గుర్తు చేశారు. ఇక్కడితో ఆగకుండా.. ఆ ప్రాజెక్టులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఏపీ సచివాలయంలో ప్లానింగ్ శాఖ ఏపీ ఎకానమీ, గ్రోత్ డ్రైవర్స్, జీఎస్డీపీ ప్రొజెక్షన్స్, కీ పెర్ఫామెన్స్ ఇండికేటర్లపై సీఎం చంద్రబాబు సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేస్తూ 2024- 25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయికిమించి ఏపీ తలసరి ఆదాయం పెరిగిందన్నారు. ఈ మేరకు అధికారులు తమ నివేదికలో వివరించారన్నారు.

దీనిపై వారి నుంచి స్పష్టతను సీఎం చంద్రబాబు కోరారు. 2024- 25కు జాతీయ స్థాయిలో సరాసరి తలసరి ఆదాయం 8.7 శాతంగా ఉంటే.. ఏపీ 11.89 శాతం నమోదు చేసిందని తెలిపిన అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు, ఇది సంతృప్తికర అంశమైనప్పటికి మరింతగా తలసరి ఆదాయం, జీఎస్డీపీ, రాష్ట్రాదాయాలు ఎలా పెరుగుతాయనే అంశంపై మనం దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అన్నారు. అందుకు తగినట్లు అంచనాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు అన్నారు.

# మహిళల రక్షణ, సాధికారతే జాతీయ మహిళా కమిషన్ లక్ష్యం

## - ఉమెన్స్ కమిషన్ జాతీయ సభ్యురాలు డాక్టర్. అర్చన మజుందార్



మీడియాతో మాట్లాడుతున్న జాతీయ మహిళా కమీషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** బాలికలు, మహిళల రక్షణ, వారి హక్కుల పరిరక్షణ కు మహిళా కమిషన్ కృషి చేస్తుందని జాతీయ విమెన్స్ కమిషన్ మెంబర్ శ్రీమతి. డాక్టర్. అర్చన మజుందార్ అన్నారు. దేశంలో ఎక్కడ మహిళకు అన్యాయం జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జాతీయ మహిళా కమిషన్ మూడు రోజుల రాష్ట్ర పర్యటన లో భాగంగా మొదటి రోజు మంగళవారం విజయవాడలోని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పాత ప్రభుత్వ వైద్యశాలను జాతీయ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్. అర్చన మజుందార్ సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మజుందార్ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై దాడులకు పాల్పడితే చర్యలు తప్ప వన్నారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురిచేసినా, దాడులు చేసినా మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 10 మంది కంటే ఎక్కువ సిబ్బంది పనిచేస్తున్న ఏ వ్యాపార సంస్థలైనా, విద్యాసంస్థలైనా, కార్యాలయాలైనా ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆ కమిటీని సీనియర్ మహిళా ఉద్యోగిని ఆధ్వర్యంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవా లన్నారు. మహిళల రక్షణ కోసం 24 గంటలు మహిళా కమిషన్ అందుబాటులో ఉంటుందని, బాధితులు ఏ సమయమైనా తమకు ఫిర్యాదు చేయవచ్చని, తక్షణం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బాలికలు, మహిళల రక్షణ కోసం, వారి సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ) ఏర్పాటు చేశారా లేదా అని జాతీయ మహిళా కమిషన్ మెంబర్ అర్చన మజుందార్ వాకబు చేశారు. వారం రోజుల్లో ఐసీసీ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కళాశాలలో మహిళ రక్షణ చర్యలపై డిస్ ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని, హెల్ప్ లైన్ నెంబర్ లు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు, కళాశాల ఉద్యోగులు, ఫ్యాకల్టీల సమస్యలను మొదట ఐసీసీ కమిటీ లో పరిష్కర మయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డా. రాయపాటి శైలజ మాట్లాడుతూ ఐసీసీ ద్వారా బాధిత మహిళకు న్యాయం జరగపోతే రాష్ట్ర, జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

# జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్‌రోడ్‌లకు భూసేకరణ వేగవంతం చేయండి

## - ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ హైదరాబాద్ సెక్షన్ లో జాతీయ రహదారి ఎన్‌హెచ్ 65ను ఆరు వ్రలెన్ల రహదారిగా విస్తరణ, పెడన విసన్నపేట 216ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ పనులను వేగవంతం చేసి నివేదికలను సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల విస్తరణ, అవుటర్ రింగ్‌రోడ్‌లకు భూసేకరణ, మెట్రో రైలు ప్రాజెక్టు భూసేకరణకు జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహణ వంటి పలు అంశాలపై మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ సంబంధిత అధికారులతో కలెక్టరేట్ లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా హైదరాబాద్ విజయవాడ ఎన్ హెచ్ 65 రహదారికి సంబంధించి 226 కి.లో మీటర్ల ఆరు వ్రలెన్ల విస్తరణలో భాగంగా నందిగామ డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగ్రంచిప్రోలు మండలాలలో జాతీయ రహదారుల అధికారులకు ఎన్‌జాయిమెంట్ సర్టిఫికెట్లకు సంబంధించి ప్రతిపాదనలు పంపవలసి ఉందన్నారు. అనుమంచిపల్లి, షేర్‌మహమ్మద్‌పేట, తోటచర్ల, భీమవరం గ్రామాలకు సంబంధించి ఆయా మండల తహశీల్దార్లు ప్రతిపాదనలు సమర్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెడన విసన్నపేట 216 ఎన్‌హెచ్ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించి జిల్లాలో విసన్నపేట తిరువూరు మండలాలలో 9 గ్రామాల నుండి ప్రతిపాదనలు రావాల్సి ఉండగా 5 గ్రామాలకు ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మిగిలిన గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరువూరు ఆర్‌డివోకు సూచించారు. అవుటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారుల అధికారులు అవసరమైన భూమికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని రికార్డులను పరిశీలించి 3ఏ రిపోర్టు తయారు చేసి పంపాలన్నారు. ఇందుకు సంబంధించి కంచికచర్ల, మైలవరం, జి. కొండూరు మండలాలలో 3ఏ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.

# పాఠశాలలకు తాళాలు వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

## - మోడల్ ప్రైమరీ పాఠశాల మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కావాలి

## - పాతపద్ధతినే కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల నిరసన

**పామిడి, జూన్ 17 ప్రభాతవార్త:** మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చిన విద్యాశాఖాధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాలకు తాళాలు వేసిన సంఘటన మంగళవారం అనంతపురం జిల్లా పామిడి మండలం రామగిరి గ్రామంలో చోటుచేసుకుంది. మోడల్ ప్రైమరీ పాఠశాల మాకొద్దు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కావాలి.. అధికారులారా మా పిల్లల భవిష్యత్తుతో చెలగాటమా..? అంటూ మండిపడ్డారు. 2025-26 విద్యాసంవత్సరం ఇక్కడ 1వ తరగతి నుండి 5వ తరగతి వరకే కొనసాగించటం జరుగుతుందని మిగిలిన 6,7,8వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులంతా ఎద్దులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్ళాలంటూ అధికారులు ఆదేశిస్తుండటం ఎంతవరకూ సమంజమని ప్రశ్నిస్తూ గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలనే కొనసాగించాలని డిమాండ్ చే శారు. మండల పరి షత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చివేసిన అధికారులు మిగిలన తరగతులను ఎద్దులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వీలినం చేస్తూ ఇక్కడ విద్యనభ్యశిస్తున్న పిల్లల (విద్యార్థుల) జీవితాలతో చెలగాటం అడుతున్నట్లైనని వెంటనే ఇక్కడ పాతపద్ధతినే కొనసాగించాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఇక్కడి మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు విద్యనభ్యశించేందకు అన్ని రకాల అవకాశాలు ఉన్నప్పటికీ ఈ పాఠ శాలలో కేవలం 5వ తరగతి వరకే

విద్యార్థులు విద్య నభ్యశించాలని మిగిన 6,7,8వ తరగతుల విద్యార్థులు ఎద్దులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశా లలో విద్యనభ్యశించాలని ఆదేశించటం దారుణం అంటూ ఎంఈఓ ఎద్దుట నిరసనకు దిగారు.



పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు

# సజ్జల పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంత ప్రజలను ఉద్దేశించి 'సంకరజాతి' అంటూ వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిలు కోసం వేసిన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. సజ్జలపై రాజధాని రైతు దళిత జెఏసీ నాయకురాలు కంభంపాటి శిరీష తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. సజ్జల తరపు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఇదే వ్యవహారంపై శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు...డిజీపీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ ఫిర్యాదు ఆధారంగా పిటీషనర్‌పై తొందరపాటు చర్యలొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని గుర్తు చేశారు. అలాంటి ఉత్తర్వులనే ప్రస్తుత పిటీషన్ లోనూ ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ...శిరీష ఫిర్యాదుపై ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి పూర్తి వివరాలు సమర్పించాలని పేర్కొంటూ విచారణను ఈ నెల 18కి వాయిదా వేశారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన సంగీత దర్శకుడు శివమణి

**విజయవాడ, జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ చంద్రబాబు నాయుడుని ప్రఖ్యాత సంగీత వాయిద్యకారుడు,దర్శకుడు శివమణి కలిసారు. అమరావతి క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసిన శివమణి కొద్దిసేపు ఆయనతో ముచ్చటించారు. ఆయన సంగీత వాయిద్య ప్రదర్శనలు పలు మార్లులు చూసి తన్మయానికి లోనయినట్లు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించే దిశలో పాలసీలు రూపొందిస్తున్నామని తెలిపారు. సంగీత కళాకారుల ప్రతిభకు పట్టగడతామన్నారు. తన కుమారుడి వివాహానికి రావాల్సిందిగా సీఎం చంద్రబాబుకు శివమణి ఆహ్వానపత్రిక అందించారు. శివమణిని సీఎం చంద్రబాబు సముచిత రీతిన సత్కరించారు.

# యువత నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు యోగా దోహదం: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** యువత నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నిరంతరం యోగా ఎంతో దోహదపడుతుంది. శారీరక, మానసిక ఉల్లాసాన్ని యోగాసనాలు ఏకైక మార్గమని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. సోమవారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ అధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీషా పాల్గొని జిల్లా రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ సభ్యులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో యోగాను భాగం చేసుకునేలా అన్ని వర్గాల ప్రజలను ప్రోత్స హించేందుకు యోగాంధ్ర మాసోత్స వాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత నిర్ధేశించుకున్న లక్ష్యాల సాధనకు మానసిక ప్రశాంతత పరిపూర్ణమైన ఆరోగ్యం ఎంతో అవసరమన్నారు. యోగాసనాల ద్వారానే అది సాధ్యపడుతుందన్న విషయాన్ని గుర్తెరిగి, ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. ఒక్కో యోగాసనంలో శరీరం లోని ఒక్కో భాగాన్ని క్రియాశీలం చేసేంత శక్తి దాగి ఉందన్నారు. వాటిని ఆచరించడం ద్వారా యోగాలో మాధుర్యాన్ని తెలుసుకోగలుగుతారన్నారు. ప్రజల జీవితంలో యోగాను భాగం చేయడం ద్వారా ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశ్యమన్నారు. బీపీ.మధుమేహం, కుంగుబాటు వంటి జీవనశైలి సమస్యలు దరిచేరకుండా యోగాసనాలు సహాయపడతాయన్నారు. మానవతావాదంతో నునాల్యవ శ్రమించే రెడ్‌క్రాస్ సభ్యులు, వాలంటీర్లతో కలిసి యోగాసనాలను అభ్యసించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు.

# తిరుమల సమాచారం

## ఉచిత విద్యుత్ బస్సులతో భక్తులకు సౌకర్యం

### - తిరుమల, శ్రీవారిమెట్టు మార్గంలో ఉచిత ప్రయాణం



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో ఏ ఆలయంలో లేని విధంగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు తిరుమలకొండపై కాటేజీలు, ఆలయం వద్దకు, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లకు చేరుకునేందుకు వీలుగా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోంది. ఇప్పటికే పదివరకు విద్యుత్‌తో నడిచే ద.ె ం్మ ం ద:ా ల ం ( ఉ చి త్ బస్సులను)తిరుమలలో టిటిడి నడుపుతోంది. కొండపై జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద నుండి జిఎన్‌సి, హెచ్‌విసి, హెచ్‌విడిసి, సన్నిధానం, పద్మావతి విచారణ కార్యాలయం, ఎస్ఎంసి, ఏటిసి, ఎంబిసి, మ్యూజియం, సిఆర్ఓ, లేపాక్షికూడలి ,యాత్రిసదన్‌లు ఇలా భక్తులకు సౌకర్యవంతంగా నడుస్తున్నాయి. తిరుమలకు వస్తున్న లక్షమంది యాత్రికులకు సరిపడేలా ఈ ధర్మరథాలు అందుబాటులో లేవు. పైగా ప్రైవేట్ ట్యాక్సీ డ్రైవర్లు కొండపై భక్తులను అధిక ఛార్జీలకు నిలువుదోపిడీచేస్తున్నారనేది ఇటీవల వందలసంఖ్యలో ఫిర్యాదులు టిటిడి అధికారులకు అందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో శ్రీనివాసమంగాపురం ఆలయం, శ్రీవారిమెట్టుకు వెళ్ళే భక్తులను ఆటోడ్రైవర్లు, ట్యాక్సీ డ్రైవర్లు నిలువుదోపిడీకి గురిచేస్తున్నారను. రోజుకు 10వేలమంది వరకు భక్తులు ఈ మార్గంలో తిరుపతి రైల్వేస్టేషన్, ఆర్టీసి బస్టాండు, అలిపిరి నుండి చేరుకుంటున్నారు. వస్తున్న భక్తుల రద్దీతో ట్యాక్సీలు, ఆటోలు అధికఛార్జీల దోపిడీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు దివ్యదర్శనం టోకెన్లు కూడా అలిపిరి భూదేవికాంప్లెక్స్‌లోనే జారీ చేస్తున్నారు. ఆ తరువాత అలిపిరి నుండి శ్రీవారిమెట్టుకు ఉచిత బస్సులద్వారా చేరవేస్తున్నారు. అయితే ఈ బస్సులు చాలడంలేదు. దీంతో టిటిడి 100 ఉచిత విద్యుత్ బస్సులకోసం కేంద్రానికి, దాతలనుండి సహకారం కోరింది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలమేరకు భక్తులకు సకల సౌకర్యాలు కల్పనపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో భక్తులను ఉచితంగా సౌలభ్యంగా రవాణాకు వందవిద్యుత్‌తో నడిచే బస్సులు అవసరమని టిటిడి గుర్తించింది. ఈ మేరకు మంగళవారం తిరుమలలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో కూడా ఛైర్మన్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. భక్తులను ఒకచోట నుండి మరోచోటుకు ఉచితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు అవసరమైన వంద విద్యుత్‌బస్సులను కేంద్రప్రభుత్వం సమకూర్చేలా కేంద్రమంత్రి హెచ్‌డి కుమారస్వామి సానుకూలత చూపారు. త్వరలోనే 100 బస్సులు టిటిడికి చేరుతాయని తెలిపారు.

## వేంకటేశ్వరస్వామి దయతోనే కేసు నుండి విముక్తి : టిడిపి నేతలు



**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దయ,ఆశీస్సులతోనే తప్పుడు కేసు నుండి నిర్ధోషులుగా విముక్తిలభించిందని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. 2019లో జరిగిన ఎన్నికల సమయంలో తిరుపతినియోజకవర్గంలో టిడిపి తరపున ప్రచారానికి సంబంధిత అధికారుల వద్ద ముందస్తు అనుమతితీసుకోలేదని గతంలోకేసు నమోదుచేశారు. ఈ కేసు తిరుపతి కోర్టుల సముదాయంలో 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విచారణ చేశారు. విచారణ అనంతరం 10మంది నేతలు నిర్ధోషులుగా తేల్చారు. దీంతో తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్రనాయకులు నరసింహయాదవ్, పనబాకలక్ష్మి, సూరా సుధాకర్‌రెడ్డి, వి.పుష్పావతియాదవ్, డాక్టర్ సుధారాణి, ఆర్‌సి మునికృష్ణ, డాక్టర్ ఆశాలత, దంపూరి భాస్కర్‌యాదవ్, బిజి కృష్ణయాదవ్, దినకర్, సత్యశ్రీనివాస్ తదితరులు మంగళవారం ఉదయం తిరుమలకు చేరుకుని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తమకు దేవుని ఆశీస్సులు ఉన్నాయని విశ్వాసం వెలిబుచ్చారు.

## హైందవ సనాతన ధర్మంపై సద్గమయ విద్యార్థులకు డే స్కాలర్స్‌గా శిక్షణ: టిటిడి హెచ్‌డిపిపి

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల్లో హైందవసనాతనధర్మం నేర్పిన మానవీయ విలువలను ,వ్యక్తిత్వవికాస కార్యక్రమాల్లో శిక్షణనివ్వడానికి సద్గమయ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టిటిడి హెచ్‌డిపిపి సమావేశం నిర్ణయించింది. ఇందుకోసం టిటిడికి చెందిన ఏడు పాఠశాలల్లో దాదాపు 1,600మంది విద్యార్థులకు డే స్కాలర్ విధానంలో శిక్షణనివ్వాలని చర్చించారు. టిటిడి విద్యాసంస్థల్లోని విద్యార్థులకు హిందూ సనాతన ధార్మిక విలువలతోబాటు తెలుగు సాంస్కృతిక వైభవంలో శిక్షణ ఇవ్వడంలో భాగంగా మన వారసత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందుకు 120కోట్లు రూపాయలు ఖర్చు చేయనున్నారు. మంగళవారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన తిరుమలలో హెచ్‌డిపిపి బోర్డు సమావేశం జరిగింది. శ్రీవారిసేవ, సనాతనధర్మం వ్యాప్తి చేయడంపై కీలకంగా చర్చించారు. తిరుమలకు వస్తున్న భక్తులకు మరింత మంచి దర్శనం కల్పించడానికి ఇంకా ఎలాంటి పద్ధతులు అనుసరించాలి అనే విషయంపై అభిప్రాయాలు తీసుకున్నారు. టిటిడి ఆల యాలు, అంతర్జాతీయంగా సేవలను విని యోగించుకునే అంశాలపై చర్చించారు.

## సెప్టెంబర్ నెల ఆర్జిత సేవల టిక్కెట్లు విడుదల

### - ఆన్‌లైన్‌లో వెంకన్న దర్శనాలకు టిటిడి సిద్ధం

**తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం రానున్న సెప్టెంబర్‌నెలకు సంబంధించి ఆన్‌లైన్ టిక్కెట్లు ఈనెల 18వతేదీ నేడు విడుదల చేయనుంది. సెప్టెంబర్ నెలకోటాను 18వతేదీ బుధవారం ఉదయం 10గంటలకు విడుదల చేసేలా టిటిడి ఐటి విభాగం ఏర్పాట్లుచేసింది. ఆర్జిత సేవాటిక్కెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వతేదీ బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టిక్కెట్లు పొందిన భక్తులు 20వతేదీ నుండి 20వతేదీ మధ్యాహ్నం 12గంటల లోపు లక్కీడిప్‌ద్వారా టిక్కెట్లు పొందిన భక్తులు నగదు చెల్లించి టిక్కెట్లు అందుకోవచ్చు. ఇక ఆర్జితసేవా కల్యాణం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవల టిక్కెట్లు తిరుమల తిరుపతి దేవస్థానం ఈనెల 21వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవల టిక్కెట్లు 21న మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. సెప్టెంబర్ అంగప్రదక్షణ టోకెన్లను 22వతేదీ ఉదయం 10గంటలకు విడుదల చేస్తోంది. రోజువారీగా (శుక్రవారం తప్ప)750 టోకెన్లను ఆన్‌లైన్‌లోనే విడుదల చేస్తున్న విషయం విదితమే. ఇదిలా ఉండగా శ్రీవాణి టిక్కెట్లు ఆన్‌లైన్‌లో 22వతేదీ ఉదయం 11గంటలకు విడుదల చేస్తారు. 300 రూపాయలు ఎస్ఇడి టిక్కెట్లు కోటా 24వతేదీ ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. దివ్యాంగులు, వృద్ధుల కోటా 23న 3గంటలకు, 24న గదులకోటా విడుదలచేస్తారు. 25న శ్రీవారి సేవాకోటా విడుదలవుతుంది.

# వడ్డెర సొసైటీలకు కంకర క్వారీ లీజులు, భారీగా రాయితీలు - సీనరేజ్‌లో సైతం 50 శాతం రాయితీ

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్తప్రతినిధి:** అధికారంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీ అమలుకుసన్నద్ధమవుతోంది. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వారికి రహదారి కంకర (రోడ్ మెటల్), పలక, క్యూబ్స్, కెర్బ్సు లీజుల్లో ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వడ్డెర సొసైటీలకు లీజులు కేటాయించి, వాటి ద్వారా వారు ఉపాధి పొందేలా చూడాలని నిర్ణయించింది. లీజుల కేటాయింపులో ఆ సొసైటీలకు ప్రాధాన్యం ఇవ్వనుంది. ఆయా ఖనిజాలకు సంబంధించి ఇతర ధరఖాస్తుదారులతో పాటు అదే లీజుకు వడ్డెర సొసైటీలు 15 రోజుల్లో ధరఖాస్తు చేసుకుంటే. సొసైటీ ధరఖాస్తునే పరిగణలోకి తీసుకుంటారు. ఒకవేళ ఏదైనా లీజు ఒకటి కంటే ఎక్కువ సొసైటీల నుండి ధరఖాస్తులు వస్తే, వాటిలో ఆ లీజు ప్రాంతానికి ఏ సొసైటీ దగ్గరగా ఉంటుందో పరిశీలించి, దానికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఒక్కో సొసైటీకి గరిష్టంగా 12 హెక్టార్లకు మించకుండా లీజు కేటాయిస్తారు. వడ్డెర సొసైటీలకు కేటాయించే లీజుల్లో తవ్వి, తరలించే రోడ్ మెటల్, పలక, క్యూబ్స్, కెర్బ్సు కు గనుల శాఖ వసూలు చేసే సీనరేజ్‌లో ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వనుంది. రాష్ట్రంలో 371 వడ్డెర సొసైటీలున్నాయి. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 140, ఆ తర్వాత పల్నాడులో 72, తిరుపతిలో 47, నంద్యాల జిల్లాలో 37 సొసైటీలు ఉన్నాయి. ఎన్టీఆర ,గుంటూరు, ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి తదితర జిల్లాల్లో కూడ కొన్ని సొసైటీలు ఉన్నాయి. వాటన్నింటికీ లీజుల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వనున్నారు. 1990 దశకం నుండి వడ్డెర సొసైటీలకు క్వారీ లీజులు కేటాయించే విధానం ఉండేది. గత వైకాపా ప్రభుత్వం 2022లో లీజుల కేటాయింపునకు ఈ వేలం విధానం తీసుకొచ్చింది. దీనివల్ల లీజు కావాల్సిన వడ్డెర సొసైటీలు...ఇతరులతో కలిసి వేలంలో పాల్గొని, ఎక్కువ ధర కోట్ చేయాల్సి వచ్చేది. ఒకవేళ అధిక ధర కోట్ చేయకపోతే... ఆ వేలంలో ఎవరు అత్యధిక ధర కోట్ చేశారో ఆ మొత్తాన్ని ప్రీమియంగా చెల్లించేందుకు ముందువచ్చే సొసైటీకి లీజు దక్కేది. దీంతో వడ్డెర సొసైటీలకు లీజు పొందడం కష్టంగా ఉండేది. ఈ విషయం అప ్పట్లో ఎన్నికల ప్రచార నేపథ్యంలో వడ్డెర్లు చంద్రబాబు దృష్టికి తీసుకుని రావడంతో...కూటమి ప్రభుత్వం అధికారం లోకి వస్తే ...వడ్డెర్లకు రాయితీపై లీజులు కేటాయిస్తామని, సీనరేజ్‌లో తగ్గించి ఇస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఆ హామీ అమలుకు గనులశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

# గుడ్లవల్లేరులో ట్రాక్టర్ డ్రైవర్ హత్య

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం పశుబోట్లవాని పాలెంలో ఓ ట్రాక్టర్ డ్రైవర్ హత్యకు గురయ్యారు. గ్రామంలో రోడ్డు పక్కన విగత జీవిగా పడి ఉన్న రేమల్లి వెంకట్రావు(45)మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి శరీరంపై పలుచోట్ల గాయాలున్నాయి. సోమవారం రాత్రి తాను పనిచేస్తున్న ట్రాక్టర్ యజమానితో మద్యం మత్తులో వెంకట్రావు గొడవపడ్డారు. ఆ వివాదమే వెంకట్రావు హత్యకు కారణమన్నారు.

వార్త

ఒక్కొక్కప్పుడు మన సందేహాలే మనలను మోసం చేస్తాయి. సందేహం కలిగినప్పుడు భయం వల్ల మన ప్రయత్నాన్ని విరమిస్తాం. మనం సాధించగలిగే దాన్ని సైతం పోగొట్టుకుంటాం.

-ఫిలిప్స్

# సకల జనగణన సాధ్యమే!

దేశంలో 15ఏళ్ల అనంతరం జరిగే జనగణనకు సైరన్ మోగింది. 16వ జనగణన ఇది. ప్రతి పదేళ్లకూ ఒకసారి దేశ జనగణనకుఆస్కారముండగా 2020లో జరగాల్సిన జనగణన 'కరోనా' రీత్యా వాయిదాపడింది. స్వాతంత్ర్యానికి ముందు 15 జనగణనలు పూర్తయ్యాయి. జనగణనతోపాటు ఈసారి తొలిగా కులగణన చేపట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. 2027 మార్చి1వ తేదీ నాటికి జనగణన పూర్తవుతుంది. జనాభా లెక్కల సేకరణ అంతా డిజిటల్ విధానంలో జరుగుతుంది. సమాచార సేకరణ, బదిలీ, డేటా భద్రత వంటి అన్ని విషయాలనూ కట్టుదిట్టంగా చేయాలని కేంద్రం తలపెట్టింది. రెండు దశల్లో జరిగే జనగణనలో తొలిదశలో అక్టోబరు 1, 2026 నాటికి జమ్ముకశ్మీర్, ఉత్తరాఖండ్, లఢక్, హిమాచల్‌ప్రదేశ్‌లలో పూర్తవుతుంది. జనగణన కోసం సోమవారం కేంద్ర హోంమంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. జనవరి 1, 2027 నుంచి జనగణన ప్రారంభమౌతోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కల భారత్‌లో జనగణన అంటే అత్యంత కీలక పరిణామం. మంచు ఎక్కువగా కురిసే లఢక్ ప్రాంతంలో 1 మార్చి 2027లో మొదలు పెడతారు. కులగణన వల్ల ఆయా కులాల్లో ఉన్న ఆర్థికపరిస్థితి, సామాజిక అంతరాలు వగైరా అంశాలపై విశ్లేషణలు వీలవుతాయి. దేశంలో సమగ్ర కులాల వారీ జనాభా లెక్కల ప్రక్రియ బ్రిటిష్ వారి హయాంలో 1881 నుంచి 1931 మధ్య కాలంలో జరిగింది. సుదీర్ఘకాలం జరగడానికి కారణాలు అప్పట్లో కేవలం జనాభా లెక్కలు మాత్రమే జరిగేవి. అప్పట్లోనే కులాల వివరాలను కూడా సేకరించినట్లు చెబుతున్నా అవి వెలుగులోకి రాలేదు. కులాల వారీగా ప్రాతిపదికగా జనగణన ప్రక్రియను తెలంగాణ, బీహార్‌లలో ఇప్పటికే పూర్తి చేశాయి. జాతీయస్థాయి అంశం అయినందున ఎంతో పకడ్బందీగా సేకరించాల్సి ఉంటుంది. కొన్ని రాష్ట్రాలు చేపట్టాయని చెబుతున్న జనగణనను రాజకీయ కోణంలో చేశారన్న ఆరోపణలున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాలు ఎంతో ముందుచూపుతో చేపట్టిన, అనుసరించిన మార్గదర్శకాలను ఆధునీకరించి, ఆధునిక గణాంక వైఖరితో పారదర్శకంగా జనగణన చేపట్టాల్సి ఉంది. దేశంలో కులగణన చాలా అవసరమని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ఏమయితేనే కాంగ్రెస్ బాటలో అన్ని రాష్ట్రాల్లోనూ జనగణాంక దీక్ష చేపట్టడం స్వాగతించాల్సిన విషయం. తొలిదశలో ఇంటి జాబితాలో ప్రతి ఇంటికి సంబంధించిన గృహనిర్మాణ పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాల గురించి సమాచారం సేకరిస్తారు. రెండో దశ జనాభా గణనలో ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు సంబంధించిన వ్యక్తిగత వివరాలను రాబడతారు. ప్రజల నుంచి ఏయే వివరాలను సేకరిస్తారో ప్రశ్నావళిని విడుదల చేయాల్సి ఉంది. కులగణన విషయంలో కాంగ్రెస్‌పార్టీ పట్టుపట్టి తెలంగాణలో విజయవంతంగా పూర్తి చేసింది. అందులో అర్ధసత్యాలున్నాయని అసమగ్రమని ఆరోపణలున్నా, జాతీయస్థాయిలో జరిగే కులగణనకు మార్గదర్శకాలు చూపించినట్లయింది. కేంద్ర ప్రభుత్వం ఒకనాడు కులగణన పేరుచెబితేనే మండిపడేది. అటు పార్లమెంటులో,సుప్రీంకోర్టులోనూ వద్దని వాదించిన కేంద్రప్రభుత్వం కులగణనకు తలూపడం మంచి పరిణామం. కాగా సోమవారం విడుదల చేసిన 16వ జనగణన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావన చేయకపోవడం విమర్శలకు గురైంది.ప్రశ్నావళిలో ఉంచి కులగణన వివరాలను విశ్లేషిస్తారేమో చూడాలి. కులాల వారీ ఆర్థిక, సామాజిక వివరాలను క్రోడీకరించుకుని ఆయావర్గాల వెనుకబాటుతనాన్ని నిర్ణయించి ప్రత్యేక పథకాలు చేపట్టేందుకు ఈ విశ్లేషణలు పనికివస్తాయి. తెలంగాణ రాష్ట్రంచేపట్టిన కులగణన వివరాలలతో జాతీయ జనగణనకు కానీతాజాగాచేపట్టే కులగణనకు కానీ సంబంధం లేదు. జాతీయ జనాభా చట్టం 1948 ప్రకారం అన్ని రాష్ట్రాల్లో ఒకే మాదిరి ఒకే విధానంతో, ఒకే తీరుగా జనగణన చేయాల్సి ఉన్నందున కేంద్ర ప్రభుత్వంతనకంటూ ప్రత్యేక ప్రశ్నావళి, ప్రణాళిక, సేకరణ విధానాన్ని రూపొందించుకుంటోంది. రాజ్యాంగంలోని 246 అధికరణం కింద ఏడో షెడ్యూలులో 69వ అంశంగా జనగణన చేపడ్తారు.సమాజంలోని ప్రతి వర్గానికి, ప్రతి సభ్యుడి వివరాలు తప్పనిసరిగా సేకరించే ప్రణాళికలో ప్రభుత్వం ముందుకుకదులుతోంది. ప్రశ్నావళిలో చోటు చేసుకునే ప్రశ్నలు ఆయా నివాసితుల వ్యక్తిగత వివరాలతోపాటు కులం, ఉపకులం, సొంత ఇల్లా అద్దె ఇల్లా! ఆర్థిక పరిస్థితులు ఉద్యోగ ఉపాధి ఆదాయవనరుల వంటి కీలకమైన ప్రశ్నలుంటాయి. కులప్రస్తావనపై పెద్దగా చర్చలు లేని 1881లోనే సమగ్ర కులగణన విషయమై బ్రిటిషర్లు ముందుచూపుతో జనగణనకు అంకురార్పణ గావించారు.'విభజించు, పాలించు' అనేరీతిలో ఆలోచించే వారికి భవిష్యత్‌లో 'కులం' అతికీలకంగా ఉంటుందని భావించి ఉండొచ్చు.స్వాతంత్ర్యం వచ్చాక భారతీయ పాలకులు జనగణన నుంచి 'కుల'ప్రస్తావనగణనలను తొలగించారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో కులాలవారీ సంక్షేమప్రగతి ప్రణాళికలు ప్రధానంగా తీసుకోవాల్సి రావడంతో'కులగణన'కు ప్రాముఖ్యత ఏర్పడి కేంద్రప్రభుత్వం తరపున 2010 లోనే ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ లోక్‌సభలో హామీ ఇచ్చారు. అత్యధిక రాజకీయ పార్టీలు కులగణన మంచిదేనని అభిప్రాయపడ్డాయి. 2011లో కులగణన ప్రయత్నం జరిగింది. కానీ బయటకు రాలేదు. తాజాగా 'కులగణన' అవసరాన్ని గుర్తించినందున ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో సమగ్ర సర్వేకు ముందడుగు పడింది. ఈ రీత్యా సర్వమానవ సౌభ్రాతృత్వంలో భాగంగా సకల జనుల కోసం సంక్షేమ పథకాలు అందేందుకు కొత్త ప్రయత్నాలన్నీ సానుకూల పడగలవని ఆశిద్దాం.

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కటే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం సాగిందంటే ఇద్దరూ బాధ్యులే.



థామస్ ఫుల్లర్

ఏదైనా ఒక లక్ష్యంతో గట్టిగా కృషి చేస్తే ప్రతి వ్యక్తికీ నేడు కాకపోయినా రేపైనా విజయావకాశం వచ్చి తీరుతుంది.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య

# ప్రజావాక్కు



### ప్రొవైడర్లకే అనుమతి ఇవ్వాలి

ఇటీవల కేదార్నాథ్ వద్ద జరిగిన హెలికాప్టర్ ప్రమాదం దేశవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ 30న ప్రారంభమైన చార్‌ధామ్ యాత్రలో ఇప్పటివరకు ఇది ఐదవహెలికాప్టర్ ప్రమాదం కావడం మరింత ఆందోళనకరం. శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఆరుగురుమరణించడం దురదృష్టకరం.వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలు మన వైమానిక రంగంలో లోపాలు, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పుడు తాత్కాలికంగా హెలికాప్టర్ సేవలను నిలిపివేసినప్పటికీ, దీన్ని శాశ్వత పరిష్కార దిశగా తీసుకెళ్లాలి.అధిక భక్తులు వచ్చే కాలాల్లో హెలికాప్టర్ సేవలను కేవలం నిబంధనలు పాటించే ప్రొ వైడర్లకే అనుమతించాలి. అంతేగాక, ప్రభుత్వం పర్యవే క్షణను మరింత బలపరచాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కొత్త రైళ్లను ప్రవేశపెట్టాలి

మన రైల్వేలు దేశ పౌరుల ఇంద్ర వాహనం కానీ తరచుగా ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడం వలన రైల్వే ప్రయాణంఅంటే భయభ్రాంతులను కలుగుచున్నవి. మొన్న ముంబైలో జరిగిన లోకల్‌రైళ్లప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం అత్యంత విషాదకరమైన సంఘటన. రెండు రైళ్ల ప్రయాణికుల సంచులు ఒకదానికి ఒకటి తగిలి ప్రయాణికులు క్రిందపడి దుర్మరణం చెందడం భారత రైల్వే చరిత్రలో మొదటిసారి కావచ్చు! గతంలో ప్రమాదాలు రైళ్లు పట్టాలు తప్పడం ఒకదానికి ఒకటి ఎదురెదురుగా, వెనుక నుండి వచ్చి ఢీకొనడం జరిగేవి. కానీ ఇటీవల జరిగిన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తొక్కిసాలట,రైల్వేశాఖ నిర్లక్ష్యం ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, అవగాహనరాహిత్యం వలన జరిగినవి.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### చెక్ డ్యామ్‌లు అవసరం

వర్షాకాలం ప్రారంభం కాబోతుంది. రాష్ట్రంలోని కొన్ని చెరువులలో30నుండి40శాతనీటిసామర్థ్యంతో ఉన్నాయి. ఆగస్టు వరకు కురిసే వర్షాలకు చెరువులు పూర్తిగా నిండి వృధాగా నీళ్లుబయటికిపోయే నీటికి లోతట్టు ప్రాంతాలలో చెక్ డ్యాములు ఏర్పాటు చేయాలి. వాగులు, కాలువలకు కూడా చెక్ డ్యాములు నిర్మించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

### యుద్ధం ఆగదు

ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న హోరాహోరి క్షిపణుల దాడుల వల్ల రెండుదేశాలకు జననష్టం,ఆస్తినష్టం తప్ప గెలుపు అనేది ఎన్నటికీ ఎవరి పరం కాదు. ఇజ్రాయెల్ ఇప్పటికీ గాజా మీద దాడులు చేస్తూనే ఉంది. అమెరికా ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సమర్థిస్తూనే ఉంది. ఇండో- పాక్‌ల మధ్య ఈమధ్య జరిగిన ఆపరేషన్ సిందూర్‌ను తన చాక చక్యంతో సంధి మాటలు చెప్పి యుద్ధాన్ని నాలుగు రోజులలోనే ఆపివేశానని గొప్పలు చెప్పుకుంటున్న ట్రంప్ మహాశయుడు ఉక్రెయిన్ రష్యా మధ్య ఏడాది పైగా ఎడతెరిపి లేకుండా జరుగుతున్న యుద్ధాన్ని ఆపలేకపోయాడు. ఇజ్రాయిల్‌ను అదుపు చేయలేకపోయాడు.అణుయుద్ధానికి ఏ దేశం ఒడిగట్టినా దాని మూల్యం ప్రపంచ దేశాలన్ని చెల్లించుకోవాలి. ఐక్యరాజ్య సమితిలోని సెక్యూరిటి కౌన్సిల్ ఏదేశాన్ని కంట్రోల్ చేయలేకపోతోంది.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పేదరికం తగ్గింది

భారత్‌లో పేదరికం భారీగా తగ్గి పోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు ఈ వార్త విన్నవారు. ఏప్రభుత్వ పథకానికి నోచుకోలేని వారు గంజి నీళ్ళకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వు బ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్యనే అన్నారు. ఈ పేదరికంలో మరోరకం జాతి ఉంది. వీరు చదువుకున్న వారు. ఉద్యోగం చేసి రిటైర్ అయిన వారు. వీరి ఫించను గత దశాబ్ద కాలంపైగా నెలకు కదలని మెదలని శిలలా వెయ్యి రూపాయలు మాత్రమే. వీరి వార్షిక ఆదాయం పన్నెండు వేల రూపాయలు మాత్రమే. అంటే దారిద్ర్య రేఖకు ఎన్నిమెట్లు దిగువున ఉన్నారో కదా!

- డా.ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### జీవవైవిధ్య పరిరక్షణ

మానవునికి ప్రకృతి, జీవవైవిధ్యం రెండు కళ్ల వంటివి. ఆధునిక మానవుని జీవనశైలి మార్పు వలన పర్యావరణ లేమితో పుడమి వేడెక్కిపోవటంతో పాటు జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వన, జల, జీవరాశులున్న దేశాల్లో ఇండియ స్థానం 8వది. భారత్‌లో ఉన్న 18 జీవావరణ ప్రదేశాల పరిరక్షణ కోరకు ప్రజల్లో జీవ, పర్యావరణంపై అవగావనను ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు మరింత కృషి చేయాలి.

-షేర్ మీరా, రాజమండ్రి

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'స్టెమ్' తో పూర్తిస్థాయి విద్యావికాసం!

**ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశాదిశా నిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి.ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం, రాష్ట్ర విద్యారంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అప్పుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమౌతుంది. రాబోవు జాతీయ విద్యా చట్రంలో తగిన సంస్కరణలు చేయడం ద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యా విధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం.**



మల్లాడి శ్రీనగేష్

నూతన విద్యా విధానం 2020 నిజమైన స్ఫూర్తితో రూపు దాలిస్తే దేశంలో పిల్లలు ఎదుర్కొంటున్న అభ్యసనా సామర్థ్యాల సవాళ్లకు ఒక సమాధానమే కాక ఉన్నత విద్యలో విద్యార్థులు సులభంగా తాము అనుకున్న విద్యా లక్ష్యాలను సాధించడానికి, తద్వారా దేశం సమ్మిళిత విద్యా చట్రంలో వివిధ నేపథ్యాల నుండి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు అందరికీ నాణ్యమైన, సమాన విద్యా సామర్థ్యాలు సమకూర్చడానికి సానుకూలత ఏర్పడుతుంది. అంతేకాక విద్యార్థి తన మాతృభాషలో చదువుకొనే వెసులుబాటు కల్గించడం, ఆంగ్లం లేదా స్థానిక భాషలోనే చదవాలనే నిబంధన లేకుండా ఆయా రాష్ట్రాలు భాషా బోధనలో తన నిర్ణయం తీసుకోవచ్చు అనే విషయం కూడా విదితమే. ఈ ప్రతిపాదనలన్నీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి బాలలకు చదువుతో బాటు మనో బలాన్ని అందించడానికి చక్కటి వెసులుబాటు కల్గిస్తుంది. ఈ విద్యా విధానం రూపకల్పన ప్రాథమిక విద్యా స్థాయి నుండి అనుసరించాల్సిన వివిధ వ్యూహాలు మొదలుకొని ఉన్నత స్థాయి విద్య సాంకేతికత వృత్తి విద్య, గ్రామీణ,పట్టణ స్థాయి విధి విధానాలను మేళవించి సమ్మిళిత విద్యా భావనలను పూర్తి స్థాయిలో పొందుపరచినట్లు చెప్పవొచ్చు. దీనికితోడు ఉన్నత విద్యలో ఉన్న విద్యార్థులకు వారి భవిష్యత్ ఉద్యోగ రంగాలను ఎంపిక చేసుకోవడానికి, గ్లోబల్ స్థాయి ఉద్యోగ పోటీని ఎదుర్కోవడానికి, శాస్త్రీయ, సాంకేతిక రంగాలలో మెరుగైన నైపుణ్యాలను గడించడానికి నూతన విద్యా విధానం సూచించిన స్టెమ్ ఆధారిత విద్య కూడా యువత భవిష్యత్తును ఉజ్వలమయం చేయడానికి తప్పక ఉపకరిస్తుందని చెప్పక తప్పదు. సాంప్రదాయ విద్యాబోధనకు స్వస్తిపలికి, అనుభవాత్మక విద్యకు నాంది పలికి విద్యార్థులకు స్నేహపూరిత తరగతి నిర్వహణలో స్టెమ్ ఒక పటిష్ట వ్యూహంగా వర్ణించవచ్చు. ఈ నేపథ్యంలో స్టెమ్ ఆధారిత విద్య పాఠశాల స్థాయి నుండి మరింత బలోపేతం చేయాలనేది అనేక మంది విద్యా సంస్కర్తల ప్రధాన అభిప్రాయం! స్టెమ్ ఆధారిత విద్య అనగా సైన్స్,టెక్నాలజీ, ఇంజనీరింగ్ మాథమెటిక్స్ అనే అంశాలపై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్గించడం, తదనుగుణమైన వసతులు అనగా స్టెమ్ లాబొరేటరీలు, అటల్ లాబొరేటరీలను ఏర్పరచి దానికి సాంకేతికతను జోడించి విద్యార్థులకు ప్రయోగాత్మకను ప్రోత్సహించడం తద్వారా ఆలోచనాత్మకతను పెంపొందించడం నూతన విద్యా విధాన ప్రధాన ఉద్దేశ్యం.అనగా 21వ శతాబ్దపు నైపుణ్యాల నేర్పరితనాన్ని ముఖ్యంగా 5 'సి'ఐదు' నైపుణ్యాలను అనగా క్రియేటివిటీ (సృజనాత్మకత ), క్రిటికల్ థింకింగ్ (క్లిష్టమైన ఆలోచన), కమ్యూనికేషన్ సమాచారం, సంభాషణ), కొలాబొరేషన్ (సహకారం) సిటిజెన్ షిప్ (పౌరసత్వం) విషయాలలో విద్యార్థులను సమాయత్తం చేయడం నూతన విద్యా విధాన ప్రధాన భూమికయని చెప్పవచ్చు. ఈ విషయాన్ని నూతన విద్యావిధానం దేశంలో ఒక కొత్త రూపు, ఒక ఒరవడిని దిద్దడానికి రచించబడిందనివిద్యా విధాన రూపశిల్పి కస్తూరి రంగన్ ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ నేపథ్యంలో బాల్ రక్షా భారత్ (సేవ్ ది చిల్డ్రన్) పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షల సౌజన్యంతో తెలుగు రాష్ట్రాల్లో కాక సుమారు 7రాష్ట్రాల్లో ఏర్పరచిన స్మార్ట్,స్టెమ్ లేబొరేటరీల అనుభవాలను కూడా క్రోడీకరిస్తే విద్యార్థులు ఈ లాబరేటరీలు డిజిటల్ బోధన ద్వారా విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడమే కాకపాఠ్యాంశాలతో బాటుఆయా అంశాలపై అదనపు సమాచారాన్ని పొందడం స్టెమ్ ప్రయోగాల ద్వారా ప్రత్యక్ష ప్రయోగాత్మక ప్రయోజనాలు చేకూరుతున్నాయని వెల్లడించారు. ఒడిశాలోని కుగ్రామా ల్లో ఉన్న ఉన్నతవిద్యను అభ్యసించే బహుళ భాషానేపథ్యంతో



చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు కూడా స్టెమ్, డిజిటల్ బోధనా భాగ్యాన్ని కొనియాడారు.దీనికితోడు ఈ స్టెమ్ లాబొరేటరీలను జిల్లాలో గల డైట్‌లో కూడా ఏర్పాటుచేయడం వలన స్టెమ్‌విద్యను పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ శిక్షణపొందుతున్న యువ ఉపాధ్యాయులకు ఈస్టెమ్ లాబొరేటరీలు ఒక చక్కటి లెర్నింగ్‌వసతిగా అభివర్ణించారు. ఈ దిశగా ప్రైమ్ విద్యా బోధనా పద్ధతి తరగతి గదిలో ప్రస్తుతం సాగుతున్న సాంప్రదాయ విద్యా బోధనా సరళికి స్వస్తిపలికి బోధనలో విద్యార్థుల భాగస్వామ్యం, క్లిష్టమైన విషయాలను సులభంగా అవగాహన చేసుకోవడమే కాక ప్రయోగాత్మకంగా విషయాలను పరిశీలించి విద్యార్థులు సాధారణంగా క్లిష్టమని భావించే సైన్స్, ఇంజినీరింగ్, గణిత సబ్జెక్టులలో సరళరీతిన అభ్యసించే వెసులుబాటు స్టెమ్ ప్రయోగశాలలు కల్పిస్తాయి. అంతేకాక దీని ద్వారా పీర్ లెర్నింగ్ అనగా తోటి విద్యార్థుల ప్రయోగాల ద్వారా మరింత సులభంగా కాన్సెప్ట్‌లను నేర్చుకోవడానికి వెసులుబాటు కలుగుతుంది. ఈ విషయాలు వివిధ రాష్ట్ర విద్యాశాఖలు, స్వచ్ఛంద సంస్థలు సి.ఎస్.ఆర్‌ల సౌజన్యంతో ఇప్పటికే తెలుగురాష్ట్రాల్లో లోనే కాక దేశ వ్యాప్తంగా స్టెమ్ అటల్ లేబొరేటరీల ద్వారా స్మార్ట్ క్లాసురూముల ద్వారా విద్యార్థుల నుండి, ఉపాధ్యాయుల నుండి సేకరించిన ప్రత్యక్ష సమాచారం ద్వారా ఈ ప్రయోగశాలల వలన పిల్లల్లో ఆసక్తి అనుభవాత్మకత, విశ్లేషణ, విషయపరిజ్ఞానం, సృజనాత్మకత వంటి సూక్ష్మ విషయాల్లో మెరుగైన ఫలితాలు లభించాయని దీని ద్వారా ఉపాధ్యాయులు సైన్స్ గణిత విభాగాల్లో క్లిష్టతరమైన విషయాలను సులువుగా బోధించగలుగుతున్నారని ఉపాధ్యాయుల అనుభవాలద్వారా తేటతెల్లమౌతోంది. దానికి తోడు ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు విద్యార్థులు కలసి ప్రయోగాలు చేబడుతూ తరగతులు నిర్వహించేలా ప్రతి ప్రయోగం ఎలాచేయాలనే పూర్తి సమాచా రంతో ప్రత్యేక వీడియోలను ప్రయోగ శాలలో ఆన్లైన్‌లో సిద్ధంగా ఉండడం వలన ఉపాధ్యాయులు విద్యార్థులు స్వయంగా ప్రయోగాలు చేయడానికి వెసులుబాటు కలుగుతోంది. ఈ ప్రయోగశాలలు ప్రస్తుతం 6వ తరగతి నుండి 10వ తరగతివరకు ముఖ్యమైన కాన్సెప్టులను దృష్టిలో ఉంచుకొని అమర్చడం జరిగింది. ప్రయోగాల అనంతరం నెల లేదా రెండు నెలలకు ఒకసారి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వ హించే వెసులుబాటు కూడా వుంది. దీనిద్వారా పాఠశాలలో నిర్వహించే సి.సి.యి (నిరంతర ఎవాల్యుయేషన్) మదింపు ప్రక్రియకు ఈ పరీక్షలను అనుసంధానం చేసుకోవచ్చు. ఈలాబరేటరీలో జరిగే ప్రయోగాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (పెద్ద టెలివిజన్ లాంటి బోధనా పరికరాలతో) అనుసంధానం చేస్తేఫలితాలు మరింత మెరుగైన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు మరింత పెరిగేలా ప్రయత్నించవచ్చు అనడంలో సందేహంలేదు.ఈ అనుభవాల దృష్ట్యాఇదేదిశగా, ప్రతి పాఠశాలలోనూ స్టెమ్ స్మార్ట్ క్లాసురూములను ఏర్పరచడం, డైట్‌లను ఈ రంగంలో బలోపేతం చేయడం ద్వారా ఉపాధ్యాయ శిక్షణకు ఒక కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడం, స్టెమ్ విద్యకు నాణ్యమైన సాంకేతిక విద్య గ్రామీణ ప్రాంత విద్యా ర్థులకు చేరేలా ప్రయత్నాలు చాలాబాగా సత్ఫలితాలు సాధించవచ్చని చెప్పవచ్చు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ యోచిస్తున్నట్లు జిల్లా సైన్స్ సెంటర్లను స్టెమ్ సెంటర్లుగా తీర్చిదిద్ది విద్యార్థులను సైన్స్‌తోబాటు సంబంధిత అంశాలపై పిల్లలకు ప్రాథమికోన్నత పాఠశాల స్థాయి నుండి పూర్తిస్థాయి అవగాహన, శిక్షణ, క్షేత్ర సందర్శన,స్టెమ్ ప్రదర్శన శాలల నిర్వహణద్వారా విద్యార్థులు స్వంతంగాప్రయోగాలు తయారు చేసి ప్రదర్శించేలా ప్రోత్సహించడం స్టెమ్ విద్యను బలోపేతం చేయడంలో ఒక వినూత్న ప్రక్రియగా చెప్పవచ్చు. ఈ విధంగా గ్రామీణ ప్రాంత, ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ముఖ్యముగా నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ నివేదిక ప్రకారం సాంకేతిక విద్యకు దూరంగా వున్న సుమారు 60శాతంమంది బాలికలను సాంకేతిక విద్యతో విద్యారంగంలో బాలికలు ముందంజ వేసేలా అందరు సమిష్టిగా కృషి చేయడం తప్పనిసరియని అవగతమౌతోంది. ప్రభుత్వాలు విద్యా రంగంలో సంస్కరణలు దిశగా దశా దిశానిర్దేశం చేసే జాతీయ విద్యాసంస్థలు అనగా కేంద్ర విద్యాశాఖ, యెన్.సి. ఆర్.టి మానవ అభివృద్ధి విభాగం మరియు రాష్ట్ర విద్యా రంగ సంస్థల సమన్వయంతో కృషిచేయాలి. అపుడే ప్రస్తుత పరిస్థితులకు కావలసిన 21వ శతాబ్దపు నైపుణ్యాలను అందరి విద్యార్థులకు అందించడం సాధ్యమౌతుంది. రాబోవు జాతీయ విద్యాచట్రంలో తగినసంస్కరణలు చేయడంద్వారా విద్యార్థి సమగ్రాభివృద్ధికి పునాది ఏర్పడుతుంది. నూతన విద్యావిధానపు విలువైన లక్ష్యాలను చేరుకోగలుగుతాం. •

# దళితుల అణచివేత ఇంకెంతకాలం?


గుర్రం రాంమోహన్ రెడ్డి

దాడులు, అవమానాలు, అణిచివేతలు వివక్ష గ్రామ బహిష్కరణలు పునాదులను దళితల వర్గాలు పెకిలివేయాలి. దళిత బహుజనులపై దాడులు ఇంకెన్నాళ్లు అన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. దాడులు, దండన,అవమానాలు మూటలతో దళితులు బ్రతుకు బండిలాగుతున్నారు. చరిత్ర నిర్మాతలు మూలవాసులు దళితులే అన్న చారిత్రక సత్యం సమాజంకు తెలియదా! అన్న ప్రశ్నలు వెంటాతున్నాయి. సమానత్వం స్వేచ్ఛ, ఆర్థిక సమానత్వం లభిస్తేనే దళితులు అత్మగౌరంతో సమాజంలో జీవనంసాగిస్తారన్న భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ మాటాలు ఎప్పుడు నిజం అవుతాయి.నిప్పుల కొలిమిలో అవమానాలు భరించిన దళితులు విముక్తి, సాయుధ, విప్లవ పోరాటాలు నిర్మించి సమిధలైన బతుకు బండికి భరోసా ఏది. శ్రామిక కులాలు విముక్తి పోరాటాలు సాగించడంలో దళిత బహుజనులు అగ్రభూమిక పోషించిన ఎందుకు దాడులు జరుగుతున్నాయి. ప్రతిగడియ, ప్రతి రోజు దళితులపై దాడులు నిత్యకృత్యం అవుతున్నాయి. ఒక వైపు పాలకవర్గాలు మరో కవంక సామాజికంగా ఉన్నతస్థానంలో వున్న వ్యక్తులు శక్తులు దాడులకు, ఒడిగడుతున్నారు. కారంచేడు కన్నీళ్లు ఇంకా కారుతన్నాయి. పదిరికుప్పం ఘటన జ్ఞాపకాలు వెంటాడుతున్నాయి. నీరు కొండ సంఘటన నేటికి నిలదీస్తున్నా ఎవరికీ కనువిప్పు కలగడంలేదు. రాష్ట్ర జనాభలో 80లక్షలకు పైగా దళిత జనాభా ఉంది.సిందు మాదిగ, పాముల వంటి 59 కులాలను ఎస్.సి. జాబితాలో చేర్చారు. 23 శాతం ఎస్.సి. జనాభా ఉండగా, 15శాతం రిజర్వేషన్లు అవుతున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై, దళిత మహిళలపై అత్యాచారాలకు అంతులేదు.దళితులపై జరిగే నేరాలు సగటున 25శాతం నుంచి30శాతం మధ్యఉన్నట్లు యన్.సి. ఆర్.బి గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణాలో చాలా గ్రామాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని లోక్ సభలో హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల గ్రామాల్లో అధికంగా దళితులపై దాడలు జరుగుతున్నాయి. 2014-2021 సంవత్సరాల మధ్య దళితులపై 12 వేల 645 దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. 2014 లో1447, 2019లో 1690, 2021లో 1727, దాడులు జరిగినట్లు నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో వెల్లడించింది. పెద్ద పల్లి, మహబూబ్నగర్, ఆర్మూర్, ఆదిలాబాద్,నేరళ్ళు, దాడులు, హత్యలు జరిగాయి. ఇసుక మాఫియా దాడుల్లో నేరేళ్ళలో 40 మంది దళితులు మృత్యువాత పడ్డారు. మొత్తంగా గమనిస్తే 1991 నుంచి 2021 మధ్య 7 లక్షలు దాడులు, దౌర్జన్యాలు జరిగాయి. ప్రతీ 12 నిమిషాలల్లో దౌర్జన్యం ప్రతి ఆరుగురు దళిత మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయి. 2019-2021లో దళితులపై దారణాలు 45,961 నుండి 50,900 వరకు అంటే 11 శాతం పెరిగాయని యన్.సి. ఆర్.బి. వెల్లడించింది. బి.జె.పి పాలిత రాష్ట్రాలో ఉత్తరఖండ్, 50శాతం, 46శాతం మధ్యప్రదేశ్, 36శాతం గోవా,యు.పి. 46శాతం, దళితులపై దాడులు జరిగినట్లు విశదమౌతుంది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 6 శాతం దళితులపైదాడులు జరిగినట్లు స్పష్టమౌతుంది. తెలంగాణ 32శాతం దారుణాలు జరిగాయి. సమాజంలో మిగిత సామాజిక వర్గాలతోపాటు దళితులలో రాజకీయ, ఆర్థిక సామాజిక, సాంస్కృతిక, విద్యాపరమైన సమాన హక్కులు ఉండాలని బి.ఆర్. అంబేద్కర్ ప్రభోదించిన సూత్రానికి భిన్నంగా ఆధునిక విజ్ఞాన సమాజంలో జరుగుతున్నాయి. •

# వివాదాల సుడిగుండంలో టిజిపిఎస్సీ

భాస్కర్ యలకంటి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత వెలువడిన తొలి గ్రూప్1 నోటిఫికేషన్‌ను ఆది నుంచి వివాదాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. లీకేజీ కారణంగా ఒకసారి, హాజరులో వచ్చిన వ్యత్యాసం కారణంగా మరోసారి ప్రిలిమ్స్ పరీక్షలు రద్దుకావడం, తిరిగి కొత్త నోటిఫికేషన్ వెలువడడం, ప్రిలిమ్స్3.0ను నిర్వహించడం, మెయిన్స్ పరీక్షలకు అర్హత జాబితా వెలువర్చడం, తదనుగుణంగామెయిన్స్ పరీక్షలు నిర్వహించబడడం చకచకా జరిగిపోయాయి. అయినా వివాదాలు మాత్రం ఇంకా టీజీపీఎస్సీని వెంటాడుతూనే ఉన్నాయి. మెయిన్స్‌పరీక్షల నిర్వహణ తీరుపై, వెలువడ్డ ఫలితాలపై పలు అనుమానాలను వ్యక్తపరుస్తూకొందరు అభ్యర్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు.అటు అభ్యర్థుల తరఫున, ఇటు టీజీపీఎస్సీ తరఫున వాద,ప్రతి వాదనలను విన్న కోర్టు నియామక ప్రక్రియ మీద నిలుపుదల ఉత్తర్వులను విడుదల చేసింది. మరోపక్క అభ్యర్థులు టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరు మీద, అభ్యర్థులు లేవనెత్తిన పలు అనుమానాల మీద సరైన వివరణ ఇవ్వాలని కోరుతూ గత ఏప్రిల్ 30వ తేదీన టీజీపీఎస్సీకి కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ రాయడంతో వివాదం మరింత ముదిరింది. ఆ లేఖలో ఏముంది? టీజీపీఎస్సీ సమాధానం ఏంటి? వివాదాలను అధిగమించేందుకు మధ్యేమార్గంగా పరిష్కార మార్గాలు ఏమైనా ఉన్నాయా? బండి సంజయ్ తన లేఖలో పలు అంశాలకు వివరణ కోరగా, మరికొన్ని అంశాల మీద కొన్ని ప్రశ్నలను సంధించారు. మెయిన్స్ పరీక్షలకుహాజరైన అభ్యర్థుల జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్‌మెయిన్స్ హాల్ టికెట్ నంబర్లు, వయసు, కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కులు వంటి పూర్తి వివరాలు బహిరంగపరచడంతో పాటు పరీక్షా కేంద్రాల వారిగా అసమాన ఫలితాలు చోటు చేసుకోవడంపై సరైన వివరణను కోరారు. అట్లే జనరల్ ర్యాంకింగ్ లిస్టు కంటే ముందే ప్రొవిజినల్ ర్యాంకింగ్ లిస్టు అందించకపోవడానికి గల కారణం ఏంటని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న నిబంధనలు 15.2, 15.3 ఉల్లంఘనకు గలకారణాలు ఏంటని, అట్లే సుప్రీం కోర్టు ఆదేశానుసారం యూపీఎస్సీ తరహాలో మూల్యాంకన ప్రక్రియను మోడరేషన్ చేయకపోవడానికి గల కారణాలు ఏంటని, బయోమెట్రిక్ హాజరులో వ్యత్యాసం ఎందుకొచ్చిందని, ఫలితాల ప్రకటనకు ముందే డేటా లీక్ ఎలా జరిగిందని, మెయిన్స్ హాల్ టికెట్ల నంబర్లు కేంద్రాల కేటాయింపు యాదృచ్ఛికంగా జరిగినదా? లేదా దానిలో ఏమైనా మానవ ప్రమేయం దాగిఉన్నదా? అంటూ పలు ప్రశ్నలను సంధించారు. టీజీపీఎస్సీ వెంటనే స్పందించి అటు అభ్యర్థులకు ఇటు తెలంగాణ సమాజానికి సమాధానమిచ్చి తన పారదర్శకతను చాటుకోవాలని సూచించారు. కానీ ఇంతవరకు టీజీపీఎస్సీ నుండి ఎలాంటి సమాధానం రాలేదు. ఉద్యోగ



నియామక ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టకపోవడంతో ఆ జీవోలు రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా ఉన్నాయా? లేవా?అనే విషయాలు తెలియడంలేదని, అట్లే వాటి ప్రభావం నియామక ప్రక్రియలో ఏమేరకు ఉంటుందో అంచనా వేయలేకపోతున్నామని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో 29 రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నదనే ఉద్దేశంతో కోర్టులను ఆశ్రయిస్తే ఆలస్యం కారణంగా పిటిషన్లను కొట్టివేశారని అభ్యర్థులు వాపోతున్నారు. మరోపక్క రాజ్యాంగపరమైన అంశాలపై ఆలస్యం అనే కారణంగా పిటిషన్లను కొట్టివేయరాదని అది గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులకు విరుద్ధమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సమాచార హక్కు చట్టం ద్వారానైనా పూర్తి వివరాలను తెలుసుకోవాలని ఆరాటం చెందే వారికి అడుగడుగునా చుక్కెదురవుతున్నదని, ఆ చట్టం సామాన్యునికి అందనిద్రాక్షగానే మిగిలిపోయిందనే నిరాసక్తత బలంగా వినిపిస్తోంది. అధికారుల నిర్లక్ష్యమో లేక వారి ఉదాసీనతో తెలియదు గానీ సమాచారం మాత్రం సామాన్యునికి సకాలంలో అందడంలేదని ఒకపక్క ప్రజాస్వామికవాదులు మరో పక్క సమాచార హక్కుల కోసం నిత్యం నినదించే ప్రతినిధులు తమ వాణిని బలంగానే ప్రతిధ్వనింపజేస్తున్నారు. ఇలా వరుస వివాదాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీజీపీఎస్సీ కాలానుగుణంగా కొన్ని సంస్కరణలకు శ్రీకారం చుట్టినప్పటికీ ఏదో ఒక రూపంలో సరికొత్త వివాదాలు మాత్రం ఇంకా రాజుకుంటూనే ఉన్నాయి. నియామక ప్రక్రియలో భాగంగా టీజీపీఎస్సీ చేపట్టిన కొన్నివిధానాలు,వాటికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని జీవోలు సరికొత్త వివాదాలకు జీవంపోశాయని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నది. వాటిని అధిగమించడం కోసం ఇటీవల టీజీపీఎస్సీ నల్సార్ యూనివర్సిటీతో కలిసి సంయుక్తంగా 'పబ్లిక్‌సర్వీస్ కమిషన్లకు ఎదురవుతున్న న్యాయవివాదాలు పరిష్కారం' అనే జాతీయ సదస్సును నిర్వహించింది.ఆసదస్సు ముగింపు సమావేశంలో పాల్గొన్న తెలంగాణ గవర్నర్ ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో వివాదాలు తలెత్తకుండా పారదర్శకత పెంచేలా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు పని చేయాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాజ్యాంగ విలువలను కాపాడుతూ స్వతంత్రంగా సమగ్రతతో నియామకాలు చేపట్టాలని కూడా సూచించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సంధించిన పలుప్రశ్నలకు సహేతుకమైన సమాధానం ఇస్తూ ఎంపికైన అభ్యర్థుల పూర్తి వివరాలనుబహిర్గతం చేయడం ద్వారా అభ్యర్థులలో పారదర్శకతను పాదుగొల్పాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. కనీసం జనరల్ ర్యాంకింగ్ జాబితాలో ప్రిలిమ్స్ మెయిన్స్ హాల్‌టికెట్ నంబర్లు, వయస్సు,కేటగిరి, మీడియం,లింగం పేపర్ వారీగా పొందిన మార్కుల వివరాలు, అట్లే బయోమెట్రిక్ హాజరులో వచ్చిన వ్యత్యాసం మీద వివరణ ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు' కాకుండా నియామక ప్రక్రియలో భాగంగా విడుదల చేసే జీవోలను ముందస్తుగానే పబ్లిక్ డొమైన్‌లో పెట్టి అభ్యంతరాలు ఏమైనా ఉన్నట్లయితే అభ్యర్థుల నుంచి నిర్దేశిత సమయంలో స్వీకరించి ఎలాంటి న్యాయవివాదాలకు తావులేకుండా నియామక ప్రక్రియలను సజావుగా ముందుకు తీసుకుపోవాలని అందరూ కోరుకుంటున్నారు. ఆ దిశగా టీజీపీఎస్సీ అడుగులు వేస్తుందని ఆశిద్దాం! •

# ఎల్పీఎస్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

**- అధికారులకు అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) సిఎండి లక్ష్మీపార్ధసారథి ఆదేశం**

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి: జూన్ 17:** రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు తిరిగి ఇచ్చే ప్లాట్లను అభివృద్ధి చేసి తదనుగుణంగా వాటిల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు గట్టి భూమిక వహించాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) చైర్పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్ధసారధి ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆమె జోన్2, 7 ఎల్పీఎస్ లేఅవుట్లను





పరిశీలించారు. జోన్-1లో అబ్బరాజుపాలెం, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాల పరిధిలో 2.85 వేల ఎకరాల్లో జరుగుతున్నమౌలిక సదుపాయాల కల్పన పనులను తనిఖీ చేశారు. జోన్-7లో కొండమరాజుపాలెం, లింగాయపాలెం, ఉద్ధండరాయుని పాలెం గ్రామాల్లో 2.6 వేల ఎకరాల్లో చేపట్టాల్సిన లేఅవుట్ల అభివృద్ధికి ఇంజనీరింగ్ అధికారులు సమాయత్తం కావాలని సూచించారు. రాజధాని రైతులకు అభివృద్ధి చేసి ఇవ్వవలసిన లేఅవుట్లలో కనీస మౌలిక సదుపాయాలైన రహదారులు, మంచినీటి సదుపాయం, భూగర్భ-వర్షపు నీటి పారుదల వ్యవస్థ నిర్మాణాలకు గాను, ముడి సరుకును ప్రొక్యూర్ చేయాలని సంబంధిత చీఫ్ ఇంజనీర్ సిహెచ్.ధనుంజయకు ఆదేశాలిచ్చారు. ఈ పర్యటనలో ఎడిసీ చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్, ఐపిడి హెడ్ కెవి గణేష్బాబు, ఎస్ఇ ఆర్.హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, డిఇ పి.వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కుట్ర ఆలోచనలతోనే జగన్ రాజకీయ పర్యటనలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి: జూన్ 17:** జగన్ కుట్ర ఆలోచనలతోనే రాష్ట్రంలో రాజకీయ పర్యటనలు చేస్తున్నారని. ఆయనది పరామర్శ కాదని.. సమస్యల సృష్టికి చేస్తున్న కుట్రల స్కెచ్ అది అని.. ప్రజా సమస్యల పేరుతో జగన్ చేస్తున్న హింసా రాజకీయాలు, కుట్ర ఆలోచనలు ప్రజలు గమనించాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలియజేశారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఒక ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి... ఇలా శవ రాజకీయం చేయడం ఎక్కడా లేదని.. ఏడాది కాలంలో జగన్ ఏరోజూ ప్రజాసమస్యలపై స్పందించకుండా... ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడకుండా.. నేడు లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించేందుకు యత్నించడం సిగ్గేచేటని మండిపడ్డారు. గత ఐదేళ్ల ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని నడిపిన వ్యక్తి జగన్ రెడ్డి. ఆయన పాలనలో జై జగన్ అననందుకు నడి రోడ్డుపై పట్టపగలు తోట చంద్రయ్య పీక కోసి చంపారు. కడపలో సుబ్బయ్య అనే బీసీ నాయకున్ని చంపారు. మాస్క్ అడిగినందుకు సుధాకర్ అనే డాక్టర్ ను నడిరోడ్డుపై ఈడ్చి చంపారు. ఈ సంఘటనలు నేటికీ సజీవ సాక్ష్యాలన్నారు. అధికారం కోల్పోయాక కూడా జగన్ రెడ్డి అరాచకాలు దౌర్జన్యాలను కొనసాగిస్తున్నారు. అధికారం కోల్పోయానన్న అసహనం, మహిళలు తనకు ఓట్లు వేయలేదన్న అసూయతో వారి గౌరవాన్ని, ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా సాక్షి ఛానల్ లో విమర్శలు చేయిస్తున్నాడు. జగన్ పర్యటనలు



**సత్తెనపల్లి పర్యటన దేనికోసం.? ఎవరి కోసం?**
**- మీడియా సమావేశంలో టిడిపి సీనియర్ నేత, పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర ధ్వజం**

ప్రజలకోసం కాదని, ఆయన ప్రజల మీద దండయాత్ర చేస్తున్నారన్నారు. మిర్చి రైతుల పరామర్శకు వచ్చి మిర్చి బస్తాలు దొలించుకుపోయిన వ్యక్తులకు నాయకుడు జగన్ రెడ్డి. కుట్రపూరితమైన పర్యటనలతో రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారని, రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ యోగా డే జరుగుతోందని,. ప్రపంచం గుర్తించేలా ఆ రోజు యోగా డే సక్సెస్ చేసేందుకు అంతా నిమగ్నమై ఉన్నారన్నారు. స్వయంగా ప్రధాని వస్తున్నారని, ఇలాంటి సమయంలో లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించేందుకు జగన్ స్కెచ్ వేశారన్నారు. . అందులో భాగమే ఆయన పర్యటన అని పేర్కొన్నారు. జగన్ కొత్త కుట్రకు మళ్లీ తెరతీశారని, పరామర్శ పేరుతో హడావుడి చేస్తున్నారని దుయ్యబట్టారు. అందుకే గురువారం జగన్ సత్తెనపల్లిలో కొర్లకుంట నాగమల్లేశ్వరరావు ఇంటికి వెళుతున్నారని తెలిపారు. ఆయన వెళ్లడం మాకు అభ్యంతరం లేదని, జగన్ పరామర్శ చేసుకోవచ్చు.. ఎవరినైనా కలవొచ్చు.. ఏడాదిగా మేం ఏ రోజూ జగన్ ను ఆపలేదని, ఆంక్షలు పెట్టలేదని గుర్తుచేశారు. నాగమల్లేశ్వర రావు వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కు పాల్పడి, ఓడిపోయి ఆ డబ్బులు కట్టలేక గత ఏడాది జూన్ 9 తేదీన ఆత్మహత్య చేసుకున్నాడని, అంటే అతను చనిపోయి ఏడాది దాటిందని, అతని చావుకు కారణం కూడా జగన్ రెడ్డే అని అన్నారు. నాగమల్లేశ్వరరావు చనిపోయాక ఆ బెట్టింగ్ డబ్బులు కొంత మేర అతని తండ్రి చెల్లించాడని,. ఇందులో టీడీపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది ఎక్కడా. అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలు చేసుకోవచ్చు. కానీ కుట్రలు చేస్తామంటే చూస్తూ ఊరుకోమని. రాజకీయ ముసుగులో కుట్రలను ఏపీలో ఇక అమలు కానివ్వమన్నారు. ప్రజాహితం కంటే మాకు ఏది ముఖ్యం కాదని, లా అండ్ ఆర్డర్ కు, ప్రజల రక్షణకు మేం అత్యంత ప్రాధాన్యం ఇస్తామని,. ప్రజలు వాస్తవాలు అర్ధంచేసుకోవాలని నరేంద్ర వ్యాఖ్యానించారు.

## ఎస్ఎఫ్ఐ 18వ అఖిల భారత మహాసభలను

# జయప్రదం చేయండి

గుంటూరు తూర్పు, జూన్ 17 ప్రభాతవార్త : కేరళ రాష్ట్రం ఉన్న కోజికోడ్ జిల్లాలో జరిగే అఖిలభారత మహాసభలను విజయ వంతం చేయాలని కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని, ఈ విద్యా విధానంలో విద్యను కాషాయకరణ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బిజెపి చేస్తుందన్నారు. విద్యార్థులకు ఎంతో నష్టపరిచే విధంగా ఉందన్నారు. దీని ప్రత్యామ్నాయని ఆలోచించి నూతన ప్రణాళికను రూపొందించుకుంటుందని, 1970లో విద్యార్థులందరూ సమస్యలు తీరక ఇబ్బందులు




పడుతున్నప్పుడు దేశ వ్యాప్తంగా విద్యార్థులందరూ కలిసి కేరళలో మహాసభను ఏర్పాటు చేసుకుని విద్యార్థులు కంటూ ఒక సంఘం కావాలని ఆ సంఘం విద్యార్థుల సమస్యలు తీర్చే విధంగా ఉండాలన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చే విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోయే మూడు సంవత్సరాల్లో విద్యా రంగం ఎలా ఉండాలి, విద్యార్థి సమస్యల మీద ఎలా పని చేయాలి అనే అంశాల మీద మహాసభలు జరుగుతున్నాయన్నారు. దీనికి విద్యార్థినీ, విద్యార్థులు కాలేజీ యాజమాన్యాలు సహకరించాలన్నారు. తొలుత భారతీయ విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అఖిలభారత మహాసభల పోస్టర్ ఆవిష్కరణను లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ సమీర్, ఎం.కిరణ్, ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు నవిత, సహాయక కార్యదర్శి రూపాస్, జిల్లా కమిటీ సభ్యులు షంషీర్, సౌమ్య, సుభాష్, గుంటూరు నగర ఉపాధ్యక్షులు జాన్, నగర కమిటీ సభ్యులు సైదాబీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యాసరస్వతి అమ్మవారికి సుబ్రహ్మణ్య స్వామికి విశేషాభిషేకాలు

గుంటూరు కల్చరల్,జూన్ 15,ప్రభాతవార్త : స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏం.కే.ఆర్.అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న క్రమంలో ఆదివారం ఉదయం గోపూజ,గురుప్రార్ధన,మండపారాధన,వేదమంత్రాల నడుమ నిర్వహించారు.శ్రీవిద్యా సరస్వతి అమ్మవారికి సుబ్రహ్మణ్యస్వామికి విశేషాభిషేకార్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.సాయంత్రం శ్రీసూక్తహోమం,సుబ్రహ్మణ్య హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు తీర్ధప్రసాదాలను అందించారు.

# గుంటూరు వార్త



# మంగళగిరి వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం

**--రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్**

మంగళగిరి,జూన్ 17,ప్రభాతవార్త : రా ష్ట్ర ఐటి,విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ ప్రతే ్యక చొరవతో కూటమి ప్రభుత్వం సుమారు రూ.138కోట్ల నిధులతో మంగళగిరిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య



శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు సూచించారు.మంగళవారం నగరంలోని ఆటోనగర్ ఏపిఎంఎస్ఐడిసీ కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.వంద పడకల ఆస ్పత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసి రానున్న ఏడాది నాటికి రోగులకు వైద్యసేవలు అందించేలా అధికారులు తమ వంతు కృషి చేయాలని కోరారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21వ తేదిన భారత ప్రధాని నరేంద్రమోదీ విశాఖపట ్నం విచ్చేయనున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో ఏపిఎంఎస్ఐడిసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీషా,చీఫ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు తోపాటు వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## బాలుడి వైద్యఖర్చులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ఆర్థిక చేయూత

**--ఎర్రబాలెం గ్రామంలో ప్రమాదంలో గాయపడిన బాలుడికి రూ.20వేలు అందజేత**

మంగళగిరి,జూన్ 17,ప్రభాతవార్త : మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన బాలుడి వైద్యఖర్చులకు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతినిధులు ఆరి ్థక చేయూత నందించారు.ఎర్రబాలెం ఎస్టీ కాలనీకి చెందిన భువనగిరి జగత్ కళ్యాణ్(2సంవత్సరాలు) అనే బాలుడికి




ఐరన్ గేటు తగలడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.,విషయం తెలుసుకున్నా గివింగ్ బ్యాక్ టు సొసైటీ బాలుడి వైద్య ఖర్చులకు మంగళవారం రూ.20వేల ఆర్థికసాయం చేసింది.సదరు చెక్కును మంగళగిరి ఎమ్మార్వో కె.దినేష్ రాఘవేంద్ర చేతుల మీదుగా తండ్రి భువనగిరి ప్రశాంత్కు అందజేశారు.తమ సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి తమ కుమారుడి వైద్యఖరు ్చలకు సహాయం అందించినందుకు జగత్కళ్యాణ్ కుటుంబ సభ్యులు గివింగ్ బ్యాక్ టు సొసైటీ ప్రతినిదులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో దినేష్ రాఘవేంద్ర మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పధంతో గివింగ్ బ్యాక్ టు సొసైటీ ని ప్రారంభించి నిరుపేదల సమగ్రాభివృద్ధికి,సంక్షేమానికి కృషిచేయడం అభినందనీయమన్నారు.గివింగ్ బ్యాక్ టు సొసైటీ లక్ష్యాలు,ఆశయాలు ఎంతో ఉన్నతంగా ప్రశంసించారు.భవిష్యతులో గివింగ్ బ్యాక్ టు సొసైటీ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థులకు,నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ప్రతి ఒక్కరూ సేవా దృక ్ఫధాన్ని అలవర్చుకుంటే సమాజంలో మార్పు వస్తుందన్నారు.

# సిఎం సహాయనిధితో ఆర్థిక భరోసా: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు, జూన్ 17 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని, సంక్షేమం, అభివృద్ధి, రెండు జోడు గుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఇద్దరికీ సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్తో ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు



తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.50కోట్ల సీఎం రిలీఫ్ పండ్ నిధులు బాధితులకు అందించామని వెల్లడించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసిన వెంటనే మంజూరుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో తల్లికి వందనం నిధులు జమైన తల్లిదండ్రుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. ఇకపై తమ బిడ్డల చదువులకు ఎలాంటి డోకా లేదనే భరోసా ప్రతి ఒక్కరిలో కనిపిస్తోందని తెలిపారు. కేవలం ఏడాది కాలంలోనే రాష్ట్రంలో ప్రగతికి ముందడుగు పడిందని, ఇది సీఎం చంద్రబాబునాయుడు వంటి విజనరీ లీడర్తోనే సాధ్యమని చెప్పారు. గత ప్రభుత్వంలో కనీసం సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు కూడా కేటాయించలేని స్థితిలో అధ్వాన పరిపాలన సాగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

గుంటూరు తూర్పు, జూన్ 17 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈనెల 21న వైజాగ్లో



ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న యోగాలో దేశ ప్రధాని హాజరు కానున్న నేపథ్యంలో కార్యక్రమ విజయ వంతంకు విధులు కేటాయించబడిన వివిధ శాఖల అధికారులతో మంగళవారం వైజాగ్ మెయిన్ బస్టాండ్లోని ఈడి కార్యాలయంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, రవాణ శాఖ మంత్రి రాంప్రసాద్రెడ్డి ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో గుంటూరు నగర కమీషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు.



## కుప్పం మహిళ శిరీషకు ఫోన్లో

# సిఎం పరామర్శ

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి: జూన్ 17:** చిత్తూరు జిల్లా ,కుప్పం మండలం, నారాయణపురం గ్రామంలో అప్పు తీర్చలేదని చెట్టుకు కట్టేసి అమానుషంగా వ్యవహరించిన ఘటనలో బాధితురాలు శిరీషతో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. ఫోన్లో మాట్లాడి శిరీషను పరామర్శించి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటన....**
**పిల్లల చదువుకు హామీ..అన్ని విధాలా అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని సిఎం భరోసా**

గతంలో ఎప్పుడైనా వారి నుంచి వేధింపులు ఎదురయ్యాయా అని అడిగారు. పలు సందర్భాల్లో తమను ఇబ్బందిపెట్టారని ఆమె చెప్పారు. ఈ ఘటనలో పిల్లలు, తాను భయపడుతున్నామని ముఖ్యమంత్రికి బాధితురాలు గోడు వెళ్లబోసుకుంది. ఇటువంటి ఘటన దురదృష్టకరమని, ఇలాంటి వాటిని సహించే ప్రసక్తే లేదని సిఎం స్పష్టం చేశారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చానని సిఎం అన్నారు. శిరీష పిల్లలు ఏం చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వారిని బాగా చదివించాని సూచించారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా అండగా ఉంటానని....ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలను చదివించుకోవడానికి ఇబ్బంది పడుతున్న శిరీష పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి... అప్పటికప్పుడు ఆమెకు రూ.5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ముగ్గురు పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని శిరీషకు ఫోన్లో సిఎం హామీ ఇచ్చారు. ఘటన, తదనంతర పరిణామాలపై తనకు నివేదిక ఇవ్వాలని, బాధిత కుటుంబానికి అందుబాటులో ఉండి అవసరమైన సాయం పూర్తిగా అందేలా చూడాలని సియం అధికారులను ఆదేశించారు.

# వైసీపీ జడ్పీటీసీ భర్త దౌర్జన్యాలు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి: జూన్ 17:** వైసీపీ జడ్పీటీసీ భర్త భానుకుమార్ రెడ్డి మరియు కె. చంద్రశేఖర్ రెడ్డి, సాయికుమార్ అనే వ్యక్తులు తప్పుడు వేలిముద్రలతో దౌర్జన్యంగా తమ భూమిలోకి ప్రవేశించి తమను భూమిలోకి వస్తే చంపుతామని బెదిరిస్తున్నారని.. దయ చేసి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమ భూమిని సర్వే చేసి తమకు



**టిడిపి కార్యాలయం గ్రీవెన్స్లో ఫిర్యాదు**
**అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తాక్ అహ్మద్**

అప్పగించాలని తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం సంజీవరాయపురం గ్రామానికి చెందిన పి. వెంకటరమణారెడ్డి నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మోలానా ముస్తాక్ అహ్మద్ లకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన టి. లావణ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ కుటుంబ గొడవలతో ఎటువంటి సబంధంలేని ఇతర వ్యక్తులు నిమ్మల రాజేంద్ర ప్రసాద్, జిలుగు వంశీ, నాగళ్ల కొండలరావు, శివదాసు, ఉన్నం శ్రీను, చింతా రామకృష్ణ, రామిశెట్టి గోపి, కోలా తిరుమలరావులు కలుగజేసుకొని తమ ఇంట్లోకి ప్రవేశించి తనను, తన భర్తను చంపేందుకు యత్నించారని. వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన టి. లావణ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ కుటుంబ గొడవలతో ఎటువంటి సబంధంలేని ఇతర వ్యక్తులు నిమ్మల రాజేంద్ర ప్రసాద్, జిలుగు వంశీ, నాగళ్ల కొండలరావు, శివదాసు, ఉన్నం శ్రీను, చింతా రామకృష్ణ, రామిశెట్టి గోపి, కోలా తిరుమలరావులు కలుగజేసుకొని తమ ఇంట్లోకి ప్రవేశించి తనను, తన భర్తను చంపేందుకు యత్నించారని. వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.

సన్న, చిన్న కారు రైతులను ఆదుకునేందుకు ఉచిత బోరు పథకం ఉన్నా గత ప్రభుత్వం ఎస్సీ రైతులను అసలు పట్టించుకోలేదని.. దయ చేసి మెట్ట ప్రాంతంలో ఉన్న తమకు బోర్లు మంజూరు చేసి ఎస్సీ రైతులకు కూటమి ప్రభుత్వం సాయం చేయాలని ఎన్టీఆర్ జిల్లా ఏ. కొండూరు మండలం గొల్లమంద గ్రామానికి చెందిన తేనేటి ఇమ్మానేయులు, పలువురు రైతులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

తాను టీడీపీ పార్టీకి అనుకూలంగా ఉండటంతో తనకు వస్తున్న పింఛన్ ను వైసీపీ కార్పొరేటర్ తీయించాడని.. తన పేరుమీద ఎటువంటి ఆస్తులు లేకపోయినా పింఛన్ తీసుకునేందుకు అన్ని అర్హతలు ఉన్న కావాలనే పింఛన్ రాకుండా అడ్డుకున్నారని.. దయ చేసి కూటమి ప్రభుత్వం తన పింఛన్ ను పునరుద్ధరించి ఇవ్వాలని గుంటూరు తారకరామనగర్ కు చెందిన షేక్ గౌస్ బాసా అభ్యర్థించారు. తమ తాత ముత్తాతల నుండి తిరుమల సూరాపురం తోటలో నివశిస్తూ.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న తమను యాత్రికుల సౌకర్యార్థం ఖాళీ చేయించి ఇంటికి బదులు ఇల్లు, ఇంటికొక వాలంటీర్ ఉద్యోగం, షాపులు ఉన్న వారికి ప్రత్యామ్నాయ షాపులు ఇస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా తమకు న్యాయం జరగలేదని... దయ చేసి తమ సమస్యను పరిష్కరించాలని వి. శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

## కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల బంగారు భవితకు బాటలు

**--స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ అధ్యక్షులు ఏసుబాబు మాదిగ**

గుంటూరు విద్య,జూన్ 15,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వంలోనే విద్యార్థులకు మేలు చేకూరుతుందని విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.ఇచ్చినమాట ప్రకారం విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేయడం హర్షణీయమని స్వర్ణాంధ్ర ఎమ్మార్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసుబాబు మాదిగ హర్షం వ్యక్తంచేశారు.ఒక సమర్థవంతమైన నాయకుడికి పట్టుదల కృషి ఉంటే ఎన్ని కష్టాలు,ఆర్థికసమస్యలు ఉన్నా సరే ప్రజల కోసం ఎంత దూరమైన వెళ్ళి పని చేయగలరని అనడానికి నిదర్శనమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ముఖ్యంగా దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయని విధంగా కుటుంబంలోని పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం డబ్బులు జమ చేయడం ఒక చారిత్రాత్మక సంఘటన అని అన్నారు.అభివృద్ధికి మారుపేరుగా నిలిచే పరిపాలనపై పట్టు కలిగిన విజనరీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఒకవైపు సంక్షేమాన్ని అందిస్తూ మరోవైపు అభివృద్ధికి అడుగులు వేస్తూ ముందుకు సాగుతుందని ఇది చాలా అభినందించదగ్గ విషయమన్నారు.విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం తొలి నుండే ప్రోత్సాహకం అందిస్తుందని విద్యా వ్యవస్థలోమార్పులకు శ్రీకారం చుట్టి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్బుక్ స్,బ్యాగ్,టెక్స్ట్ బుక్ స్,షూస్,రెండు జతల యూనిఫాం,బెల్ట్ డిక్షనరీ కలిగిన కిట్టును అందించడం అభినందించదగ్గ విషయమని ముఖ్యంగా ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా విద్యావ్యవస్థకే ఆదర్శవంతులైన సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ఏర్పాటు చేయడం శుభపరిణామం అన్నారు.


ప్రభాత వార్త

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెట్వర్క్ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గలవారికి స్టాఫ్రిపోర్టర్లు, న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.

అభ్యర్థులకు కావలసిన అర్హతలు

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్ లేదా డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావాల్సిన కేంద్రాలు

గుంటూరు కలెక్టరేట్, గుంటూరు క్రైమ్, రేపల్లె, చుండూరు, చేబ్రోలు, పెదకాకాని, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, తాడికొండ, దుర్గి


ఆసక్తిగల అభ్యర్థులు 'జూన్ 21, 2025 శనివారం) తమ బయోడేటాతో సంప్రదించగలరు

'వార్త' యూనిట్ కార్యాలయము
NH-5, చిలకలూరిపేట రోడ్, అంకిరెడ్డిపాలెం, గుంటూరు
బ్రాంచి మేనేజర్ ఫోన్: 89786 45936

# కొల్లిపర మండలానికి పూర్వ వైభవం తీసుకొస్తా

## -రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్

కొల్లిపర,జూన్ 17 (ప్రభాతవార్త): గ్రామాలు అభివృద్ధి చేస్తూ..ప్రజా సంక్షేమం చూస్తూ కొల్లిపర మండలాన్ని జిల్లాలో ప్రథమస్థానంలో నిలిపి పూర్వ వైభవం తీసుకువస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు.మంగళవారం మండల పరిధిలోని చక్రాయపాలెం,దావులూరు,తూములూరు పంట కాలవలను అధికారులు,నీటి సంఘాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,కూటమి నాయకులతో కలసి పరిశీలించారు.అనంతరం కొల్లిపర పాల ఉత్పత్తిదారుల కళ్యాణ మండపంలో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసిందన్నారు మనోహర్ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు.ఖరీఫ్ పనులు ప్రారంభం కానున్నాయని చెబుతూ శివారు భూములకు కూడా సాగు నీరు అందిస్తామన్నారు.మండలంలో కొల్లిపర,వల్లభాపురం వద్ద బుర్రిపాలెం చానల్స్ పై కూడా పర్యవేక్షించామని చెబుతూ రైతులు కూడా డొంకరోడ్లు గురించి ప్రస్తావించారన్నారు.ఈ ఏడాది డొంకరోడ్ల మరమ్మత్తులు చేసేందుకు రూ.10 కోట్లు రూపాయలు తీసుకురావటం జరిగిందన్నారు.గత ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు రైతులకు అపారస్య ం కలిగించారని కనీసం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు కూడా ఇవ్వలేకపోయారన్నారు.అనంతరం మండల పరిధిలోని 62 మంది రైతులకు 27 లక్షల 6 వేల 973 రూపాయల విలువ గల యంత్ర పరికరాలను



రైతులకు అందజేసారు.కార్యక్రమంలో ఎపీపీ భీమవరపు పద్మావతి,తహశీల్దార్ గుమ్మడి సద్గార్,ఎపీడీఓ విజయలక్ష్మి,మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరెడ్డి,నీటి సంఘం అధ్యక్ష,ఉపాధ్యక్షులు శ్రీరామిరెడ్డి,ఎడుకొండలు,నాయకులు అడపా నారాయణరెడ్డి,భీమవరపు కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,తాతా శివయ్య,మొవ్వా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## :వాణిజ్య పన్నులు ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు అధికారులు చర్యలు తీసుకోవాలి

బాపట్ల,జూన్17,ప్రభాతవార్త: వాణిజ్య పన్నులు ఎగవేతదారుల నుంచి పన్ను వసూలుకు అధికారులు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.వాణిజ్య పన్నులు, అనుబంధశాఖల అధికారులతో జిల్లాస్థాయి సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధంగా వాణిజ్య పన్ను వసూలుపై యంత్రాంగం దృష్టి పెట్టాలన్నారు.గత ఆర్థిక సంవత్సరంలో రూ.95.14 కోట్లు వాణిజ్య పన్ను వసూలు జరిగిందన్నారు. ప్రస్తుతం గణనీయంగా పన్ను వసూలు తగ్గడంపై ఆరా తీశారు.బాపట్ల




జిల్లాలో అత్యధికంగా కాటన్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమ, ఆయిల్ మిల్లులు, ఆక్వా రంగానికి సంబంధించిన పరిశ్రమలపైనే వాణిజ్య పన్నులు అత్యధికంగా వసూలు అవుతున్నాయన్నారు. రూ.50 లక్షలు టర్నోవర్ దాటిన వారంతా కచ్చితంగా జీఎస్టీ చెల్లించాలన్నారు.వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.కరెంట్ అకౌంట్లకు సంబంధించిన బ్యాంకు ఖాతా వివరాలను వాణిజ్య శాఖకు అందించాలన్నారు.తద్వారా వాణిజ్య పన్నులు వసూలుకు మార్గం సుగమమవుతుందన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు, విద్యా సంస్థలు, గ్రామపంచాయతీలు, జిల్లా పరిషత్ జీఎస్టీ చెల్లిస్తేనే పునరుద్ధరణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ప్రతి అంశంలోను ఏపీ జీఎస్టీని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా వివిధ నిర్మాణ రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టే గుత్తేదారులు బిల్లులు చేసినప్పుడే పన్ను చెల్లించేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు.గ్రానైట్ పరిశ్రమ నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వానికి నష్టం జరుగుతుందని తెలిపారు. గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు, రవాణాలో బోగస్ రిజిస్ట్రేషన్ల ద్వారా పన్నులు వసూలు కావడం లేదని తాజా సర్వేలో వెలుగులోకి వచ్చిందన్నారు. పన్నుల ఎగవేతను అరికట్టడానికి ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. అధికారుల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అక్రమాలను పూర్తి స్థాయిలో అరికడతామని తెలిపారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా జరిగే భూముల క్రయవిక్రయాలపై స్పష్టమైన వివరాలను నిక్కచ్చిగా వాణిజ్య శాఖకు అనుసంధానించాలన్నారు. తీర ప్రాంతాల్లోని రిసార్ట్స్ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై పర్యాటకశాఖ, వాణిజ్య పనుల శాఖ సమన్వయంతో పనిచేయాలన్నారు. జీఎస్టీ చెల్లించకుండా గుత్తేదారులు పనిచేస్తున్నట్లు నిర్ధరణ అయితే వారిని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆదేశించారు. పన్ను వసూళ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ బి గీతామాధురి, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా వాణిజ్య పనుల శాఖ అధికారిని ఆర్ శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు శక్తి యాప్ రక్షణ కవచం

బాపట్ల,జూన్17,ప్రభాతవార్త: శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలాంటిదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు..మంగళవారం శక్తి బృందాలు జిల్లాలోని రైల్వే స్టేషన్ లు, బస్టాండ్ లు, ఇతర రద్దీ ప్రదేశాలు, షాపింగ్ మాల్స్, అంగన్వాడీ కేంద్రాలు వంటి ప్రదేశాలలో శక్తి యాప్ వినియోగించు విధానం, అందులో పొందుపరచబడిన సమాచారం తదితర వివరాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలాంటిదన్నారు. ఏదైన ఆపద వచ్చినప్పుడు పోలీస్ ల తక్షణ రక్షణ పొందడానికి శక్తి



యాప్ యంతగానో దోహదపడుతుందన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క మహిళా తమ మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. పోలీస్ సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 ను కూడా అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నెంబరుకు వీడియో కాల్ లేదా నార్మల్ కాల్ లేదా మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళతాయన్నారు. వెంటనే శక్తి బృందాలు స్పందించి ఆపదలో ఉన్న మహిళ వద్దకు చేరుకొని సహాయం అందించడం జరుగుతుందన్నారు.

## ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు-పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజల వద్ద స వ్యయంగా ఫిర్యాదుల స్వీకరించి వారి సమస్యలకు చట్టపరిధిలో తగిన పరిష్కారం చూపిస్తామని ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు.ముఖ్యంగా మహిళలు,వృద్ధుల ఫిర్యాదుల పట్ల దృష్టి సారించి ఫిర్యాదిదారులకు చట్టపరిధిలో తగిన న్యాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన ప్రజలతో ఎస్పీ,ఇతర పోలీసు అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు.మహిళా పోలీస్టేషన్ డిఎస్పీ భాదితుల వద ్దకు నేరుగా వెళ్ళి వారి ఫిర్యాదులు స్వీకరించారు.కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి,అడి ్మన్ ఎ.హనుమంతు,ఏఆర్ మహిళా పోలీస్టేషన్ డిఎస్పీ శ్రీనివాసరెడ్డి,శివాజీ,సీఐ బిలాలుద్దీన్,ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో సెయింట్ లారెల్స్ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

గుంటూరు విద్య,జూన్ 17,ప్రభాతవార్త : స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో టెన్త్ క్లాస్ చదువుతున్న విద్యార్థిని బుష్రా ఫాతిమా గత ఏడాది జాతీయస్థాయిలో ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంస్థ నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో విజేతగా నిలిచింది. ఒక జాతీయ సంస్థ నిర్వహించిన పోటీల్లో సుమారు 80పట్టణాల నుంచి 9,000మంది విద్యార్థులు పాల్ ్గన్న భారీస్థాయి పోటీల్లో సెయింట్ లారెల్స్ విద్యార్థిని రీజనల్ అవార్డు సాధించడం పట్ల స్కూల్ యాజమాన్యం మంగళవారం స్కూల్ ఆవరణలో విజేతగా నిలిచిన విద్యార్థిని,వారి తల్లిదండ్రులకు పెద్దఎత్తున సన్మాన,సత్కార కార్యక్రమాన్ని నిర్వహించింది.ఇంత పెద్దపోటీలో మన రాష్ట్రంలోని గుంటూరు పట్టణం సెయింట్ లారెల్స్ స్కూల్‌కి అవార్డు రావడం మన తెలుగు రాష్ట్రాలకు గర్వకారణంగా నిలిచింది.ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల ్చరల్ హెరిటేజ్ అనే సంస్థ జాతీయ సమగ్రత సంస్కృతి సాంప్రదాయాలు దేవాలయాలు మరియు కట్టడాలు ఇంకా ఇతర భారత దేశానికి వెన్నె తెచ్చినటువంటి శిల్పాలు కట్టడాలు వీటన్నిటి మీద ఒక పెద్ద కార్యక్రమాన్ని ఈ సంస్థ చేపట్టడం ఎంతైనా అభినందనీయం.మన రాష్ట్రానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న ఎస్‌విఎస్ లక్ష్మీనారాయణ వారికి సహకరిస్తున్నటువంటి వేణుగోపాల్,రవి,శ్రీనివాస్ ఇతర పెద్దలు దీంట్లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు,స్కూల్ డైరెక్టర్ శ్రీకర్ తదితరులు మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి కూడా అవార్డు పొందిన ఫాతిమాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.విద్యార్థులకు కలిగే సృజనాత్మకత ఆలోచనలను రూపకల్పన జరిగినప్పుడే అద్భుతమైన ఆవిష్కరణలు జరుగుతాయని పేర్కొన్నారు.అవార్డు గ్రహీత ఫాతిమా మాట్లాడుతూ రంజాన్ పండుగ విశిష్టత,సాంప్రదాయ అంశాలను చిత్రకళా రూపంలో చిత్రీకరించానని అందుకు రీజనల్ స్థాయిలో అవార్డు లభించిందని ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యానికి,పోటీలు నిర్వహించిన సంస్థకు,తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఫాతిమాను ఘనంగా సత్కరించి స్కూలు తరపున రూ.2000లు నగదు బహుమతిని స్కూల్ డైరెక్టర్ కరస్పాండెంట్లు ప్రకటించారు.కార్యక్రమం మొత్తం కూడా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని మీనాక్షి,కళ్యాణి తదితర ఉపాధ్యాయులు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు.

## పేదలకు పెన్షన్ల పంపిణీ

గుంటూరు విద్య,జూన్ 15,ప్రభాతవార్త : సా ్థనిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108మంది పేదలకు పెన్షన్లు పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ వేమూరి నాగ శంకర్,విశిష్ట అతిథి చార్టర్డ్ అకౌంటెంట్ పులికొండ పిచ్చయ్య,గౌరవాతిదులుగా అవోపా రాష్ట్ర అధ్యక్షులు తటపర్తి రాంబాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ వేమూరి నాగశంకర్ మాట్లాడుతూ అవోపా అధ్వర్యంలో ప్రతినెల 108మంది పేదలకు ఒక్కొక్కరికి రూ.500లు చొప్పున పెన్షన్ ఇవ్వడం,విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమన్నారు.విశిష్ట అతిథి పులకొండ పిచ్చయ్య మాట్లాడుతూ ఆవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా మందులు అందించడం,ప్రతివారం గోసేవ అభినందనీయమని ఆవోపా ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.రాష్ట్ర అధ్యక్షులు తటపర్తి రాంబాబు మాటా ్లడుతూ ఆవోపా శాఖల ద్వారా విద్య,వైద్యం,ఉపాధి ఈ మూడు అంశాల్లో రాష్ట్రస్థాయిలో వివిధ పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆవోపా ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు,పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు,స్వామిగుప్తా,మిరియాల మోహన్‌రావు,అమరా రమేష్,టివి రమణ,తదితరులు పాల్గొన్నారు.

## పొనుగోటి మౌనికకు డాక్టరేట్ ప్రదానం

గుంటూరు విద్య,జూన్ 17,ప్రభాతవార్త : స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల ఫార్మకాలజీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పొనుగోటి మౌనికకు కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు.కె.ఎల్.కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ మరియు ప్రిన్సిపాల్ గుంటుపల్లి చక్రవర్తి పర్యవేక్షణలో ఖిల్లిస్ మరియు మోరిస్ హైడ్రేట్ యొక్క డైయురిటెక్ మరియు యాంటీయురోలిథియాటిక్ సామర్థ్యాన్ని ఇథిలీస్ గ్లైకాల్ ప్రేరిత యురోలిథియాసిస్ అనే అంశంపై విస్టార్ ఎలుకల్లో పరిశోధన చేశారు.ఈ పరిశోధన చేసినందుకు గాను డాక్టరేట్ సాధించారన్నారు.కళాశాల్లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఛైర్మన్ జూపూడి రంగరాజు మాటా ్లడుతూ ఇప్పటివరకు డాక్టరేట్ పొందిన అధ్యాపకులు 13మంది ఉండడం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తోడ్పడుతుందన్నారు.ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు,ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం,ఫార్మా డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష,ఫార్మకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు,సహచర అధ్యాపకులు,సిబ్బంది,డాక్టరేట్ సాధించిన పొనుగోటి మౌనికకు అభినందనలు తెలియజేశారు.

## మంత్రి నారా లోకేష్‌పై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే వైసీపీ మూసివేయాలి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : ఎన్డీయే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం అమలుచేస్తే అది చూసి తట్టుకోలేని జగన్‌రెడ్డి అండ్ కో నారా లోకేష్ మీద విషం చిమ్ముతుంది.దీన్ని తాము ఏ మాత్రం సహించమని,చేసిన అసత్య ఆరోపణలు నిరూపించాలని ప్రజలకు క్షమాపణలు చెప్పాలని,నిరూపించకపోతే వైసీపీ మూసివేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి డిమాండ్ చేశారు.మంగళవారం గుంటూరు పశ్చిమ టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ఎన్నికలకు ముందు తల్లికి వందనం ఇచ్చిన హామీ ప్రకారం ఎంతమంది ఉంటే అంతమందికి "తల్లికి వందనం"డబ్బులు జమచేశాము.సంక్షేమం జరుతుందని వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తూ నారా లోకేష్ మీద విషం చిమ్ముతుంది.వైసీపీ పాలనలో రూ.13వేలు ఇచ్చారంటే రూ.2వేలు జగన్ జేబుల్లోకి పోయాయా? తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా? అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశ్నించారు.ఇది వైసీపీలాగా అబద్ధపు హామీలతో గెలిచి, మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం కాదు,ప్రజామద్దతుతో గెలిచిన ప్రభుత్వమన్న విషయం జగన్‌రెడ్డి అండ్ కో గుర్తుంచుకోవాలి.జగన్ పాలనలో 42లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27లక్షల విద్యార్థులకు తల్లికి వందనం ఇస్తుందని,కుటుంబంలో ఒక్కరికే అనే షరతు పెట్టి పేద,మధ్య తరగతి విద్యార్థులను వారి తల్లిదండ్రులను జగన్మోహన్‌రెడ్డి మానసికంగా వేధింపులకు గురి చేశారని 2019ఎన్నికల ప్రచారంలో "మీ ఇంట్లో ఇద్దరు పిల్లల్ని బడికి పంపండి ఒక్కొక ్కరికి రూ.15వేలుచొప్పున ఇస్తాము"అంటూ మీ సతీమణి,సాక్షి పత్రిక యజమాని,భారతీరెడ్డి ప్రచారం చేయలేదా? అని ఎమ్మెల్యే విమరి ్శంచారు.జగన్ హయాంలో ప్రతియేటా వివిధ కారణాలతో లబ్ధిదారులను తగ్గించుకుంటూ పోయారని 2021లో 44.48లక్షల మంది లబ్ధిదారులుంటే 2023కి ఆ సంఖ్య 42.61లక్షలకు పడిపోయిందన్నారు.నేడు కూటమి ప్రభుత ్వం 67.27లక్షల మంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## --వైద్యం వికటించి యువకుడి మృతి - బాధిత కుటుంబం ఆవేదన

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : నగరంలోని ప్రముఖ హాస్పటల్స్ లో ఒకటిగా పేరొందిన అమృత హాస్పటల్ మరోసారి వివాదంలో చిక్కుకుంది.బాపట్ల జిల్లాకుచెందిన ఒక యువకుడికి గుంటూరులోని అమృత హాస్పటల్లో శస్త్రచికిత్స అనంతరం మరణించడం తీవ్ర సంచలనానికి దారితీసింది. బాపట్ల జిల్లాకు చెందిన వ్యక్తి గతంలో బాపట్లలో ఒక సర్జరీ చేయించుకున్నాడు.అయితే,ఆ సర్జరీ సరిగా జరగకపోవడంతో మెరుగైన చికిత్స కోసం గుంటూరు అమృత హాస్పటల్‌ను ఆశ్రయించాడు.కానీ అక్కడ జరిపిన శస్త్ర చికిత్స అనంతరం కొన్ని గంటల వ్యవధిలోనే అతను మృతి చెందాడు.ఈ ఘటన తీవ్రంగా చర్చనీయాంశంగా మారింది.మృతుడి బంధువుల కథనంప్రకారం,శస్త్రచికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో తాము హాస్పటల్ సిబ్బందిని సంప్రదించగా సరైన సమాధానాలు ఇవ్వకపోవడం,పైగా హుటాహుటిన పరిస్థితిని అదుపు చేయడంలో వైఫల్యం ఎదురైందని వారు ఆరోపిస్తున్నారు . ఈ ఘటనపై కొంతమంది వ్యక్తులు ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న టీషాప్‌ను కూడా మూసివేయడం గమనార ్హం,అంతేకాకుండా మధ్యవర్తిత్వంతో ఆర్థిక సెటిల్‌మెంట్ జరిగిందని మృతుడి బంధువులు తెలిపారు.ఇలాంటి ఘోర ఘటనలు జరిగినా,సంబంధిత వైద్యాధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెతు ్తున్నాయి.హాస్పటల్స్‌పై నిఘా లేకపోవడం వల్ల ఈ ఘటనలు అర్ధరాత్రి గంటల్లో నిర ్భందంగా జరుగుతున్నాయని నిఘా వర్గాలు వెల్లడించాయి.పత్రికల్లో వచ్చేంతవరకు అధికారులు ఏం చేసు ్తన్నారో అనే సందేహం వ్యక్తం అవుతుంది.

## వైసీపీ నేతలు తప్పడు ప్రచారాలుచేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారు : డేగల ప్రభాకర్

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం కార్యక్రమం కింద రూ.15వేలు ఇస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలుచేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ ఆరోపించారు.మంగళవారం అర్బన్ టిడిపి కార్యాలయంలో ప్రభాకర్ విలేకరులతో మాట్లాడారు.రూ.15లలో రూ.2వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ వైసీపీ నేతలు దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.దమ్ముంటే రుజువు చేయండి అని ఆయన సవాల్ విసిరారు.ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

## తహశీల్దార్ సంతకం ఫోర్జరీ...ఆరుగురిపై కేసు నమోదు

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : స్థానిక అరండల్‌పేటలో తహశీల్దా ్ధర్ సంతకాన్ని ఫోర్జరీచేసి 2,200గజాల స్థలాన్ని రిజిస్టర్‌చేసిన ఆరుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు.హైదరాబాద్‌కు చెందిన చంద్రమౌళి,విశాఖకు చెందిన రామకోటేశ్వరరావు,మాదల శ్రీవల్లి,మహ్మద్ పర్వేజ్,గింజుపల్లి వీరయ్యచౌదరి,వెంకటరెడ్డి కలసి ఈ పని చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు.చంద్రమౌళి లింక్ డాక్యూమెంట్లు కోసం స్థలాన్ని శ్రీవల్లి,రామకోటేశ్వరరావు పేరున కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడని,గుర్తించిన సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌కు నిధులు మంజూరు

### --2018లో ప్రతిపాదనలు --గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వెనక్కు మళ్లిన నిధులు

### --శాఖపరంగా వరుస ఫాలో అప్‌ల ద్వారా నిధులు సాకారం ..కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

గుంటూరు క్రైమ్,జూన్ 17,ప్రభాతవార్త : ఆం ధ్రప్రదేశ్ ప్రజలకు శుభవార్త సెంట్రల్ కామన్ సెక్రటేరియట్,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణం నిమిత్తం అమరావతిలో నిర్మితమయ్యే



భవనాలకు గాను కేంద్ర ప్రభుత్వం ద్వారా నేడు సుమారు రూ.2,787 కోట్లు మంజూరు చేయించుకోగలిగాం అని గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖకేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.నూతన రాజధాని అమరావతిలో నిర్మించాల్సిన కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.1,458కోట్లను మంజూరు చేసినట్లుగా స్పష్టంచేసింది.గడిచిన ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనల గురించి పట్టించుకోలేదు.దీంతో రాజధానిలో నిర్మాణాల ప్రసక్తే లేకుండా పోయింది.ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ ఇది కూటమి ప్రభుత్వ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధి పట్ల కేంద్రం చూపిన విశా ్వసానికి నిలువెత్తు నిదర్శనం ఇందుకు సహకరించిన ప్రదాని నరేంద్రమోడీ కి కేంద్ర గృహనిర్మాణ శాఖమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్,ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లకు మంజూరుకు సహకరించినందుకు రాష్ట్ర ప్రభుత్వం,ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

పెదనందిపాడు జూన్ 17. (ప్రభాతవార్త) మండలంలోని రావిపాడు మరియు గోగులమూడి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం నిర్వహించారు. రైతులు ప్రతి ఒక్కరు కూడా అన్నదాత సుఖీభవ ఈ కేవైసీ కచ్చితంగా చేయించుకోవాలని తెలియజేశారు. అదే విధంగా పొగాకు హెచ్చి బర్లీ సాగు చేస్తున్నటువంటి రైతులు యొక్క వివరాలను సీఎం యాప్ లో రిజిస్టర్ చేయాలని తెలియజేశారు. రైతులు వ్యవసాయం గురించి అడిగిన పలు సందేహాలకు వారు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో రావిపాడు వీ హెచ్ ఏ. ఎస్ కే జరీనా, అదేవిధంగా గోగులమూడి వి ఏ ఏ నజీర్ మరియు రైతులు పాల్గొన్నారు.

## పాలస్తీనా పై యుద్ధం ఆపాలి

పెదనందిపాడు జూన్17. (ప్రభాతవార్త)పాలస్తీనా పై సామ్రాజ్యవాదుల సాయంతో ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని సి.పి.ఎం.పార్టీ పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు అన్నారు. మంగళవారం పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్ లో సి.పి.ఎం.పార్టీ ఆధ్వర్యంలో పాలస్తీనా కు సంఘీభావం తెలియజేస్తూ ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ సంధర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ అమెరికా అండతో ఇజ్రాయెల్ పాలస్తీనా పౌరుల స్తావరాలు, ఆసుపత్రులు, అణు క్షేత్రాల మీద క్షి పణులు ప్రయోగించడం అన్యాయం అన్నారు.ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం లో వేలాది మంది ప్రజలు, పిల్లలు చనిపోయారని, లక్షలాదిమంది నిరాశ్రయులు అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, కన్నెగంటి చందర్రావు,షేక్ షమి,నల్లమోతు రాజేంద్ర,బాలాజీ,క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని అందిపుచ్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలి

బాపట్ల,జూన్17,ప్రభాతవార్త: ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని అందిపుచ్చుకుని వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు.మంగళవారం, వేటపాలెం మండలంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి జీవనోపాధి లబ్ధిదారుల యొక్క యూనిట్లను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పరిశీలించారు. ఈ సందర్భంగా తొలుత ప్రసాద్ నగర్ లోని శ్రీ సాయి తేజ వేరుశెనగ శుద్ధి యూనిట్ ను ఆయన పరిశీలించారు.యూనిట్ వలన లాభనష్టాలు, వ్యాపార సరళి, ముడి సరుకు కొనుగోలు వివరాలను



యూనిట్ యజమానిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కొత్తపేట బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సాయి తేజ వేరుశనగ ప్రాసెసింగ్ యూనిట్ స్థాపనకు పి ఎం ఎఫ్ ఎం ఈ పథకము ద్వారా 10 లక్షలు రుణం పొందారని ఆయన తెలిపారు. ఇందులో 35 శాతం సబ్సిడీ కింద వస్తుందన్నారు. ఈ యూనిట్ స్థాపన వలన అక్కడ స్థానికంగా 10 మందికి ఉపాధి కల్పన జరిగిందని ఆయన తెలిపారు. ఆ యూనిట్ యజమానికి వ్యాపారం వలన మంచి లాభాలు వస్తున్నాయని, సంతృప్తికరంగా ఉందని, యూనిట్ విజయవంతంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. బాల ఆగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లో అమ్మ చిల్లి పౌడర్ అనే బ్రాండ్ తో కారం పొడి ఉత్పత్తి జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రస్తుతానికి ఈ యూనిట్లో విద్యుత్ సమస్యల వలన ఉత్పత్తి జరగటం లేదని, ఈ సమస్యలను త్వరలో పరిష్కరించి యూనిట్ పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ యూనిట్ యాజమాన్యానికి భరోసా ఇచ్చారు. పిఎంఎఫ్ఎంఈ పథకము ద్వారా ఆహార శుద్ధి వ్యాపారానికి ఆధునిక సాంకేతికత జోడించి, వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించాలని, వ్యాపారంలో అన్ని విధాల తోడ్పడి సంఘటిత రంగాలలో పెద్ద వ్యాపారస్తులుగా తయారు చేయాలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. ఆహార శుద్ధి వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్న వారు పిఎంఎఫ్ఎంఈఏపి.ఓఆర్జి అనే వెబ్ సైట్ గాని లేదా సంబంధిత జిల్లా రిసోర్స్ పర్సన్ ఎం.శ్రావణి ఫోన్ నెంబర్ 9381155919 ద్వారా సంప్రదించి మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఖలీం, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, చీరాల జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్, చీరాల తహసిల్దార్ గోపికృష్ణ, మరియు తదితరులు పాల్గొన్నారు

## రైతులు మేలైన వరి విత్తనాలను ఎంచుకోవాలి

కర్లపాలెం,జూన్17,ప్రభాతవార్త: రైతులు మేలైన వరి విత్తనాలను ఎంచుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ తెలిపారు.కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగుకు మేలైన వరి రకాలైన ఎమ్.టి.యు 1262, ఎమ్.టి.యు 1232, బిపిటి 2782, ఎమ్.టి.యు 1318 వంటి రకాలను ఎంచుకోవాలని సూచించారు. అన్ని



గ్రామాలలోని రైతుల పొలాలలో ఈ వేసవి కాలం నందు మట్టి నమూనాలు తీసి విశ్లేషణ కొరకు గ్రామ వ్యవసాయ సహాయకులు పంపారని, మట్టిలో ఉండే పోషకాల ఆధారంగా ఎరువ ులను వినియోగించాలని తెలి పారు. కౌలు దారులు తప్పని సరిగా రెవెన్యూ అధికారులను సంప్రదించి కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కౌలు కార్డు ఉంటేనే కౌలు దారులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని, పంట నమోదు కొరకు కౌలు కార్డు తప్పనిసరి అని సూచించారు తద్వారా ప్రభుత్వ పథకాలైన సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం, కనీస మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాలలో 70 క్వింటాళ్ల బిపిటి 5204 వరి విత్తనం సబ్సిడీపై పంపిణీ కొరకు సిద్ధంగా ఉందని, ఆసక్తి కలిగిన రైతులు విఏఏ లను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పూజశ్రీ మరియు రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలలకు సమృద్ధిగా ఉపాధ్యాయులు

గుంటూరు విద్య,జూన్ 17,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో భారీస్థాయిలో పదోన్నతులు మరియు బదిలీలు చేపట్టడం చారిత్రాత్మకం అని గుంటూరు జిల్లా పా ్యప్టో ఛైర ్మన్ కె.నరసింహారావు హర్షం వ్యక్తంచేశారు.ముఖ్యంగా మున్సిపల్ అండ్ కారొ ్రేషన్ పాఠశాల్లో ఎన్నో సంవత్సరాలుగా ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ పోస్టులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పుడు పదోన్నతుల ద్వారా ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం వలన ఉపాధ్యాయులు,విద్యార్థులు చాలా ఆనందంగా ఉన్నారని,ఈ పదోన్నతులు మరియు బదిలీలు చేయడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు హర్షం వ్యక్తంచేశారు.

## షిరిడి సాయిబాబా 26వ వార్షికోత్సవ వేడుకల ముగింపు

పెదనందిపాడు జూన్ 17 (ప్రభాతవార్త) పెదనందిపాడు లోని షిరిడి సాయి మందిర్ 26 వార్షికోత్స వ వేడుకలు సోమవారం ప్రారంభమై మంగళవారం తో ముగిశాయి. ఈ సందర్భంగా సాయి మందిర్ నిర్వాహకులు భక్తుల సహకారంతో 108 కలశాలతో బాబాకు జలాభిషేకం చేశారు. అనంతరం చీరాల గాయత్రి పరివార్ డివిఆర్ మూర్తి బృందం చే పంచకుండియ గాయత్రి మహా యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గౌతం పాండే. రాజు పాండేలు. ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పంచ కుండియ గాయత్రి మహా యజ్ఞాన్ని డివిఆర్ బృందం సభ్యులు కొమ్మూరి ఆంజనేయులు ఆండాళమ్మ దంపతులు. కృష్ణకుమారి .లక్ష్మీ ్మ. సుగుణ. ల సహకారంతో సాయి మందిర్ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాగులపాడు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర భజన సమాజం వారు బండి రేణుక ఆధ్వర్యంలో సాయి మందిర్లో 108 సార్లు హనుమాన్ చాలీసా పఠించి పూజలు నిర్వహించారు. నిర్వాహన కమిటీ సభ్యులు రామ సుబ్బారావు ఉదయలక్ష్మి .సురేష్ బాబు.శేషగిరిరావు. అల్లాబక్షు. వసంతరావు. శ్రీనివాసరావు .సాంబశివరావు. రామచంద్రరావు. అర్జున్ రావు. డాక్టర్ రామకృష్ణ. బి ఎస్ ఆర్ ఆంజనేయులు. రమాదేవి .ధనలక్ష్మి ్మ .పద్మ తదితరులు పాల్గొన్నారు.

## తల్లుల సంతోషంతో జగన్‌కు నిద్ర కరువైంది: ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జూన్17,ప్రభాతవార్త: తల్లికి వందనం అమలుతో జగన్‌కు కంటిమీద కునుకు కరువైందని, తన ఊహకు అందనివిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీని పక్కా ప్రణాళికతో, నిజాయితీతో అమలు చేస్తుండటం జగన్‌కు మింగుడు పడటంలేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆ అక్కసుతోనే తన నీలి మీడియా, వైసిపి నేతలతో కూటమి ప్రభుత్వంపై, మంత్రి లోకేష్‌పై విష ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. తల్లుల సంతోషాన్ని, విద్యార్థుల జీవితాలు బాగుపడటాన్ని జీర్ణించుకోలేని భిన్న మనస్తత్వం జగన్‌ది అని అన్నారు. తన విపరీత, వింత మనస్తత్వం తనకే ప్రమాదకరమని జగన్ గ్రహిస్తే మంచిదని అన్నారు. ఎన్నికల ముందు జగన్ చదువుకునే ప్రతి విద్యార్థికి ఏటా రూ10వేలు ఇస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక పిల్లలకు కాదు తల్లులకే అమ్మఒడి అని చెప్పి మాటమార్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. తాను, తన భార్య భారతీరెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం 2019-24 మధ్య ఏటా రూ 10వేల కోట్లు వంతున రూ50వేల కోట్లు జగన్ విద్యార్థులకు ఇవ్వాలి. కానీ తల్లులకు ఇచ్చే నెపంతో కేవలం రూ 23,877 కోట్లు మాత్రమే చెల్లించి, రూ26వేల కోట్లు ఎగవేత చేశాడని అన్నారు. తన హయంలో జగన్ 42లక్షల మంది విద్యార్థులకు అమ్మఒడి ఇస్తే నేడు కూటమి ప్రభుత్వం 67.20లక్షల విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వడం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. తమలాగే అందరూ అవినీతి చేస్తారు, అప్పనంగా ప్రజల సొమ్ము దిగమింగుతారు అనే భ్రమలో జగన్, ఆయన పార్టీ నేతలు ఉన్నారని ప్రత్తిపాటి తెలిపారు. తల్లికి వందనం నిధులు లోకేష్ జేబులోకి వెళుతున్నాయంటూ నిరాధార ఆరోపణలతో బురద చల్లే ప్రయత్నం చేశారు. జగన్ హయంలో కూడా రూ 15వేలకు బదులు రూ 13వేలు మాత్రమే ఇచ్చారు. మిగిలిన రూ 2వేలు జగన్ తన జేబులో వేసుకున్నాడా చెప్పండి అని లోకేష్ ప్రశ్నిస్తే వైసిపి నేతలు స్పందించలేదని అన్నారు.



### 'అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరం'

నాదెండ్ల,జూన్17,ప్రభాతవార్త: మండలంలోని నాదెండ్ల, తూబాడు గ్రామానికి చెందిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడటం తీవ్ర బాధకరమని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. నాదెండ్ల గ్రామానికి చెందిన నశ్యం ఆదినారాయణ అనే రైతు, తూబాడు గ్రామానికి చెందిన సిరిబోయిన గోపాలరావు అనే ఇద్దరు రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారన్న వార్త విని ఆవేదనకు గురి అయ్యాయని ప్రత్తిపాటి తెలిపారు నిజంగా వారి మురణవార్త తీవ్రంగా కలచివేసిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లలో ఉన్నందున మృతుల గ్రామాలకు వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడాలని స్థానిక నాయకులను ఆదేశించినట్లు ప్రత్తిపాటి తెలిపారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పానని అన్నారు. మరణించిన వారి కుటుంబాలకు చంద్రన్న భీమా వారంరోజులలో భీమా ఆర్థిక సహాయం అందచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తరుపున మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందేలా చూస్తానని ప్రత్తిపాటి తెలిపారు. ప్రత్తిపాటి ఆదేశాలతో టిడిపి నేతలు నెల్లూరి సదాశివరావు,బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, వేములపల్లి బసవయ్య, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, నెల్లూరి వెంకయ్య, శరత్, మొగిలి నాగలక్ష్మీ తదితరులు రైతు కుటుంబాలను పరామర్శించి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

### రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా సుపరిపాలన : మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట,జూన్17,ప్రభాతవార్త:ఇటు సంక్షేమం, అటు రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అన్నారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో తల్లికి వందనం సూపర్ సక్సెస్ అయినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి చిత్రపటాలకు మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కౌన్సిలర్లు పాలాభిషేకం చేశారు. చిలకలూరిపేట మున్సిపల్ పరిధిలో 9,827 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకంలో రూ13వేలు వంతున రూ 12 కోట్ల 77లక్షల 51వేలు తల్లుల ఖాతాలలో జమ అయ్యాయని వారు తెలిపారు. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్‌లో భాగంగా అమలు చేశారని కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ నసీమాబేగం, కనమర్లపూడి తిరుమల, జంగా సుజాత, కూనల ప్రమీల, రాయని హరిత తదితరులు పాల్గొన్నారు.



### పార్టీ పటిష్టతకు కృషి చేయాలి : మాజీమంత్రి విడదల రజిని

చిలకలూరిపేట,జూన్17,ప్రభాతవార్త: పార్టీలో పదవులు పొందిన నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మాజీమంత్రి విడదల రజిని వారికి సూచించారు. మంగళవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ అధ్యక్షుడిగా షేక్ దరియావలి, రూరల్ మండల అధ్యక్షులుగా దేవినేని శంకరరావు, నాదెండ్ల మండల అధ్యక్షుడిగా మంగు ఎడుకొండలు, యడ్లపాడు మండల అధ్యక్షుడిగా వడ్డేపల్లి నరసింహరాజు నియమితులైన సందర్భంగా వారందరూ మాజీమంత్రి విడదల రజినిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు. జగనన్న హయంలో మనం ప్రజలకు చేసిన మేలు, ప్రజల పట్ల మనం చూపిన ప్రేమ నేడు ప్రస్తుత ప్రభుత్వంలో కరువయ్యాయని, మనం చేసిన మంచి ప్రజలలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రతి పేదవాడికి మనం చేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధి ఎప్పటికి మరచిపోరని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని ఆమె తెలిపారు. రాబోయే రోజులలో అందరం కష్టపడి పనిచేసిన జగన్మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యంగా సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి సంబంధించిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వ హత్యలుగా భావిస్తున్నాం

చిలకలూరిపేట,జూన్17,ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గం నాదెండ్లకు చెందిన ఆదినారాయణ, తూబాడుకు చెందిన గోపాల్రావు అనే ఇద్దరు రైతులు పొలంలోనే పురుగుమందు తాగి అప్పులబాదతో ఆత్మహత్య చేసుకున్నారు. కాగా వారిద్దరి భౌతికకాయాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం కోసం ఉంచగా మాజీమంత్రి విడదల రజిని ఆసుపత్రికి వెళ్లి ఇద్దరు రైతుల భౌతికకాయాలను సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం చాతకాని తనంవల్లే రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రైతులు పండించిన ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించలేకపోయిందని విమర్శించారు. మా నాయకుడు జగన్మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చియార్డుకు వెళ్లి మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారని అన్నారు. అదేవిధంగా పొదిలి వెళ్లి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న పొగాకు రైతుల బాదలను చూశారని అన్నారు. ప్రభుత్వం అన్నివిధాల విఫలమైందని, ప్రజా సమస్యలన్నింటిని గాలికి వదిలేసి కేవలం రెడ్‌బుక్‌పై దృష్టి పెట్టిందని ఆమె విమర్శించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో అప్పు తీర్చలేదని ఒక మహిళను చెట్టుకు కట్టివేయడం దారుణమని ఆమె విమర్శించారు.

### టిడిపి కౌన్సిలర్ కంచర్ల కరుణను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేటటౌన్,జూన్17,ప్రభాతవార్త: టిడిపి మున్సిపల్ కౌన్సిలర్ కంచర్ల కరుణ ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకొని ఇంటికి తిరిగివచ్చారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మంగళవారం ఆమె నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెను పరామర్శించిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్లు బేరింగ్ మౌలాలి, కనమర్లపూడి తిరుమల, నసీమాబేగం, కూనల ప్రమీల, రాయని హరిత తదితరులు ఉన్నారు.

### అన్ని గ్రూపులు ఆర్థిక ప్రణాళికలు పూర్తిచేయాలి : ఎంపీడీవో



యడ్లపాడు, జూన్ 17, ప్రభాతవార్త : మండల పరిధిలోని అన్ని మండల మహిళా సమైఖ్య గ్రూపులు అన్నీ ఆర్థిక ప్రణాళికలు పూర్తిచేయాలని ఎంపీడీవో వి హేమలతాదేవి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సమైఖ్య 2025వ సంవత్సరంలోని 6వ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు అర్ నాగలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో ముఖ్యముగా అర్థిక వార్షిక ప్రణాళికలో 1342 గ్రూపులకి గాను 846గ్రూపులు పూర్తిచేయగా మిగిలిన 387గ్రూపులను వారంరోజులలోపు పూర్తి చేయవలెనని వివోఎలకు, సిసిలకు ఆదేశాలు జారీ చేయటం జరిగింది. కార్యక్రమంలో ఎపిఎమ్ రవీంద్రకుమార్, మండల సమైఖ్య సభ్యులు, వివోఎలు, సిసిలు పాల్గొన్నారు.

### చిన్నారి యమునను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



విజయపురిసౌత్, జూన్ 17 ప్రభాతవార్త: మాచర్ల మండలం సుబ్బారెడ్డిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నేతాల గోవిందరాజు-హేమలత దంపతుల కుమార్తె యమున పుష్పాలంకరణ వేడుకకు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారి యమునకు ఆశీర్వాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, జూలకంటి చిరంజీవిరెడ్డి, గన్నెబోయిన లింగయ్య, వస్తువురి శ్రీరామూర్తి, తగుళ్ల కృష్ణ, వారాల రామారావు, వస్తువురి గోవిందు, యాగయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఆర్థికాభివృద్ధే సంగం డెయిరీ ధ్యేయం

### -చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: రైతుల ఆర్థికాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నదే సంగం డెయిరీ ధ్యేయమని సంగం డెయిరీ ఛైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి సంగం డెయిరీలోని విత్తన పరిశోధనా విభాగంలో సరి కొత్త మేలు రకాలైన వరి వంగడాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని నిరంతరం పరిశోధన చేసి ఇలాగే భవిష్యత్తులో కొత్త వంగడాలను అందిస్తామన్నారు. సంగం డెయిరీ విత్తన పరిశోధన సంస్థ రూపొందించిన మేలైన రకాలు ఎస్ఎస్ఆర్-2(సంగంఆరోగ్య)-10కిలోల సంచి రూ.750ల ధరతో, ఎస్ఎస్ఆర్-4(సంగం అర్జున్)-10కిలోలు సంచి రూ.750లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు బిపిటి-5204 సెర్టిఫైడ్ వరి విత్తనములు 20కిలోల సంచి రూ.940లు, బిపిటీ-5204పౌండేషన్ వరివిత్తనము 20కిలోలు రూ1020లు ధర నిర్ణయించినట్లు చెప్పారు. విత్తనాలు అవసరమైన వారు 9398423590ను సంప్రదించాలన్నారు. కొంత మందికి రైతులకు వరి విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్, విత్తనాల విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.



### పిఎం మోది సూర్య ఘర్ యోజన సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: అర్హులైన విద్యుత్ వినియోగదారులందరూ ప్రధానమంత్రి మోది సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డివిజన్ నోడల్ ఆఫీసర్ తుమ్మా వెంకట తులసీరాం కోరారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో మంగళవారం పొన్నూరు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ పథకం యొక్క ఉపయోగాలను ప్రజలకు, విద్యుత్ వినియోగదారులకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీ వివరాలను తెలియజేయాలన్నారు. పొన్నూరు డివిజన్‌కు 1435టార్గెట్ నిర్ణయించినట్లు చెప్పారు. పొన్నూరు పట్టణంలో-352, పొన్నూరు రూరల్‌లో-451, పెదనందిపాడు-317, కాకుమాను-315గా నిర్ణయించామన్నారు. ప్రతి విద్యుత్ ఎఈ వారికి కేటాయించిన టార్గెట్లను అధిగమించాలన్నారు. ఈ పథకానికి కేంద్రం ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కాకుండా రాష్ట్రంలో ఉన్న బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.20వేలు సబ్సిడీ అందజేసేందుకు సిద్దంగా ఉందన్నారు. సొంతిల్లు, బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్ కార్డు వంటివి అందజేసి ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవచ్చాన్నారు. ఈ పథకం కింద బ్యాంకులు రుణాలు కూడా ఇస్తాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎడిఇ ఎ.వెంకటేశ్వరరావు, జెఎఒ ఎ.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్తాం

### - వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగడతామని వైకాపా మండల పార్టీ అధ్యక్షుడు చింతలపూడి మురళీకృష్ణ అన్నారు. స్థానిక వైకాపా కార్యాలయంలో మంగళవారం కూటమి ప్రభుత్వ వైల్యాలపై ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలను ఇచ్చిందని, వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన అందించడంలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే ప్రతిపక్ష పార్టీలపై కేసులు పెట్టి వేధిస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించేవిధంగా ఆలోచన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషు, నాయకులు నల్లమోతు రవీంధ్రబాబు, రుద్రపాటి నాగేశ్వరరావు, దేవరకొండ గోపి, షేక్ మౌలాలి, కొండముది సుధాకర్, దాసరి శ్రీనివాసరావు, కూచిపూడి మరియరాణి తదితరులున్నారు.



### విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థికి పీహెచ్‌డీ

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన వారాధి రవితేజ అనే విద్యార్థికి తమ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో మంగళవారం పిహెచ్డఈ పట్టా అందించిందని వైస్ చాన్సలర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగాఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యూరోపియం అయాన్ డోప్డ్ బోరేట్ సిలికేట్ ఫాస్పేట్(బీఎస్‌పి) గ్లాసెస్ ఫర్ ఆప్టో ఎలక్ట్రానిక్ అప్లికేషన్స్ డబ్ల్యూఎల్ఈడి అనే అంశంపై విద్యార్థి పరిశోధన చేశారని తెలిపారు. ఈ విద్యార్థికి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ మోడెం శ్రీనివాసులు గైడ్‌గా వ్యవహరించారని చెప్పారు. విద్యార్థి తన పరిశోధనలో భాగంగా మొత్తం 3ఎస్‌సిఐ ఇండెక్స్డ్ జర్నల్స్‌లో పేపర్స్ పబ్లిష్ చేశారని వెల్లడించారు. ప్రస్తుతం ఈయన విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ మీడియా సెంటర్‌లో అసిస్టెంట్ మీడియా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డాక్టరేట్ పొందిన వారాధి రవితేజను విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.




## రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కొల్లూరు,జూన్ 17 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని అనంతవరం, చిలుమూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం కొల్లూరు మండల వ్యవసాయశాఖ అధికారి వి.నరేంద్రబాబు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి నరేంద్రబాబు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ 50శాతం సబ్సిడీపై ఇచ్చిన పచ్చిరొట్టి విత్తనములకు సంబంధించిన ప్రాధాన్యత గురించి వివరించారు. పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే విత్తనాలు, పొలంలో పెంచిన తర్వాత నేలలో కలియదున్నడం ద్వారా నేలసారాన్ని పెంచుతాయన్నారు. నేలకు సేంద్రీయ పద్దార్థాలు, నత్రజనిని అందించి పంటల దిగుబడిని పెంచుతాయన్నారు. పచ్చిరొట్ట ఎరువుల నేలలో సేంద్రీయ పదార్థాలను పెంచుతాయన్నారు. మెరుగైన నేల సారం మరియు నత్రజని లభ్యత కారణంగా పచ్చిరొట్ట ఎరువులు పంటల దిగుబడిని గణనీయంగా పెంచడానికి సహాయపడతాయని, రసాయన ఎరువుల అవసరాన్ని తగ్గిస్తుందని ఆయన తెలియజేశారు. వ్యవసాయంలో బహుళ ఉపయోగాలు కలిగిన బహుముఖ పంట, ముఖ్యంగా కవర్ పంటగా మరియు పచ్చి ఎరువుగా, ఇది వేగంగా పెరిగే పప్పుదినుసు, ఇది నత్రజనని జోడించడం, కలుపు మొక్కలను అణచి వేయడం మరియు కోతను నివారించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరస్తుందన్నారు. దీనిని మేత పంటగా మరియు ఫైబర్ ఉప్పత్తికి కూడా ఉపయోగిస్తారని రైతులకు వివరించారు. ఎండు జనపనార దట్టంగా పెరగడం వల్ల కలుపు మొక్కలను సమర్థ వంతంగా అణిచి వేయవచ్చునని, కలుపు మందుల అవసరాన్ని తగ్గిస్తుందన్నారు. సాంబనాయక్, విఏఏ వినీత తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాలో అన్ని పాఠశాలలను యోగ శాలలుగా మార్చాలి

బాపట్ల,జూన్17,ప్రభాతవార్త: జిల్లాలో అన్ని పాఠశాలలను యోగ శాలలుగా మార్చాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు జిల్లా కలెక్టర్లకు సూచించారు.మంగళవారం అమరావతి సచివాలయం నుండి పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది, పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ అపై విద్యార్థులు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేటట్లు చూడాలన్నారు. జూన్ 21న అన్ని విద్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని సచివాలయల్లో యోగాంధ్ర కార్యక్రమలు నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 17,18,19 తేదిలలో విద్యార్థులకు యోగ పై ట్రైనింగ్ ఇవ్వాలన్నారు. ట్రైనింగ్ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్ మంజూరు చేయాలన్నారు. తల్లికి వందనం అందని కుటుంబాలకు టెక్నికల్ సమస్యలు ఎదురైతే క్లియర్ చేసే విధంగా అధికారులు సూచనలు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల జిల్లా నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం

యడ్లపాడు, జూన్ 17, ప్రభాతవార్త : మండల పరిధిలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో మరియు ఒక గురుకుల పాఠశాల, పది ప్లెస్ జూనియర్ కళాశాలలో విద్య అభ్యసించి ప్రథమ స్థానంలో నిల్చిన విద్యార్థులకు నరేంద్ర సువర్ణకుమారి పౌండేషన్ నిర్వాహకురాలు నరేంద్ర సువర్ణకుమారి అందజేసారు. విద్యార్ధులందరికీ వెయ్యి రూపాయల చొప్పున అర్ధిక సహాయం అందజేసారు. కార్యక్రమాన్ని యడ్లపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎమ్ విజయభారతి, ఎంఈవో టూ అరుణకుమారి, పౌండేషన్ నిర్వాహకురాలు నరేంద్ర సువర్ణకుమారి, అయా పాఠశాలల విద్యార్దులు పాల్గొన్నారు.



### జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి



పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: వచ్చే నెల 5వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేసేవిధంగా పోలీసులు అధికారులు చొరవ చూపాలని పొన్నూరు మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి న్యాయమూర్తి జి.రుక్మిణి కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో మంగళవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పోలీసు అధికారులు కక్షిదారులకు, ముద్దాయిలకు రాజీవలన కలిగే ప్రయోజనాలు, లాభాలపై అవగాహ కల్పించాలన్నారు. రాజీ మార్గం ద్వారా పరిష్కరించుటకు తమ యొక్క సహకారం అందించాలని కోరారు. సమావేశంలో కోర్టు సూపరింటెండెంట్ అంబటి రాజ్యలక్ష్మి, అర్బన్ సిఐ లావూరి వీరానాయక్, రూరల్ ఎస్సై గండు కిరణ్‌బాబు, కాకుమాను ఎస్సై ఏక్‌నాథ్, కోర్టు కానిస్టేబుళ్ళు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రైతులు ఈకెవైసీ చేయించుకోవాలి

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేయనున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి రైతులు త్వరితగతిన ఈకెవైసి నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయశాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్ కాలానికి సంబంధించి వరి విత్తనాలు ఈ నెలాఖరులోగా ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. బిపిటి-5204, ఎంటియు1224 రకము విత్తనాలు కిలోకు రూ.5రాయితీపై ఇవ్వనున్నట్లు చెప్పారు. కౌలు రైతులు తప్పని సరిగా సీసీఆర్సీ కార్డులు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూ యజమాని యొక్క పాసుపుస్తకము నకలు, ఫోన్ నెంబరు, కౌలు చేసే రైతు యొక్క ఆధార్‌కార్డు, ఫోటో, ఫోన్ నెంబరుతో విఆర్వోని సంప్రదించి సీసీఆర్సీ(పంటసాగు హక్కు ధృవీకరణ పత్రం) పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, గ్రామ సహాయకులు డి.సుబ్బారావు, సురేష్‌బాబు తదితరులున్నారు.



### వికసిత్ భారత్‌ను సాధించడమే బిజెపి ధ్యేయం

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: ప్రధానమంత్రి నరేంద్రమోడి వికసిత్ భారత్‌ను సాధించడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు కలపాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు వద్రాణం ఉదయచంద్రరావు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది. ఈ సందర్భంగా కలపాల మాట్లాడుతూ బిజెపి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. దేశాన్ని కాపాడగలిగే సత్తా ఒక్క బిజెపికి మాత్రమే ఉందన్నారు. సుపరిపాలన అందించే సత్తా బిజెపి ఉందన్న ఉద్దేశంతోనే దేశ ప్రజలు మూడు పర్యాయాలు మోడి నాయకత్వాన్ని కోరుకున్నారన్నారు. బిజెపి హయాంలోనే దేశం ఎంతో సర్వతోముఖాభివృద్ధిని సాధించిందన్నారు. రానున్న కాలంలో బిజెపి ఆధ్వర్యంలో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందనే ఆశాభావాన్ని వ్యక్తిం చేశారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గురుబాలు, కార్యకర్తలున్నారు.



### బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపించాలి

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: విద్య ద్వారానే మార్పు, అసమానతలు దూరమవుతాయని ప్రతి ఒక్కరూ బడిఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ కోరారు. పట్టణంలోని జీబిసి రోడ్డు ప్రాంతంలో బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేరేందుకు ప్రవేశాలను కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాభ్యాసానికి అన్ని వసతులు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, మెటీరియల్, తదితరాలను అందిస్తుందన్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం భోజన పథకాన్ని కూడా అమలు చేస్తుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎఈంఒ వెంట ఉపాధ్యాయులు, మాజీ వార్డు కౌన్సిలర్ యరసాని శ్రీరామమూర్తి తదితరులున్నారు.



### అన్నదాత సుఖీభవ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పొన్నూరు, జూన్ 17,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో అమలు చేస్తుందని, ఆ పథకానికి సంబంధించి రైతులు ఈకెవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఎడిఎ వి.రామకోటేశ్వరి సూచించారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్దపల్లి, శలపాడు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ రామకోటేశ్వరి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల వద్ద సిద్దంగా ఉంచుతున్నట్లు చెప్పారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తే రైతులకు మేలైన ఉత్పత్తులను సాధించడంతోపాటు ఆశించిన దిగుబడులను సాధించవచ్చన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఈకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, తదితరులున్నారు.



## భారతదేశం అభివృద్ధి పథంలో ముందడుగు

కర్లపాలెం,జూన్17,ప్రభాతవార్త: భారతదేశం అభివృద్ధి పథంలో ముందడుగులో ముందని బాపట్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బంగారు బాబు అన్నారు.మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం కేశవపురి గ్రామంలో బీజేపీ సీనియర్ నాయకులు షేక్ కరిముల్లా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సేవ సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞ సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా అధ్యక్షులు బంగారు బాబు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమం, భారతదేశ అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని అన్నారు. బీజేపీ నాయకులు కొండారెడ్డి అనిల్ వికసిత భారత్ 2047 ప్రతిజ్ఞ పత్రాలను అందరికీ ఇచ్చి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బాబు నాగేంద్ర, మణి యాదవ్, కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు , కొట్ర రామకృష్ణ,ముప్వల శ్రీనివాసరావు గారు, నారాయణమ్మ మరియు కేశవపురి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# రాజీ పడదగిన సివిల్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

## న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ప్రియదర్శిని

గురజాల, జూన్ 17 ప్రభాతవార్త: రాజీ పడదగిన సివిల్ కేసుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ప్రియదర్శిని అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టులో జులై 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. కక్షిదారులు అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇరువర్గాలు రాజీ మార్గంలో కేసును పరిష్కరించుకోవడం ద్వారా సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కెవివి సత్యనారాయణ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అలేఖ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ చలమరాజు, న్యాయవాదులు హనుమంతురావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా, సూర్యరాజు, ప్రభుదాసు, కుమారస్వామి, సుందర జ్ఞానమ్మ, ప్రసాదరావు, చిన కోటేశ్వరరావు, సీహెచ్ సురేష్, మహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.



# బెల్లకొండ మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా సయ్యద్ అమీర్ అలీ

పిడుగురాళ్ళ, జూన్ 17 ప్రభాతవార్త: పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండ మండల సంస్థాగత ఎన్నికల పరిశీలకునిగా గురజాల నియోజకవర్గానికి చెందిన పల్నాడు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీని పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ సందర్భంగా అమీర్ అలీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి నియోజకవర్గంలోని మండలాలకు ప్రత్యేకంగా పరిశీలకులను నియమించి కార్యకర్తల అభిప్రాయాలతో కమిటీలు వేయాలని నిర్ణయిస్తూ తనను బెల్లంకొండ మండల ఎన్నికల పరిశీలకునిగా తనను నియమించారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకముంచినందుకు శక్తి వంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ ఆదేశాలతో మండల, పట్టణ పార్టీ కమిటీల నియామకాలు చేపడతానన్నారు.



# పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



పిడుగురాళ్ల, జూన్ 17 ప్రభాతవార్త: పిడుగురాళ్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా ఇరువురి శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గిద్దలూరు మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కూటమి నేతలు దుశ్శాలువలతో శ్రీనివాసరావును సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు కామిశెట్టి రమేష్‌బాబు, జనసేన సంయుక్త కార్యదర్శి దూదేకుల ఖాసీం సైదా, బయ్యవరం రమేష్, దీకొండ కిరణ్‌బాబు, సలీం, మందా జెస్సి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనునాయక్, జెమిని తదితరులు పాల్గొన్నారు.

# దేశ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు

పిడుగురాళ్ల, జూన్ 17 ప్రభాతవార్త: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రారంభించి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనుబంధంతో దేశం మొత్తం రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్‌బీఐలో రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం ప్రాణదానంగా బావిస్తామని, అందుకే దేశంలోని అన్ని ఎస్‌బీఐ బ్యాంకుల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు ఉపయోగపడే బ్యాంకుగా ఎస్‌బీఐ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బొర్రు దేవేంద్రనాథ్, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శరత్‌బాబు, ట్రెజరర్ మురళీకృష్ణ, గురవమ్మ, విక్రమ్, అన్వేష్, సురేష్, విలియంరాజ్, కిషన్‌రావునాయక్, వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం

## ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ళ, జూన్ 17 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రతి తల్లి సంతోషంగా ఉండేలా తల్లికి వందనం పథకాన్ని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్నారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎంత మంది చదువుకునే వారు ఉంటే వారందరికి తల్లికి వందనం అందిస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారన్నారు. రూ. 2 వేలు లోకేష్ జేబుల్లోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. తల్లికి గౌరవం ఇవ్వని జగన్‌రెడ్డి తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి మాత్రమే ఇస్తే కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లివందనం ఇస్తోందన్నారు. తల్లుల మొహాల్లో చిరునవ్వుకు కారణం మంత్రి లోకేష్ అన్నారు. పిల్లల స్కూల్ ఫీజులకు అప్పులు చేసే పని లేకుండా లోకేష్ తల్లికి వందనం అందిస్తున్నారన్నారు. తల్లికి వందనం కోసం రూ. 8700 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు సుమారు 11 లక్షల మంది ఉన్నారని, వీరి డేటా అప్‌లోడ్ కాగానే డబ్బులు వేస్తామన్నారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ వీరి జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉంచుతామన్నారు. 2019 ఎన్నికల్లో ఇంట్లో ఇద్దరు పిల్లలకి రూ. 15 వేలు చొప్పున అందిస్తామని చెప్పి ఒక్క విద్యార్థికి రూ. 13 వేలు వైసీపీ అందించిందన్నారు. ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుతుంటే బెంగళూరులో కూర్చొని జగన్‌రెడ్డి విష ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో కేవలం రూ. 5 వేల కోట్లు ఖర్చు పెడితే కూటమి ప్రభుత్వం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. విద్యార్థులకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు, కందిపప్పులో కూడా కమిషన్లు తీసుకున్న నీచ చరిత్ర వైసీపీది అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమానికి కూటమి ప్రభుత్వ అధికంగా ఖర్చు చేస్తోందన్నారు. ఒకవైపు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు.



# జానపాడులో పొలం పిలుస్తోంది




పిడుగురాళ్ల, జూన్ 17 ప్రభాతవార్త: మండలంలోని జానపాడులో మంగళవారం ఏవో సంధ్యారాణి ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి పంట క్షేత్ర సందర్శన నిర్వహించారు. పత్తి పంటలో 30, 60 రోజులకు మెగ్నీషియం ఎకరానికి ఒక కేజీ పైపాటుగా పిచికారీ చేయాలన్నారు. ఏఈవో చౌదర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆరోగ్య సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్

## - రూ.24.37 లక్షలు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కారంపూడి, జూన్ 17 ప్రభాతవార్త: నిరుపేదలకు ఆరోగ్య సంజీవని సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 33 మంది లబ్ధిదారులకు 24.37 లక్షలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పంపిణీ



చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలను ఆదుకోవడంతోపాటు వైద్యఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నగదు అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కారంపూడి మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కూడా సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కారంపూడి పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షులు కటికల బాలకృష్ణ, కారంపూడి మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎస్వీఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



# పల్నాడు జిల్లాలో జగన్ పర్యటన జరిగి తీరుతుంది

## -జిల్లా ఎస్‌పిని కలిసి అనుమతులు కోరిన వైకాపా నేతలు

నరసరావుపేట, జూన్ 17 ప్రభాతవార్త : ఎన్ని ఆటంకలు కల్పించిన పల్నాడు జిల్లాలో మాజీ సియం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన బుధవారం జరుగుతుందని వైఎస్సార్‌సిపి నేతలు స్పష్టం చేసారు. మంగళవారం వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించి అనుమతులు కోరుతూ రెండవ సారి జిల్లా ఎస్‌పి కె శ్రీనివాసరావును వారు కలిసారు. అనంతరం జిల్లా పోలీస్‌కార్యాలయం ఎదుట వైకాపా నేతలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజనీ, గజ్జెలసుధీర్



భార్గవ్‌రెడ్డిలు విలేకరులతో మాట్లాడారు. పోలీస్‌ల వైఖరి చూస్తే ఎమర్జెన్సీ లో ఉన్నామా అని ప్రజలకు సందేహం వస్తుందన్నారు. చనిపోయిన వారి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లే వారిని అడ్డుకోవటం కూటమి ప్రభుత్వానికి మంచిదికాదన్నారు. వైఎస్ జగన్‌ను రాష్ట్రంలో తిరగనిస్తే పరిపాలన చేయలేము అనే భయంతో పోలీస్‌లను అడ్డు పెట్టుకుని కుట్రలు, కేసులు పెట్టడం దారుణమన్నారు. కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కూటమి పాలనలో రెంటపాళ్ల గ్రామంలో పోలీస్‌లువేధింపులతో వైఎస్సార్‌సిపి గ్రామ ఉప సర్పంచ్ నాగ మల్లేశ్వరరావు బలవన్మరణం చెందారని తెలిపారు. వైఎస్ జగన్ పర్యటనకు ఎన్ని ఆటంకలు, కుట్రలు చేసిన ఆగేది లేదన్నారు. ట్రావెల్స్ యాజమానులను వాహనాలు ఇవ్వొద్దని బెదిరించటం దారుణమన్నారు. అంత భయం ఉన్న పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయటం లేదన్నారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వం పై ప్రజలు ఈ విధంగా తిరుగుబాటు చేసి తమ ఇబ్బందులు జగనన్నకు చెప్పుకునేందుకు వస్తున్నారని తెలిపారు.కూటమి ప్రభుత్వ వలన అన్యాయం జరిగిన ప్రతి కుటుంబాన్ని రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఖచ్చితంగా పరామర్శించటం జరుగుతుందని వైకాపా నేతలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, మాజీ మంత్రి విడుదల రజనీ, గజ్జెల సుధీర్ భార్గవ్‌రెడ్డిలు తెలిపారు.

# నకలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని వినతి

నరసరావుపేట, జూన్ 17 ప్రభాతవార్త : నకలీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘంఉపాధ్యక్షులు కుంచాల స్వామి విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఈ మేరకు స్దానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ పూనాటిశ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. కల్తీ విత్తనాల వలన దిగుబడి తగినంత రాక తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయాధికారుల ద్వారా విత్తనాల విక్రయాలపై , పురుగుమందులకు సంబంధించి నిరంతరం తనిఖీలు చేయించాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ప్రస్తుత సమయంలో మేలైన విత్తనాలు, పురుగుమందులు సబ్సిడీ పై మార్కెట్ యార్డు ద్వారా అందించాలని కోరారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణానికిఅవసరమైన లింకురోడ్లను ఏర్పాటు చేయాలని సంక్షేమ సంఘం నాయకులు కుంచాల స్వామి మార్కెట్ యార్డు చైర్మన్‌కు వి జ్ఞప్తి చేసారు.



# ఉచిత కంటిపొర చికిత్స శిబిరం లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నరసరావుపేట, జూన్ 17 ప్రభాతవార్త : మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటిపొరచికిత్స శిబిరంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వహకులను అభినందించారు. శంకర నేత్రాలయ, తడికమళ్ళ కుటుంబసభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించటం సంతోషమన్నారు. పేదలకు పూర్తి స్దాయిలో ఇటువంటి ఉచిత వైద్య సేవలందించటం అభినందనీయమన్నారు. దేశంలోనే శంకర కంటిఆసుపత్రి ఎంతో ప్రసిద్ది చెందినదని , వారి ఆధ్వర్యంలో ఎంతో ఖరీదైన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు కెపి రంగారావు, పూరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



# శిరిగిరిపాడు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలు

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో అందుబాటులో ఉన్న సీట్ల వివరాలను హెచ్‌ఎం తెలియజేశారు. మూడో తరగతికి 60 సీట్లకుగాను ఎస్టీ 36, ఎస్సీ 8, బీసీ 7, 6వ తరగతిలో ఎస్టీ 3, 7 వ తరగతికి ఎస్టీ 2, 8వ తరగతికిఎస్టీ 8, 9వ తరగతికి ఎస్టీ 10 అడ్మిషన్లు అందుబాటులో ఉన్నట్లు తెలిఎపారు. పల్నాడు జిల్లాలోని వెల్దుర్తి మండలానికి దగ్గర మండలాలైన దుర్గి, కారంపూడి, మాచర్ల, బొల్లాపల్లి, రెంటచింతల, పిడుగురాళ్ల మండలాల్లోని చెంచులు, ఎరుకల, లంబాడి, యానాది కులాలకు చెందినవారు ఎవరైనా ఆశ్రమ పాఠశాలలో చేరుటకు అవకాశం ఉన్నట్లు తెలియజేశారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వెలుగులు నింపిన 'తల్లికి వందనం'

## - పాఠశాలలకు మహర్దశ - ఉపాధ్యాయులకు పెరిగిన బాధ్యత

కారంపూడి, జూన్ 17 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా ప్రణాళికాబద్ధంగా నెరవేరుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలకు, పక్కా భవనాలకు, ఆటస్థలాల ఏర్పాటు, ఆధునికీకరణ, టాయిలెట్స్, తాగునీరు, నాణ్యత గల మధ్యాహ్న భోజనం ఏర్పాటు కోసం కోట్ల రూపాయలను ఖర్చు పెడుతోంది. ఒక తరగతి – ఒక టీచరుకు రూపకల్పన చేస్తూ మెగా డీఎస్సీ ద్వారా వేలాది టీచర్లను నియమించబోతోంది. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చుపెడుతుండగా విద్యాప్రమాణాలు పెంచడానికి టీచర్లు అంకిత భావంతో కృషి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కారంపూడి మండలంలో 10 ఉన్నత పాఠశాలలు, 27 ప్రాథమిక, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా 1 నుంచి 10వ తరగతి వరకు 7824 మంది విద్యార్థులు, 329 మంది ఇంటర్ విద్యార్థులు ఉండగా ఇప్పటికే తల్లుల ఖాతాలో ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద నగదు జమ అవుతున్నాయి. మొత్తం 8153 మంది విద్యార్థులు తల్లికి వందనం కింద అర్హులుగా గుర్తించగా 170 మంది విద్యార్థులు సరైన పత్రాలు లేకపోవడంతో వారి ఖాతాలో జమ కానట్లు తెలుస్తుంది. తల్లికి వందనం పథకం కుటుంబాల్లో వెలుగులు నింపింది.



అన్నీ ఉచితంగా: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం 3 జతల ఏకరూప దుస్తులు, వర్క్‌బుక్స్, బెలున, బ్యాగ్, డిక్షనరీ తదితర వస్తువులు ఉచితంగా అందజేస్తూ పిల్లల భవిష్యత్తుకు బంగారుబాట వేసింది. క్రీడా ప్రమాణాలు పెంచడానికి కృషి చేస్తుంది. పిల్లలకు కంటి పరీక్షలు మొదలగు పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తూ వారి ఆరోగ్యానికి ప్రభుత్వం బాసటగా నిలబడింది.

తల్లికి వందనం: కూటమి ప్రభుత్వం ఈ నెల 12న తల్లికి వందనం నిమిత్తం 8745 కోట్ల రూపాయలను విడుదల చేసింది. 1 నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఒకే ఇంట్లో ఎంతమంది ఉన్నా వారికి ఒక్కొక్కరికి 13 వేల రూపాయలు, పాఠశాల అభివృద్ధి, నిర్వహణకు కలెక్టరు ఖాతాకు రూ.2 వేలు రూపాయలు జమ అవుతున్నాయి. మొత్తం సుమారు 67 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం తల్లులకు ఆనందం నింపగా ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు.

ఉపాధ్యాయుల బాధ్యత పెరిగింది: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది. వారు విద్యార్థులను సమాజానికి పనికి వచ్చేవిధంగా తీర్చిదిద్దగలరు. తమ సమస్యల కోసం పోరాడుతూనే విద్యా ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, జూన్ 17 ప్రభాతవార్త : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుఅన్నారు. మంగళవారం స్దానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించారు. యోగసనాలు వేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే



ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా యోగా వలన కలిగే ప్రయోజనాలు తెలిపారు. ఈనెల 21న విశాఖలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొనటంజరుగుతుందన్నారు. అదే విధంగా లక్షాలాది మంది టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు తరలి రావాలని, మంచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు.

# కంభంపాడులో పొలం పిలుస్తోంది.

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: మాచర్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో మాచర్ల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.పాపకుమారి మాటాన్లడుతూ రైతులు మెట్ట పంటలు వేసేముందు పచ్చిరొట్ట పైరును వేసుకోవాలని సూచించారు. అధీకృత డీలర్ల దగ్గరే విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తన బిల్లులు అడిగి తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులను భద్రపరచుకో వాలని తెలిపారు. రైతులు సాగుచేసే పంటను, రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభంపాడు వ్యవసాయ సహాయకులు అనురాధ, గ్రామ రైతులు పాల్గొన్నారు.



# రూ.24.37 లక్షల చెక్కుల సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: వెల్దుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వర్గంలోని 33 మంది లబ్ధిదారులకు రూ.24.37 లక్షలు విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెలల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పంపిణీ చేశారు. ఆరోగ్యాంధ్ర కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే



అన్నారు. అనారోగ్యంతో ఉన్న నిఇరుపేదలను ఆదుకోవడంతోపాటు వైద్యఖర్చులకు సీఎంఆర్ఎఫ్ నగదు అండగా నిలుస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదింటి తల్లుల ఆత్మగౌరవం 'తల్లికి వందనం'

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: పేదింటి తల్లుల ఆత్మగౌరవం తల్లికి వందనం పథకమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి, బడులు తెరిచే సమయానికి సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం పథకం అమలు చేసి, నగదును తల్లుల ఖాతాల్లో జమ చేశామని ఆయన చెప్పారు. గత వైకాపా ప్రభుత్వం కన్నా రెట్టింపు మిన్నగా తల్లికి వందనం పథకాన్ని అమలు చేశామని ధీమా వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి పాలనలో 42 లక్షల 61 వవేల 965 మంది విద్యార్థులకు అమ్మఒడి కింద రూ.5540 కోట్లు ఖర్చు చేస్తే, కూటమి ప్రభుత్వంలో తల్లికి వందనం ద్వారా 67,27,164 మంది విద్యార్థులకు రూ.10.91 కోట్ల నగదు ఖర్చు చేశామన్నారు. దాదాపు 25 లక్షల మంది విద్యార్థులకు అదనంగా అందించామని ఆయన చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మత్స్యకారుల భృతి, అన్నదాత సుఖీభవ వంటి వాటికి గత ప్రభుత్వంతో పోల్చుకుంటే రెట్టింపు నిధులు ఖర్చు చేస్తున్నామని నిధుల లెక్కలను మీడియాకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలపై వైకాపా నాయకులకు దమ్ముంటే చర్చకు సిద్ధమా అని జూలకంటి సవాలు విసిరారు. తల్లి విజయమ్మను గౌరవించలేని మానసిక దౌర్భాగ్యుడు జగన్... తల్లికి వందనం పథకాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందనిఇ ఎమ్మెల్యే జూలకంటి విమర్శించారు. తల్లి, చెల్లిని పక్క రాష్ట్రాలకు తరిమి రాజధాని ప్రాంతంలో ఉంటున్న జగన్ అమరావతిని వైశ్యారాజధాని అని వాఖ్యలు చేయించడం తన సైకోయిజానికి నిదర్శనమన్నారు. బులుగు మీడియా అడ్డం పెట్టుకున్న గాలి పార్టీ, కూటమి ప్రభుత్వంపై నిత్యం అబద్ధాలను వండివారుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచేందుకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నం భోజనంలో సన్నబియ్యం వంటి అనేక అంశాల్లో ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థులకు అందజేస్తున్నామని ఆయన వెల్లడించారు.



కుట్రలు ఎన్ని చేసినా పథకాలు ఆగవు!

రాజకీయ కుట్రలు ఎన్ని పన్నినా ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలపై ఇచ్చిన హామీలు ఆగవని ఎమ్మెల్యే జూలకంటి భరోసా ఇచ్చారు. తల్లికి వందనం పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి, కూటమి ప్రభుత్వం సత్తా ఏమిటో వైసీపీకి తెలిసొచ్చేలా చేసిందన్నారు. రూ.2 వేలు మంత్రి లోకేష్ జేబుల్లోకి వెళ్లాయని విమర్శిస్తున్న వైసీపీ వాళ్లకి, గతంలో అమ్మఒడి పథకంలో కట్ చేసిన రూ.2 వేలు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని ప్రశ్నించారు. పాఠశాల అభివృద్ధికి నిధుల కింద నగదును మినహాయించి నగదును పాఠశాల ఖాతాలో జమ చేయడం జరుగుతోందన్నారు. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లను ఇప్పటికే అందిస్తున్నామని, అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో కూడా అమలు సిద్ధంగా ఉందన్నారు. అలానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు కానుందని ధీమా వ్యక్తం చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి శుద్ధ జలాలు పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఏపీలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోందని భరోసా ఇచ్చారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాచర్ల రూరల్ ఎస్సై వీఆర్‌కు బదిలీ

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నరసింహులును జిల్లా ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేశారు. మాచర్ల రూరల్ పరిధిలో ఒక యాక్సిడెంట్ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ కాపీ అడిగిన వారితో దురుసుగా ప్రవర్తించారని మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ దృష్టికి రావడంతో ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. రూరల్ పోలీసు స్టేషన్లో కారు డ్రైవరుగా పనిచేస్తున్న వ్యక్తిని ఎస్సై కొట్టాడని, దానిపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో ఒక చిన్న పంచాయతీకి సంబంధించి ఒక వ్యక్తిని కొట్టాడని సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పల్నాడు జిల్లా ఎస్పీ ఎస్సై నరసింహులును వీఆర్‌కు బదిలీ చేశారు.



# ఘనంగా రామలక్ష్మమ్మ అంత్యక్రియలు

మాచర్ల, జూన్ 17 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని తండ్రిసన్నిధి సంఘస్తురాలు ఉప్పుతోళ్ల లక్ష్మమ్మ అంత్యక్రియలు మంగళవారం ఘనంగా





నిర్వహించారు. సోమవారం రాత్రి ఆమె తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న సంఘస్తులు, బంధువులు, స్నేహితులు మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దైవజనులు సాల్మన్‌రాజు, మార్క్, ఆనంద్‌లు సంఘస్తులనుద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు రెండవ రాకడలో క్రీస్తునందు మృతి చెందినవారు మొదటగా లేపబడతారని ఉద్భోదించారు. యేసుక్రీస్తును తమ సొంత రక్షకునిగా అంగీకరించి, విశ్వసించిన వారు నిత్యజీవానికి వారసులవుతారన్నారు. అలా విశ్వాసులైన వారు చనిపోయినా క్రీస్తు రెండవ రాకడలో సజీవులవుతారన్నారు. కార్యక్రమంలో స్థానిక సంఘస్తులు, బంధువులు పాల్గొన్నారు.

18-6Pg5.qxd:18-6Pg5.qxd 01/01/01 6:53 AM Page 1





మంగుళూరులో కురిసిన భారీవర్షాలకు నేలకూలిన ఇళ్లు



ముంబయిలో కురుస్తున్న భారీవర్షాలకు జలమయమైన రోడ్లు

# ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో జనజీవనం అస్తవ్యస్తం

## నీటమునిగిన ముంబయి శివారు ప్రాంతాలు, మహారాష్ట్రలో 18 మంది మృతి

## దేశమంతా విస్తరించిన నైరుతి పవనాలు

### వాయవ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

**ముంబయి, జూన్17:** మూడు వారాల పాట్లు స్తబ్దుగా ఉన్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తిరిగి వేగం పుంజుకున్నాయి. దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమతీర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముంబై నగరాన్ని వానలు ముంచెత్తగా, కేరళలోనూ జనజీవనం అస్తవ్యస్తమైంది. రానున్న రోజుల్లో మరిన్ని రాష్ట్రాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని భారత వాతావరణశాఖ వెల్లడించింది. నైరుతి రుతుపవనాలు మధ్య, ఉత్తర అరేబియా సముద్రంతో పాటు గుజరాత్, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశాలోని పలు ప్రాంతాలకు విస్తరించాయి.

కొంకణ్, మధ్య మహారాష్ట్ర, తెలంగాణలో మిగిలిన ప్రాంతాలను కూడా కప్పేశాయి. రుతుపవనాలు మహారాష్ట్ర మొత్తం వ్యాపించి, పొరుగు రాష్ట్రాలైన గుజరాత్, మధ్యప్రదేశ్‌లోకి కూడా ప్రవేశించినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న రెండు, మూడు రోజుల్లో గుజరాత్, మహారాష్ట్రలోని మరిన్ని ప్రాంతాలు, విదర్భ, చత్తీస్‌గఢ్, ఒడిశా, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, బీహార్, ఉత్తరప్రదేశ్‌లోనూ విస్తరించనున్నాయని అంచనా వేస్తున్నారు. గుజరాత్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం నేడు అల్పపీడనంగా మారే అవకాశం ఉందని, వాయవ్య బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణశాఖ తెలిపింది. ఈ అనుకూల పరిస్థితుల వల్ల రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో నిన్న కొన్ని చోట్ల వర్షాలు కురిశాయని, రానున్న 24 గంటల్లో కూడా అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

రుతుపవనాల ప్రభావంతో మహారాష్ట్రలో, ముఖ్యంగా ఆర్థిక రాజధాని ముంబైలో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ముంబై నగరం, శివారు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, సబర్బన్ రైళ్లు, మెట్రో రైళ్ల సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాల కారణంగా ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 18 మంది మరణించారని, 65 మంది గాయపడ్డారని మహారాష్ట్ర అధికారులు వెల్లడించారు. రాబోయే 24 గంటల్లో ముంబై, శివారు ప్రాంతాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనావేసింది. భారీ వర్షాలకు ముంబై, థానే, పాల్ఘర్ తదితర ప్రాంతాలకు 'ఆరెంజ్' అలర్ట్, రాయగఢ్‌కు 'రెడ్' అలర్ట్ జారీ చేశారు.

కేరళలోనూ భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల బస్సులు, రైళ్ల ప్రయాణాలకు అంతరాయం ఏర్పడింది. నదులు, జలాశయాల్లో నీటి మట్టాలు ప్రమాదకరస్థాయికి చేరుకున్నాయి. వరద నీరు ఇళ్లల్లోకి చేరడంతో కన్నూర్, కాసరగఢ్ సహా పలు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కన్నూర్‌లోని కక్కడ్ ప్రాంతంలో రహదారిపైకి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కాసర్‌కోడ్ జిల్లాలోని వెల్లరికుండ్ ప్రాంతంలో కనీసం 10 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

### దేశవ్యాప్తంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో

# వెబ్ కాస్టింగ్ తప్పనిసరి

## ఎన్నికల కమిషన్ నిర్ణయం




**న్యూఢిల్లీ, జూన్ 17:** ఓటింగ్ రోజు అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ఎన్నికల ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇప్పటి వరకు సమస్యాత్మకమైనవిగా భావించే వాటితో సహా మొత్తంగా 50 శాతం పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే దీనిని నిర్వహించేవారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా నమోదు చేసిన సమాచారాన్ని ఎన్నికల సంఘం అంతర్గత అవసరాలకు వినియోగించుకోనుంది. త్వరలో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలనుంచి 100 శాతం వెబ్‌కాస్టింగ్ నిర్ణయం అమలుకానుంది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారులకు ఇసి తెలియజేసింది. రాష్ట్ర స్థాయిలో, ప్రతి జిల్లాలో, అన్ని నియోజకవర్గాల స్థాయిలోనూ వెబ్‌కాస్టింగ్ మానిటరింగ్, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తుంది. ప్రతి స్థాయిలోనూ నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుంది. వెబ్‌కాస్టింగ్ కోసం ఇంటర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకోనుంది. ఆ సదుపాయం లేని చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వీడియో చిత్రీకరణ, ఫొటోలు తదితరాలపై ఆధారపడనుంది. మరింత నిశితంగా ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు వెబ్‌కాస్టింగ్ ఉపయోగపడుతుందని భావిస్తు న్నారు. ఎన్నికల నిబంధనలకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణల ప్రకారం వెబ్‌కాస్టింగ్ దృశ్యాలు, సిసిటివిల్లో నమోదైన దృశ్యాలను చూసేందుకు ప్రజలను అనుమతించరు.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడి

## కీవ్‌లో అపార్ట్‌మెంట్లు ధ్వంసం, 14 మంది దుర్మరణం



**కీవ్, జూన్ 17:** ఒకవైపు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న తరుణంలో మరోవైపు రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. కీవ్‌పై మాస్కో భీకర క్షిపణి దాడులకు పాల్పడుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై జరిగిన దాడుల్లో 14 మంది ప్రాణాలు కోల్పోగా.. 40 మందికిపైగా పౌరులు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు. కీవ్ సైనిక పరిపాలన అధిపతి తైమూర్ ట్కాచెంకో మాట్లాడుతూ రష్యా దాడిలో కీవ్‌లోని డజన్లకొద్దీ అపార్ట్‌మెంట్లు ధ్వంసం అయ్యాయని తెలిపారు. ఇప్పటికే 14 మంది మృతి చెందినట్లు పేర్కొన్నారు.

భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని..దీంతో మృతులసంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఘటనా స్థలాల్లో సహాయకచర్యలు కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. ఈ దాడిలో ఒక అమెరికా పౌరుడు కూడా మరణించినట్లు వెల్లడించారు. రష్యా ప్రయోగించిన పలు డ్రోన్లను ఉక్రెయిన్ వైమానిక రక్షణ దళాలు కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. అయితే డ్రోన్లశిథిలాలు పడడంతో కీవ్‌లోని పలు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయన్నారు. కాగా కెనడాలో జరుగుతున్న 'జి-7సదస్సు'కు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ హాజరవ్వనున్నారు.

కాల్పుల విరమణ కోసం ఒకవైపు మంతనాలు జరుగుతున్న వేళ రష్యా వరుసగా ఉక్రెయిన్‌పై అతిపెద్ద వైమానిక దాడులకు పాల్పడుతోంది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా 367 డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఇదే అతిపెద్ద వైమానిక దాడి అని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్‌పై రష్యా 69 క్షిపణులు, 298 డ్రోన్లను ప్రయోగించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో 80 నివాస భవనాలుసైతం ధ్వంసమయ్యాయి. ఇరాన్ రూపొందించిన షాహెద్ డ్రోన్లను ఉక్రెయిన్‌పై రష్యా ప్రయోగించినట్లు అధికారులు పేర్కొన్నారు. యుద్ధాన్ని ఆపడానికి రష్యాపై ఒత్తిడి పెంచాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అమెరికా, పశ్చిమ దేశాలను కోరారు.



# నిలకడగానే సోనియా ఆరోగ్యం

**న్యూఢిల్లీ, జూన్ 17:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని గంగారామ్ ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఉదర సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం రాత్రి ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. మంగళవారం సోనియా ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ మాట్లాడారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఉదర సంబంధిత సమస్యనుంచి ఆమె పూర్తిగా కోలుకుంటున్నారని తెలిపారు. ఆమె డైట్‌ను పూర్తిగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సోనియాగాంధీ డిశ్చార్జి తేదీని ఇంకా నిర్ణయించలేదన్నారు. డాక్టర్ ఎస్ నందే, డాక్టర్ అమితాబ్ యాదవ్ సోనియా ఆరోగ్య పరిస్థితితోపాటు డైట్‌ను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ నెల 9న మెడికల్ చెకప్ నిమిత్తం సోనియాగాంధీ ఆస్పత్రికి వెళ్లిన విషయం తెలిసిందే.

# భాషల ఆధారంగా విడదీయొద్దు

## దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం అమలు చేయాలి: ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్



**న్యూఢిల్లీ, జూన్ 17:** ప్రపంచంలోనే అత్యంత ఉత్కృష్టమైన భారతదేశాన్ని భాషల ఆధారంగా విడదీయడాన్ని భరించలేమని ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్ అన్నారు. దేశ భవిష్యత్తు, శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ భయంకరమైన 'తుఫాన్'ను అధిగమించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు జాతీయ విద్యావిధానం 2020ని అమలు చేయాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇది విద్యారంగంలో ఓ 'గేమ్ ఛేంజర్' అవుతుందని, దేశాభివృద్ధిని మరింత పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఎందుకు ఇతర భాషలంటే వ్యతిరేకత?**

పుదుచ్చేరి విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఉన్న జగదీప్ ధన్‌ఖడ్ ఎవరి పేరు ప్రస్తావించకుండా పరోక్షవిమర్శలుచేశారు. దేశంలోని కొంత మందికి ఇతర భాషలు అంటే వ్యతిరేకత ఉందని విచారం వ్యక్తం చేశారు. 'గత దశాబ్దకాలంలో జరిగిన అసాధారణ అభివృద్ధి ఫలితంగా భారత్ ప్రపంచంలోనే అత్యంత ఆకాంక్షాత్మక దేశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశాన్ని భాష పేరిట ఎలా విభజించగలుగుతాం?' అని ఆయన ప్రశ్నించారు.

**ఇండియా గ్రేట్**

ప్రపంచంలో ఏదేశంలోకూడా భారత్‌లో ఉన్నన్ని భాషలులేవు. సంస్కృతానికి ప్రపంచ ప్రాముఖ్యత ఉంది. మన దేశంలో పాళీ, ప్రాకృతం, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, ఒడియా, మరాఠీ, బెంగాలీ, అస్సామీ అనే 11 శాస్త్రీయ భాషలు ఉన్నాయి. 'పార్లమెంట్‌లో సభ్యులు 22భాషల్లో ప్రసంగించడానికి అనుమతిస్తారు. మన భాషలు దేశ సమగ్రతను సూచిస్తాయి. సనాతన ధర్మం ఒకే ఉన్నత లక్ష్యం కోసం కలిసి పనిచేయడానికి బోధిస్తుంది' అని జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. 'మన దేశ గమ్యస్థానాన్ని చూడండి. భవిష్యత్‌ను పరిగణనలోకి తీసుకోండి. భాషల పేరిట దేశాన్ని విడదీయాలనే వాదనను అధిగమించండి' అని ఆయన కోరారు.

**గేమ్ ఛేంజర్**

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని అన్ని రాష్ట్రాలు అమలు చేయాలని, ఇది ఒక గేమ్ ఛేంజర్ అవుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. 'జాతీయ విద్యావిధానం ప్రపంచంలోనే అత్యుత్తమ విధానం. ఇది విద్యార్థులు తమ ప్రతిభను, సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవడానికి, ఒకటి కంటే ఎక్కువ కోర్సులు నేర్చుకోవడానికి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాన్ని అందిస్తుంది' అని ఆయన అన్నారు. రాజ్యాంగ నిర్మాతలు భాషల విషయంలో రాజకీయ ఘర్షణలు అవసరం లేకుండా విధానాన్ని రూపొందించారు. ఇందులో ఎలాంటి గందరగోళం లేదని అందరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు.

# పట్టాలెక్కనున్న 200 కొత్త రైళ్లు

## రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్

**న్యూఢిల్లీ, జూన్ 17:** రైలు ప్రయాణికులకు శుభవార్త! కొత్తగా 200 రైళ్లను పట్టాలెక్కించేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ రంగం సిద్ధం చేస్తోంది. 'ప్రయాణికుల సౌకర్యం కోసం కొత్తగా 50 నమో భారత్ రైళ్లు, 100 మెమూ రైళ్లు, 50 అమృత్ భారత్ రైళ్లు' అంటూ రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. అత్యాధునిక వసతులతో కూడిన ఈ రైళ్ల విడియోను ఆయన షేర్ చేశారు. అయితే, ఈ రైళ్లు ఎప్పుడు పట్టాలెక్కబోతున్నాయి? ఏయే స్టేషన్లు / డివిజన్లలో అందుబాటులోకి వస్తాయనే వివరాలను మాత్రం పేర్కొనలేదు. మరోవైపు, హర్యానాలోని మనేసర్‌లో దేశంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌ను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల సేవల్ని అప్‌గ్రేడ్ చేసేందుకు ఇటీవల ఓ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం ఉన్న మెమూ రైళ్లను 8-12 కోచ్‌ల నుంచి 16-20 కోచ్‌లకు పెంచుతున్నామన్నారు. తద్వారా తక్కువ దూరం ప్రయాణికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 100కి పైగా మెమూ రైళ్ల తయారీ కోసం కాజీపేటలో కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, కొత్తగా 50 నమో భారత్ రైళ్లను తయారు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రయాణికులతోపాటు సరకు రవాణాలో రైల్వే శాఖ కృషిని ప్రశంసించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేలు దాదాపు 720 కోట్ల మంది ప్రయాణికులను, 1,617 మిలియన్ టన్నుల సరకును రవానా చేసినట్లు తెలిపారు.

# 9 ఎయిరిండియా విమానాలు రద్దు




## సాంకేతిక లోపాలే కారణం

## సమీక్షించిన డిజిసిఎ

**న్యూఢిల్లీ, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమాన యాన సంస్థపై డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) చర్యలకు ఉపక్రమించింది. వరుసగా విమానాల్లో సాంకేతిక లోపాలు బయటపడడం, అవి రద్దు కావడాన్ని తీవ్రంగా పరిగణించింది. ఈ క్రమంలో మంగళవారం ఎయిర్ ఇండియాతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించింది. అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం దృష్ట్యా డిజిసిఎ కీలక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అన్ని బోయింగ్ 787 విమానాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని ఎయిర్ ఇండియాకు రెండువారాల గడువు విధిస్తూ డిజిసిఎ ఆదేశాలు కూడా ఇచ్చింది. అయితే.. ఈలోపే వరుసగా సాంకేతిక లోపాలతో ఘటనలు వెలుగులోకి వస్తుండడంతో డిజిసిఎ అప్రమత్తమైంది. గత 48 గంటల్లో 9 ఘటనలు చోటుచేసుకోవడాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంది. ఈ క్రమంలోనే మంగళవారం ఎయిరిండియా ప్రతినిధులతో వర్చువల్ సమావేశం నిర్వహించింది. బోయింగ్ విమానాల్లో సాంకేతిక సమస్యలపై ప్రశ్నలు సంధిస్తూ ఎయిరిండియా ఇంజినీరింగ్ చీఫ్‌కు డిజిసిఎ సమన్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం ఒకేరోజు ఎయిర్ ఇండియాకు చెందిన మూడు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. శాన్‌ఫ్రాన్సిస్కో-ముంబై, అహ్మదాబాద్-లండన్ సర్వీసు రద్దు కాగా తాజాగా ఢిల్లీ-ప్యారిస్ సర్వీసు కూడా రద్దు అయినట్లు తెలుస్తోంది.

**ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం**

అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లే మరో ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానసర్వీసును రద్దు చేశారు. మధ్యాహ్నం 1.10 గంటలకు ఎఐ 159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం లండన్‌కు బయల్దేరాల్సి ఉంది. ఎయిర్‌పోర్టు వచ్చాకే విమానం రద్దు విషయం తెలిసిందని ఓ ప్రయాణికుడు తెలిపాడు. విమాన రద్దుకు కారణంలేదా ఛార్జీల వాపసు వివరాలను సిబ్బంది చెప్పడం లేదని అంటున్నాడు.

**సాంకేతిక సమస్యతో ప్రయాణికుల దించివేత**

ఎయిర్ ఇండియా విమానం (ఎఐ180) శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబయికి వెళ్తోంది. మంగళవారం అర్ధరాత్రి 12.45 గంటలకు కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకుంది. ఈ క్రమంలో విమానంలోని ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీన్ని సిబ్బంది వెంటనే గుర్తించి అప్రమత్తమయ్యారు. భద్రతా కారణాల రీత్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. అలాగే తాజాగా ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లే ఎయిర్ ఇండియా విమానంలోనూ సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని ఎయిర్‌లైన్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ 143 రద్దు చేసినట్లు తెలిపింది. ముందస్తు విమాన తనిఖీల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొంది. ఫలితంగా బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిర్ ఇండియా ఎఐ 142ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. హోటల్ వసతి సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపింది. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు.

# కర్ణాటక డిప్యూటీ సిఎం సోదరుడు డికె సురేష్‌కు ఇడి సమన్లు

**బెంగళూరు, జూన్ 17:** మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కాంగ్రెస్ నేత, కర్ణాటక ఉపముఖ్యమంత్రి శివకుమార్ సోదరుడు డికె సురేశ్‌కు సమన్లు జారీ చేసినట్లు అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. మాజీ ఎంపి సురేశ్‌ను ఈ నెల 19న విచారణకు హాజరుకావాలని.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద వాంగ్మూలం నమోదు చేయాలని కోరినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్‌లో ఐశ్వర్యగౌడ అనే మహిళను ఇడి అరెస్టుచేసింది. ఆ మహిళ అనేకమంది హైప్రొఫైల్ రాజకీయ నాయకులతో సన్నిహితంగా ఉందని చెప్పుకుందని ఇడి ఓ ప్రకటనలో పేర్కొంది. బంగారం, నగదు, బ్యాంకు డిపాజిట్లపై అధిక మొత్తంలో రాబడిని ఎరవేసి మోసి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. డికె సురేశ్ పేరును ఉపయోగించుకుందని.. అతని సోదరి అని చెప్పుకున్నట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. మాజీ ఎంపి సైతం బెంగళూరు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం..

## డిఎన్‌ఎ పరీక్షల ద్వారా 125 మృతదేహాల గుర్తింపు!

**అహ్మదాబాద్, జూన్ 17:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డిఎన్‌ఎ పరీక్ష ద్వారా ఇప్పటి వరకు 125 మంది బాధితుల వివరాలను గుర్తించినట్లు ఆసుపత్రి అధికారులు తాజాగా వెల్లడించారు. అందులో 83 మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మిగతా మృతదేహాల అప్పగింత ప్రక్రియ కొనసాగుతోంది. మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డిఎన్‌ఎ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. 72 గంటల్లో పూర్తవుతుందని చెప్పిన డిఎన్‌ఎ పరీక్ష 84 గంటలైనా పూర్తి కాకపోవడంతో మృతుల బంధువుల సిటీ సివిల్ దవాఖాన వద్ద పడిగాపులు పడాల్సి వస్తున్నది. అయితే ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డిఎన్‌ఎ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.

గతవారం ఎయిర్ ఇండియాకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిపోయింది. ఈ ఘటనలో దాదాపు 270 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. క్షతగాత్రులు అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరోవైపు విమాన ప్రమాద ఘటనపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జి-7లో 'మెలోనీ వైఖరి'పై ఆసక్తికర చర్చ

## ప్రధాని మోడీ రాకముదే వెనుదిరిగిన ట్రంప్

**ఒట్టావో, జూన్ 17:** కెనడాలో జి-7 సదస్సు జరుగుతున్న విషయంతెలిసిందే. ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మధ్య చోటుచేసుకున్న ఆసక్తికర సంఘటనకు సంబంధించిన విడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. కెనడాలోని అల్బెర్టా ప్రాంతంలో 51వ జి-7 శిఖరాగ్ర సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సమావేశానికి భారత ప్రధాని నరేంద్రమోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా వివిధ దేశాల ప్రధానమంత్రులు హాజరయ్యారు. అయితే ఈ సదస్సులో ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ప్రవర్తించిన తీరు ప్రస్తుతం నెట్టింట చర్చకు దారి తీసింది. సభలో వివిధ అంశాలపై డొనాల్డ్ ట్రంప్ తదితరులు చర్చిస్తున్న సమయంలో జార్జియా మెలోనీ విచిత్రంగా ప్రవర్తించారు. పక్కనే కూర్చున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్.. జార్జియా మెలోని చెవిలో ఏదో చెప్పసాగాడు. దీంతో ఆమె తల దగ్గరగా పెట్టి మరీ ఆసక్తిగా మొత్తం విన్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తున్న సమయంలోనే ఇదంతా జరిగింది. ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాటలను శ్రద్ధగా విన్న జార్జియా మెలోనీ. చివరగా బొటనవేలు పైకి చూపడంతోపాటు కళ్లను ఆర్పుతూ ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్ అందరినీ ఆకట్టుకుంటోంది. దీంతో అంతా వీరి సంభాషణపై వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు. నెటిజన్లు వారి సంభాషణపై తమకు తోచిన విధంగా ఫన్నీ ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు.

గతంలో అల్బేనియా రాజధాని టిరానాలో జరిగిన యూరోపియన్ పొలిటికల్ కమ్యూనిటీ సమ్మిట్‌కు మెలోనీ హాజరైనసందర్భంలో అల్బేనియన్ ప్రధానమంత్రి ఎడి రామా మోకాళ్లపై నిలబడి మెలోనీకి స్వాగతం పలికిన విడియో తెగ వైరల్ అయింది. అలాగే అమెరికా టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్‌తో జార్జియా మెలోని దిగిన ఫొటోలు కూడా తెగ వైరల్ అయ్యాయి. ఇదిలా ఉండగా అల్బెర్టాలో సోమవారం రాత్రి జరిగిన 51వ జి-7 సదస్సుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన విషయం తెలిసిందే. అయితే ట్రంప్ సదస్సు నుంచి అకస్మాత్తుగా నిష్క్రమించారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగానే ఇలా త్వరగా వెళ్లినట్లు తెలుస్తోంది. మరోవైపు పదేళ్ల తర్వాత భారత ప్రధాని నరేంద్రమోడీ కెనడాలో అడుగుపెట్టారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు మోడీ ఈ సదస్సుకు హాజరయ్యారు. అయితే ప్రధాని మోడీ కెనడాలో అడుగుపెట్టడానికి ముందే .. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఈ సదస్సు నుంచి అర్థాంతరంగా వెళ్లిపోయారు.

# పనితీరు ఆధారంగా పోస్టింగులు, బదలీలు

- కూటమి ప్రభుత్వ మొదటి యేడాదిలో ప్రభుత్వ వైద్య రంగంలో మార్పుకు శ్రీకారం
- ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించిన వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించే దిశగా సానుకూల వాతావరణాన్ని కల్పించి మంచి ఫలితాల్ని సాధించే దిశగా మొదటి అడుగు వేశామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగంలో భాగస్వాములైన అందరూ జవాబుదారీతనం, క్రమశిక్షణలతో వ్యవహరించడం అన్ని స్థాయిల్లో వైద్యులు, అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ ఫలితాల్ని మదింపు చేయడం జరిగిందన్నారు. బాగా పనిచేసిన వారిని ప్రోత్సహించడం,అక్రమాలు, రాజకీయ జోక్యాన్ని అడ్డుకోవడం వంటి అంశాల ఆధారంగా వైద్య సేవల్ని మెరుగుపర్చడానికి గత ఏడాది కాలంగా కృషి చేసినట్లు మంత్రి వివరించారు. ఈ మేరకు మంత్రిగా బాధ్యతల్ని స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా మంత్రిత్వ శాఖ ప్రయత్నాలు, ఫలితాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి 5 పేజీల వివరణాత్మక నివేదికను సమర్పించారు. గతేడాది జూన్ 16న పదవీ స్వీకారం చేసిన మంత్రి ఈనెల 16న ముఖ్యమంత్రికి తన నివేదికను పంపారు. క్రమశిక్షణ, జవాబుదారీతనం గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనా వైఖరితో వైద్య సిబ్బందిలో గైరు హాజరీ, జవాబుదారీతనం లేకపోవడం, వివిధ స్థాయిల్లో పనితీరు మరియు ఫలితాలపై పర్యవేక్షణ లోపించడం కారణంగా వైద్య సేవల నాణ్యత దెబ్బతిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ వారసత్వంగా సంక్రమించిన ఈ సమస్యల్ని అధిగమించడానికి నిర్దిష్ట ప్రణాళికలతో కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా చేసిన కృషి సత్ఫలితాల్ని ఇస్తోందని మంత్రి తన నివేదికలో ముఖ్యమంత్రికి వివరించారు. వైద్య సిబ్బంది హాజరు, ఓపీ మరియు ఐపీ సేవల్లో కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో ఇతోధికంగా పెరుగుదలను సాధించామని, ఇది ప్రజారోగ్య రంగంలో వచ్చిన మార్పునకు నిదర్శనమని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. తత్ఫలితంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సర్వేల్లో ప్రభుత్వ వైద్య సేవల పట్ల సానుకూలత బాగా పెరిగిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రశ్నించడం ద్వారా మెరుగైన పాలనా ప్రక్రియసమగ్ర సమాచారంతో విశ్లేషణాత్మక ప్రతిపాదనలతో కూడిన నిర్ణయాలు ఏ రంగంలోనైనా సత్ఫలితాల్ని సాధించడానికి ప్రధానమని మంత్రి అన్నారు.

## జూలై 11న కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లకు ఎన్నికలు

**గుంతకల్లు రైల్వే, జూన్ 17,ప్రభాతవార్త :** రాయలసీమ జిల్లాలలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలోని కడప రైల్వే ఇన్స్‌టిట్యూట్ పాలక మండలి ఎన్నికలు జూలై 11న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కాలవ్యవధి పూర్తయిన రైల్వే ఇన్స్‌టిట్యూట్ పాలకమండలిలకు జూలై 1 నుంచి ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఉన్న పాకాల రైల్వే ఇన్స్‌టిట్యూట్‌కు జూలై 1న, రేణిగుంట రైల్వే ఇన్స్‌టిట్యూట్‌కు జూలై 4న,నందలూరు రైల్వే ఇన్స్‌టిట్యూట్‌కు జూలై 7న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసిన ఎన్నికల యంత్రాంగం తాజాగా జూలై 11న కడప రైల్వే ఇన్స్‌టిట్యూట్ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది.



# యోగాంధ్రను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- యోగా నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు
- ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలి
జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనిత

**విజయనగరం, జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** యోగా జీవన విధానంలో భాగం కావాలనే ఉద్దేశ్యంతో ప్రధాని మోడీ యోగా కార్యక్రమానికి అత్యంత ప్రధాన్యతనిస్తున్నారని, ఒకే రోజు ఒకే చోట 5 లక్షల మందితో విశాఖపట్నంలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంచార్జ్ మంత్రి రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, రహదారులు భవనాల శాఖామంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డిలతో కలసి ఈ నెల 21న నిర్వహించే యోగా కార్యక్రమంపై మూడు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులతో, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ మంత్రి మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు రాష్ట్రం లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దీక్ష బూనారని, ఇందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. నెల రోజుల నుండి యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలందరినీ సన్నద్ధం చేయడం జరుగుతోందని తెలిపారు. విశాఖపట్నంలో ఒకే రోజున ఒకే వేదిక నుండి 5 లక్షల మంది యోగ చేయడం ద్వారా దేశమంతా వైజాగ్ వైపు చూస్తుందని, అంతే కాకుండా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదిస్తామని పేర్కొన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలనీ కోరారు. యోగా కార్యక్రమానికి వచ్చే వారికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను వేసి రహదారి మార్గంలో అత్యవసరాల కోసం వాష్ రూమ్స్‌ను గుర్తించడం జరిగిందని, వాటిని బస్సులతో మ్యాప్ చేయడం జరిగిందని, అలాగే మెడికల్ ఎమర్జెన్సీ కోసం కూడా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఉదయాన్నే బస్సులు బయలుదేరతాయి కావున ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో పాటు మూడు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. నియోజకవర్గం వారీగా , సచివాలయం వారీగా నమోదు చేసుకున్న జాబితాలను సంబంధిత శాసన సభ్యులకు ఇవ్వాలని, వారు వారి కార్యకర్తల ద్వారా జన సమీకరణ లో భాగస్వామ్యులవుతారని తెలిపారు . సురక్షితంగా గమ్యాలను చేరే వరకు ఇంచార్జ్ లు బాధ్యత తీసుకోవాలని, అలాగే ట్రాఫిక్ నియంత్రణకు జాతీయ రహదారిపై హెవీ వాహనాలను తిరగకుండా నిరోధించాలని సూచించారు. యోగా వేదిక వద్ద కంపార్ట్మెంట్లను కేటాయించడం జరుగుతుందని, ఎవరికీ ఏ కంపార్ట్మెంట్ కేటాయించారో, ఆ నెంబర్ వారు వెళ్ళే బస్సు పైన రాయడం జరుగుతుందని , దాని ప్రకారంగా ఎటువంటి ఆందోళన పడకుండా ఇంచార్జ్‌లు జాగ్రత్తగా తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా నుండి 36 వేల మందిని సిద్ధం చేసుకున్నామని, కనీసం 30 వేల మందిని పంపడానికి 2 రూట్లలో 660 బస్సు లను సిద్ధం చేసామని, ప్రతి బస్సు కు ఒక లైజెన్ అధికారిని నియమించామని, సచివాలయం వారీగా బస్సులను, టాయిలెట్లను మాప్ చేయడం జరిగిందని తెలిపారు. 15 వేల మంది విద్యార్థులను వేయడం జరిగిందన్నారు.

# మాదక ద్రవ్యాల మహమ్మారిపై మూకుమ్మడి దాడి: కలెక్టర్ లక్ష్మీశ


- అన్ని విద్యాసంస్థల్లోనూ ఈగల్ క్లబ్స్ ఉండాల్సిందే
- క్యాంపస్ అంబాసిడర్లనూ నియమించాలి

**విజయవాడ,జూన్ 17,ప్రభాతవార్త ప్రతినిధి:**సుసంపన్న,ఆరోగ్య ఆనంద ఆంధ్ర సాకారం దిశగా అడుగులేస్తూ మూకుమ్మడి దాడితో మాదకద్రవ్యాల మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేయిచేయి కలుపుదామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం,నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ,దుష్ప్రభావాలు,అవగాహనా కార్యక్రమాల నిర్వహణ,కౌన్సిలింగ్ సేవలు తదితరాలపై సోమవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలు,కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఇందుకు ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమించాలని ఆదేశించారు. వీటి సభ్యులకు వర్క్‌షాప్స్ నిర్వహించి డ్రగ్స్ అంటే ఏమిటి?డ్రగ్స్ ఉపయోగిస్తున్న వారిని గుర్తించడం ఎలా?సున్నితంగా సమస్యను ఎలా పరిష్కరించాలి? తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాలు వ్యక్తుల జీవితాలను,కుటుంబాలను ఎలా నాశనం చేస్తాయనే విషయాలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. అదే విధంగా పోస్టల్,కొరియర్ సంస్థల సిబ్బందికి ప్రత్యేకంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జనజాగృతికి అవసరమైన లఘు చిత్రాలు,కరపత్రాలు వంటి వాటిని రూపొందించాలని ఆదేశించారు. యోగాంధ్ర మాసోత్సవాలు ముగిసిన అనంతరం నెల రోజుల పాటు విస్తృత స్థాయిలో మాదక ద్రవ్యాలపై పోరాటానికి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమన్వయ శాఖలు,ఎన్‌జీఓలు,డీఎల్ఎస్ఏ నిపుణులు తదితరుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ర్యాలీలు,వాకథాన్‌లు, సదస్సులు వంటి వాటిని నిర్వహించనున్నామని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్,ఈగల్ బృందాలు తీసుకుంటున్న చర్యలను డీసీపీ కెజీవి సరిత వివరించారు. యాంటీ నార్కోటిక్స్ స్క్వాడ్,టాస్క్‌ఫోర్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను తెలియచేశారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డిపిఎస్)చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని,ఈ ఏడాది జనవరి నుంచి 73 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేశామన్నారు.

# ఘనంగా శ్రీచైతన్య ఐరావత్ ఛాంపియన్స్ వేడుక

విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు, నటుడు అడివి శేష్

శ్రీచైతన్య విద్యాసంస్థల బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ చెస్ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు




**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** ఆరాష్ట్రంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన ఐఐటి-జెఇఇ(మెయిన్ అండ్ అడ్వాన్స్‌డ్), నీట్-2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి తన అగ్రస్థానాన్ని నిరూపించుకుని, ఆలిండియా నంబర్ వన్‌గా నిలిచిన సందర్భంగా "ఐరావత్ చాంపియన్స్ వేడుక" ను ఘనంగా నిర్వహించింది. హైటెక్ సిటీ శిల్ప కళావేదికలో అంగరంగ వైభవంగా జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న శ్రీచైతన్య టాపర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున ఈ స్ఫూర్తిదాయక వేడుకలో పాల్గొన్నారు. ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమంగా, సాధకులను సత్కరించే వేదికగా "ఐరావత్" నిలిచింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్ దొమ్మరాజు, సినీ నటుడు అడివి శేష్ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా శ్రీచైతన్య డైరెక్టర్లు శ్రీధర్ యలమంచిలి, సుష్మా బొప్పన, సీమ బొప్పన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక సన్మానాలు చేశారు. శాస్త్రీయ శిక్షణతో, అత్యాధునిక మౌలిక వసతులతో ముందంజలో ఉన్న శ్రీచైతన్య విజయం వెనుక ఉన్న కలలు, కృషిని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది. గుకేష్ దొమ్మరాజు మాట్లాడుతూ "చదరంగం మాదిరిగానే, జెఇఇ అండ్ నీట్ వంటి పోటీ పరీక్షల విజయానికి వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, మానసిక స్థైర్యం ఎంతో అవసరం. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు ఈ నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రేరణనిచ్చే అవకాశాన్ని నేను నిబద్ధతతో నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. సినీ నటుడు అడివి శేష్ మాట్లాడుతూ.. "202565 జెఇఇ అండ్ నీట్ పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన ప్రతి శ్రీచైతన్య విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు. ఈ విజయాల వెనుక ఉన్న ప్రణాళిక, అంకితభావం అభినందనీయం. ఇంజనీరింగ్, మెడికల్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రతిభావంతులను అందిస్తూ శ్రీచైతన్య విద్యాసంస్థలు ఓ మార్గదర్శక శక్తిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ బొప్పన మాట్లాడుతూ.. భారతీయ చెస్ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన గుకేష్ దొమ్మరాజును బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. చిన్న వయస్సులోనే గుకేష్ సాధించిన అసాధారణ విజయాలు పాఠశాల విద్యార్థుల నుండి జెఇఇ, నీట్ అభ్యర్థుల వరకు ప్రేరణగా నిలిచాయి. శ్రీచైతన్యలో, మేము విద్యార్థులను సమస్య పరిష్కారం, విశ్లేషణాత్మక నైపుణ్యాలతో అభివృద్ధి చేసేందుకు మేము అంకితభావంతో ఉన్నాము. గుకేష్ సామర్థ్యాలు, సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఒత్తిడి పరిస్థితుల్లో ప్రశాంతంగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయాన్ని సాధించడంలో విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటాయి. శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమా బొప్పన మాట్లాడుతూ.. "గుకేష్ దొమ్మరాజు శ్రీచైతన్య బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించటం గర్వకారణం. గుకేష్ ప్రేరణతో విద్యార్థులు మరింత దృఢంగా ముందుకు సాగుతారని మేము నమ్ముతున్నాం" అని తెలిపారు.

# సమకాలీన సమాజంలో ప్రజల పక్షం 'అల్లిక కవితా సంపుటి' : వక్తలు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన కవిత్వం సమస్యలపై కేవలం స్పందనకే పరిమితం కాకూడదని. స్థిరమైన,సంఘటితమైన ఆలోచనా విధానంతో జాగృతం కలిగించేదిగా ఉండాలని పలువురు వక్తలు అన్నారు. ప్రఖ్యాత సాహిత్య విమర్శకులు, కవయిత్రి చల్లపల్లి స్వరూపరాణి రచించిన పుస్తక పరిచయసభ జరిగింది.. ఇటీవలే అల్లిక పుస్తకావిష్కరణను ప్రముఖ కవి శిఖామణి చేసారు.అల్లికను పాఠకులకు వివరించేందుకు ప్రత్యేకంగా పరిచయ సభను నిర్వహించారు.ఈ సభలో వక్తలు మాట్లాడుతూ, వర్తమాన వ్యవస్థలో , ప్రస్తుత పరిస్థితులపై, అవసరమైనటువంటి కవిత్వం అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. అల్లిక కవిత్వ సంపుటిలో మొదటి కవిత నుంచి చివరి కవిత వరకు చదివేకొందిగా చదవాలనిపించే కవిత్వంఅని , కవిత్వం లో మంకెన పువ్వు నుంచి అల్లిక వరకు స్వరుపరాణి అక్షరాల ప్రవాహం తెలుగు సాహిత్యంలో ప్రత్యేక మైందని వక్తలు విశ్లేషించారు.సంఘటన , సమయానుకులన , చారిత్రక,వాస్తవ, ఫిలాసఫీ, తత్వశాస్త్రం వున్న కవిత్వం ఈ అల్లిక గా అభివర్ణించారు. . ఇది స్వరూప రాణి పై ఉన్న ,అపారమైన ప్రేమ, అక్షరంపై ఉన్ననమ్మకంతో , ఒక కమిట్మెంట్ పర్సన్ రాసిన కవిత్వం కాబట్టి , జనాలు కదలకుండా, వచ్చినవారు వెళ్లకుండా, సభలో ఉండి సభను విజయవంతం చేశారు. సుదూర ప్రాంతాల నుంచి చాలామంది వచ్చి ఈ సభలో ఉన్నారు అందరూ కూడా అల్లిక తో అల్లుకునిపోయారు అనేక ఆలోచనల రగిలించుకొని వెళ్లారు. కవులు , రచయితలు , మేధావులు ,పాఠకులు, జర్నలిస్టులు, ఉద్యమకారులు, ఇంకా అనేకమంది స్వరూపారాణి అక్షరాలను చదివి, వచ్చిన వారు ఎందరో ఉన్నారు. అందరితో చల్లపల్లి స్వరూప రాణి వుండే , మంచితనం ,కలివిడితనంతోనే ఎంతమంది అల్లిక సభలో కూర్చొని ఉన్నారు. చాంటింగ్ బై బుద్ధిష్ట్ మాంక్స్ తో సభ ప్రారంభమైంది. . సిక్కోలు బుక్ ట్రస్ట్ దుప్పల రవికుమార్ బరవే అధ్యక్షత వహించిన సభలో జి .లక్ష్మీనరసయ్య, షేక్ కరీముల్లా , గూడూరి సీతామాలక్ష్మి ,తంగిరాల సోనీ, పేరూరు మురళి కుమార్, నూకతోటి రవికుమార్, మల్లవర ప్రభాకర్ రావు, పెద్దిరాజు కోలాటి, నేలపురి రత్నాజీ , కూరాటీ భీమాకర్ స్పందనగా చల్లపల్లి స్వరూపారాణి మాటలు, ఎంతో ప్రేమతో కూడినవి. సభ ముగింపు వాక్యాలు చేసారు.

# లిక్కర్ స్కాం.. కానిస్టేబుల్ మదన్‌రెడ్డి ఆరోపణలపై సిట్ స్పష్టత

**విజయవాడ జూన్ 17 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ అధికారులు వేధిస్తున్నారంటూ గన్‌మెన్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి డీజీపీకి లేఖ రాసారు.తీవ్ర సంచలనం సృష్టించిన ఈ లేఖపై . సిట్ స్పందించింది. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తూ సిట్ అధికారులు మీడియాకు ప్రకటనను విడుదల చేశారు. చెవిరెడ్డి దగ్గర గన్‌మెన్ గా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మదన్ రెడ్డి పని చేశారని తెలిపారు. లిక్కర్ కేసులో తాము చెప్పినట్టు రాసి సంతకం చేయమని సిట్‌అధికారులు ఒత్తిడి చేశారని మదన్ రెడ్డి చెప్పడంలో నిజం లేదని స్పష్టం చేశారు. చెవిరెడ్డికి కేసుతో సంబంధం ఉందని చెప్పమన్నారని, తప్పుడు స్టేట్‌మెంట్ ఇవ్వమని బలవంతం చేశారనేది కూడా వాస్తవం కాదని సిట్ అధికారులు తేల్చిచెప్పారు. మద్యం కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. దర్యాప్తులో కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు తేలిందన్నారు. కేసిరెడ్డి నుంచి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు తేలిందన్నారు. ఈ నగదును ఎన్నికల సమయంలో ప్రజలకు పంచినట్లు తెలిసిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి పర్సనల్ గన్ మెన్‌గా చేసిన మదన్ రెడ్డిని విచారణకు పిలిచామన్నారు.

# విధాన స్పష్టత వచ్చేవరకు బదలీలు నిలిపివేయాలి

రాష్ట్ర డైరెక్ట్ రిక్రూటెడ్ విఆర్ఓ అసోసియేషన్

**విజయవాడ, జూన్ 17, ప్రభాతవార్త :** ప్రస్తుతం రేషనలైజేషన్ ద్వారా జరుగుతున్న బదిలీ ప్రక్రియపై తమకెలాంటి అభ్యంతరాలు లేవని, కానీ విఆర్ఓల విషయంలో అస్పష్టంగా, గందరగోళంగా వున్న పరిస్థితులవల్ల బదిలీ ప్రక్రియలను నిలిపేసి, రూల్స్ పై స్పష్టత వచ్చిన తరువాత చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ డైరెక్ట్ రిక్రూటెడ్ విఆర్వోస్ అసోసియేషన్ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ కి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. జిఎస్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్‌లో రెవెన్యూ శాఖకు చెందిన విఆర్వో గ్రేడ్1లను కొనసాగిస్తూ ద్యు ప్రొసీజర్ ఆఫ్ లాకు వ్యతిరేకంగా విధానాలు పాటిస్తూ మాకు జరుగుతున్న అన్యాయాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు విన్నవించామని ఆయన వెంటనే స్పందించి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. కానీ ఇప్పటివరకు ఈ అంశంపై ప్రభుత్వం నుండి సమాచారం రాలేదన్నారు ఇపుడు జిఎస్‌డబ్ల్యుఎస్ డిపార్ట్‌మెంట్ అధికారులు గ్రామవార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ జరుపుతున్నట్లు జిఓ 4, 5 లు ఇచ్చారని, ఎటువంటి స్పష్టత లేకుండా ఇచ్చిన ఈ జీవోలలో తమకెంతో అన్యాయం జరుగుతుందన్నారు.

# ఉద్యోగ సంఘాలు సామాజిక బాధ్యత వహించాలి

- ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా



ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనాను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగాలు సంఘాలు కేవలం యూనియన్ సంబంధిత అంశాలకే పరిమితం కాకుండా సామాజిక అభివృద్ధిలో కూడా తమ వంతు పాత్రను పోషించాల్సిన అవసరం ఉందని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా అన్నారు. సంఘాలు నైతిక నాయకత్వం, పారదర్శకత, ప్రజాసేవ విలువలపై దృష్టి సారిస్తూ, తమ సభ్యుల హితాన్ని కాపాడేలా వ్యవహరించాలన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులతో మీనా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సంఘం తరఫున మీనాకు సత్కారం నిర్వహించి, శాఖాభివృద్ధికి ఆయన అందిస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.విజయవాడలో జరిగిన ఎన్నికల ద్వారా డాక్టర్ ఆర్.ఎస్. కుమారేశ్వరన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## జాతీయ బిసిసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మయూరి శ్యామ్ యాదవ్



**గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త** జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరు పట్టణానికి చెందిన డాక్టర్ బండి శ్యాంసుందర్ రావు (మయూరి శ్యామ్ యాదవ్)ను నియమించారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజ యాదవ్, రాష్ట్ర నేతలు రాయి రమణయ్య, డాక్టరు గుండాల సురేంద్ర, రజిని, పద్మమ్మ, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగరంలో మరో హత్య

**నెల్లూరు క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త :** నగరంలో హత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కారణాలు ఏవైనా ఏదో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఏదో ఒక సందర్భంలో నెలలో ఒకటి రెండు సార్లు హత్య సంఘటనలు చోటు చేసుకుంటూ ఉండడం నగరవాసులను కలవరానికి గురిచేస్తుంది. తాజాగా నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తిని అతని తోటి స్నేహితులు హత్య చేయడమే కాకుండా తామే హత్య చేశామని ఇంట్లో ఉన్న శవాన్ని తీసుకెళ్లాలంటూ హతుని బంధువులకు సమాచారం ఇవ్వడం విశేషం. ఈ సంఘటన సంబంధించి పోలీసుల కథనం మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జైహింద్ సహానీ (40) స్థానిక నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాస నగర్ లో నివాసముంటూ ఇంటీరియర్ పనులు చేస్తుంటాడు. అతనితో పాటు అదే రాష్ట్రానికి చెందిన పరదేశి గౌతమ్, రామ్ కేసరిలు కూడా ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చి ముగ్గురు ఒకే గదిలో ఉంటూ పనులు చేసుకుంటూ ఉన్నారు. ఈ క్రమంలో వీరి ముగ్గురు మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో జైహింద్ పై కక్ష పెంచుకున్న మిగతా ఇద్దరు అతనిని అంతమొందించాలని నిర్ణయించి, సోమవారం రాత్రి పొద్దు పోయాక జైహింద్ తో గొడవపడి అతనిపై రోకలి, ఇనుప రాడ్తో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. రక్తస్రావానికి గురైన జైహింద్ అక్కడికక్కడే మరణించాడు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయిన నిందితులు ఇద్దరు సమీపంలో నివాసం ఉంటున్న జైహింద్ బంధువులకు సమాచారం ఇచ్చి,

తామే హత్య చేశామని, ఇంట్లో శవం ఉందని చెప్పడంతో బై కంప్లీతులైన జై హింద్ బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా జైహింద్ విగతజీవిగా కనిపించాడు. వెంటనే నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు.

# యూపిఎస్ పెన్షన్ పథకంపై గుత్తిలో సెమినార్

**గుంతకల్లు రైల్వే, జూన్ 17,ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న యూపిఎస్ పెన్షన్ పథకంపై కార్మికుల్లో అవగాహన కల్పించేందుకు గుత్తి రైల్వే ఇన్స్‌టిట్యూట్‌లో బుధవారం ప్రత్యేక సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమలులో ఉన్న నేషనల్ పెన్షన్ పథకం(ఎన్‌పిఎస్) పట్ల కార్మికుల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం మార్పులు చేర్పులతో గత ఏడాది ఆగస్టులో ఏకీకృత పెన్షన్ పథకాన్ని (యూపిఎస్) ప్రవేశపెట్టింది. ఈ పథకంలో చేయాలనుకునే ఔత్సాహిక కార్మికులకు అవగాహన కల్పించేందుకు డిపిఓ కో-ఆర్డినేషన్ హెచ్‌ఎల్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏపిఓ శైలజా సుధాకర్‌లు గుత్తి రైల్వే ఇన్స్‌టిట్యూట్‌లో బుధవారం నిర్వహించే సదస్సులో కార్మికులు పాల్గొని తమ తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా యూపిఎస్ పథకంలో చేరాలనుకునే రైల్వే సిబ్బంది తమ ఆప్షన్స్ ఫారాలను ఈ నెల 30వతేదీలోగా తాము పనిచేస్తున్న కార్యాలయాల్లో అందచేయాల్సి ఉంటుంది.

## తిరుపతిలో పాతచాళుక్యలాడ్జి దక్కించుకునేందుకు కూటమి నేతల పథకం? - నేడు కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

**తిరుపతి,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ యాత్రాస్థలం, స్మార్ట్‌సిటీ తిరుపతినగరంలో నగరపాలకసంస్థకు ఆదాయవనరుగా ఉన్న 924 అంకణాలు 138కోట్లు రూపాయలు విలువైన స్థలం. ఈ స్థలాన్ని తక్కువ ధరకు తమవారికి అప్పనంగా కట్టబెట్టేందుకు కూటమిపెద్దలు వ్యూహాత్మకంగా కథనడిపించారనేది తిరుపతిలో సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంతజిల్లాలో...ఆయనకు బాగా పరిచయం,గుర్తుఉన్న వందలకోట్ల రూపాయలు ఈ ఖరీదైన స్థలాన్ని కేవలం 5.54కోట్ల రూపాయలకే తక్కువ ధరకు పాతచాళుక్య భవనాన్ని కూటమినేతలు తమవారికి కట్టబెట్టేందుకు పావులు కదిపేశారు. ఈ స్థలం తిరుపతిలో అటు ఆర్టీసి బస్టాండుకు,

ఇటు రైల్వేస్టేషన్‌కు మధ్యప్రాంతంలోని మున్సిపల్ కార్పొరేషన్ స్థలం. బుధవారం ఉదయం జరిగే నగరపాలక కౌన్సిల్ సమావేశంలో దీన్ని విక్రయించేందుకు అన్ని సిద్ధం చేసుకున్నారనేది తిరుపతివాసుల్లో చర్చ మొదలైంది. ఈ స్థలాన్ని తక్కువ ధరకు మార్కెట్‌విలువ కంటే తక్కువకు తమవారికి కూటమి పార్టీల నేతలు ఎవరి హావాచేసి ఫైల్‌కు ముగింపుపలుకుతారనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.

# వైఎస్సార్సీ ఎంపి మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ విచారణ నేటికి వాయిదా

**విజయవాడ,జూన్17,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిదాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు మంగళవారం విచారణ జరిపింది.ఈ కేసులో వాదోపదాల కొనసాగాయి.అయితే ఈ కేసులో పూర్తి స్థాయి వాదనలు వినిపించేందుకు హైకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో మిథున్‌రెడ్డి అత్యంత కీలకమని సీఐడీ తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో వాదనలు వినిపించారు. మద్యం కుంభకోణం కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సాగింది. మద్యం విధానం రూపకల్పన, దానిని అమలు చేయడం, ముడుపులు చెల్లించిన కంపెనీలకే మద్యం ఆర్డర్లు ఇవ్వడంలో ఆయన పాత్ర కీలకం అని దర్యాప్తులో తేలిందని అన్నారు. ముడుపుల ద్వారా వచ్చిన సొమ్ము నకిలీ సంస్థలకు మళ్లించడంలో మిథున్‌రెడ్డి కీలకపాత్ర వహించారని తెలిపారు. ముడుపుల వ్యవహారం బయటకు: ముడుపులు రూపేణా డీకార్ట్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన బ్యాంక్ ఖాతాలో రూ.5 కోట్లు జమయ్యాయని లూథ్రా కోర్టుకు తెలిపారు. పీఎల్ ఆర్ ప్రాజెక్ట్ మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిందే అయినా తనకు సంబంధం లేదని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసిందని అన్నారు.



మంగళవారం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

# ప్రజావాణికి 272 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 17,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 272దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 51దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 74దరఖాస్తులు ,ఇందిరమ్మ ఇండ్ల కోసం 28దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 24 దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణీకి 2దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 93దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఎస్సీ గురుకులాల్లో ముగిసిన అడ్మిషన్లు

## 5 నుంచి 9వ తరగతి వరకు పూర్తి

## సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి

**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్‌సి డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్‌సి గురుకులాల్లోని స్కూల్స్‌లో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయినట్టు సొసైటీ కార్యదర్శి డాక్టర్ వీఎస్ అలుగు వర్షిణి తెలిపారు. ఎస్‌సి గురుకులాల్లోని 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఇప్పటికే నిర్వహించిన ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు వారు సాధించిన మార్కులను బట్టి, కులం, ఆయా జిల్లాలోని గురుకులాల్లో ఖాళీలను బట్టి వారికి సీట్లను కేటాయించడం జరిగిందని గురుకుల కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 5 నుండి 9వ తరగతి వరకు అన్నితరగతులకు 100శాతం పూర్తిగా భర్తీ అయ్యాయని ప్రకటనలో వెల్లడించారు. అడ్మిషన్లలో ఇంకా ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆయా జిల్లాలోని జోనల్ అధికారులను సంప్రదించాలని సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు.

# ఆహారంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి

## టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు

## రెస్టారెంట్‌ను పరిశీలించి, పర్యాటకులతో మాట్లాడిన మంత్రి

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యతాప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాహోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ. ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు,అతిధులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు.అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు.ప్రభుత్వ ఆదాయం పెంచడంతోపాటు పర్యాటకులు, అతిధుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు.

# కులగణన చేపట్టకపోతే రోడ్లపైకి వచ్చి యుద్ధమే

## మాజీ పిసిసి చీఫ్ వి.హనుమంతరావు



**హైదరాబాద్,జూన్ 17,ప్రభాతవార్త:** జనాభాగణన కోసం కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వులలో కులగణ అంశం పేర్కొనలేదని ఒక వేళ కులగణన చేపట్టకపోతే కులగణన చేయాలని రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని మాజీ పిసిసి చీఫ్,మాజీ రాజ్యసభ సభ్యుడు విహనుమంతరావు హెచ్చరించారు. గాంధీ భవన్‌లో వీహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణన అంటుదే, కానీ కుల గణన ప్రస్తావన చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగణనతో మాకేం లాభం ఉండదని వనరులపై మాకు మా వాటా దామాషా పద్ధతిలో అందాలంటే కులగణన చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. అగ్రకులంలో ఉన్న రాహుల్, రేవంత్ బిసి కోసం ఆలోచిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. బిసి అని చెప్పుకునే నరేంద్ర మోడీ బిసి కోసం ఆలోచించడం లేదు అని అన్నారు. జనగణన వల్ల బిజెపికి లాభం తప్పా బిసిలకు లాభం లేదు అని ఆయన అభిప్రాయ పడ్డారు. కులగణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన కోరారు.

# భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

## జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం



మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటిని కలిసిన కొత్తగా నియమితులైన కలెక్టర్లు

**హైదరాబాద్ జూన్17,ప్రభాతవార్త:** తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమని గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతిగ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, భూ భారతి చట్టంతో ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు.కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ప్రావీణ్య, సిద్దిపేటకలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి,స్టాంప్స్ రిజిస్ట్రేషన్ స్పెషల్‌సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ మంగళవారం సచివాలయంలో రెవెన్యూశాఖ మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు,బాధలకు విముక్తి కల్పించేలా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వచ్చే 2 నెలలు రెవెన్యూశాఖకు అత్యంత కీలకమైనవని భూ సమస్యల పరిష్కారానికి గడువుగా నిర్ణయించిన ఆగస్టు 15నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పని చేయాలని సూచించారు.

# గ్రామ స్థాయి నుంచి బిసిలు ఉద్యమించాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపు



**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 17 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేంతవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రిజర్వేషన్‌లపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై గ్రామ స్థాయి నుంచి రాజధాని నగరం వరకు బిసిలను చైతన్యవంతం చేస్తామని ఆయన తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిసి రిజర్వేషన్‌లు పెంచడానికి ప్రభుత్వానికిగల ఇబ్బందులు ఏమిటి?, వాటిని అధికమించడానికి ఏమి చర్యలు తీసుకోవాలని, దీనికి అన్ని పార్టీల మద్దతు ఏలా కూడాగట్టాలి? అనే అంశాలపై ప్రభుత్వం ఏనాడైన ఆలోచించిందా!, ఆదిశగా ప్రభుత్వం ఏమైన చర్యతీసుకుందా ?అని ప్రశ్నించారు. గతంలో బిసిలకు రిజర్వేషన్‌లు ఎన్టీఆర్, విజయభాస్కర్‌రెడ్డి పెంచారని, వారికి మంచి పేరు వచ్చిందని, ఇప్పుడు కూడా ప్రభుత్వం పెంచితే సిఎం రేవంత్‌రెడ్డికే మంచి పేరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహనరావు, బిసి నేతలు అనంతయ్య, జిల్లపల్లి అంజీ, వేముల రామకృష్ణ, పగిళ్ళ సతీష్, రాందేవ్, కార్మిక నేత చిక్కుడు బాలయ్యముదిరాజ్, కె.సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం లక్ష కోట్లకు పైగా వ్యయం

## 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలు జమ

## చొప్పదండి, పరిగి శాసనసభ్యులు, మేడిపల్లి సత్యం, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి





**హైదరాబాద్,జూన్17,ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన 18నెలల కాలంలో వ్యవసాయదారుల సంక్షేమం అభివృద్ధి కోసం లక్షల కోట్లరూ పాయలు వ్యయం చేశామని రైతును అప్పుల ఉబిలో నుంచి గట్టెక్కించేందుకు 20 వేల 616 కోట్ల రుణమాఫీ చేశామని చొప్పదండి,పరిగి శాసనసభ్యులు మేడిపల్లిసత్యం, డాక్టర్ రామ్మోహన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలోని సిఎల్పీ మీడియా సెంటర్‌లో ఇరువురు శాసనసభ్యులు మాట్లాడుతూ రైతు భరోసా పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొప్ప నిర్ణయం తీసుకున్నారనీ,కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపా యలు రైతు ఖాతాల్లో వేయడం సాహసోపేతమైన చర్య అని అభివర్ణించారు. చరణ్ సింగ్‌ను ఛాంపియన్ ఆఫ్ ది ఫార్మర్స్ అన్నట్లుగానే తెలంగాణ పునర్నిర్మాణ నేత రేవంత్ రెడ్డి ఛాంపియన్ ఆఫ్ తెలంగాణ ఫార్మర్స్ అయ్యారని వారు కొనియాడారు.దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చర్యలు రైతుల సంక్షేమం కోసం అమలు చేశారని వారు చెప్పారు. లక్ష రూపాయల రుణమాఫీ కూడా సరిగా చేయలేక ఆనాటి కెసిఆర్ ప్రభుత్వం చతికిలపడిపోయిందని వారు చేసిన అరకొర రుణమాఫీ వడ్డీకే సరిపోయిందని ఎద్దేవా చేశారు. రైతులకు బేడీలు వేసిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని వారు చరిత్రను గుర్తుచేసుకున్నారు. మా ముఖ్యమంత్రి రైతన్నలకు అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా తో ప్రతిపక్ష నాయకులకు నిద్ర లేకుండా పోయిందనీ ప్రతిపక్ష నేతల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయిందని అన్నారు. ఒక నాయకుడు జ్వరంతో ఆస్పత్రిలో చేరారని అపహాస్యం చేశారు. మా ప్రభుత్వాన్ని కొందరు శాపనార్థాలు పెడుతున్నారనీ,రైతులపట్ల మా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపక్షాలు ఆహ్వానించాలని కోరారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి కెసిఆర్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. దేశంలోనే తెలంగాణ రైతులు తలెత్తుకునేలా మా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని 25 లక్షల మంది కి పైగా రైతులకు రైతు భరోసా కింద ఇప్పటివరకు 12,682 కోట్ల చెల్లించామని గణాంకాలతో వివరించారు. ఈ సారి రైతు భరోసా కింద 8,675 కోట్లు చెల్లించబోతున్నామని అన్నారు. ఉచిత విద్యుత్ కోసం16,691 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నాల బోనస్ కోసం43,835 కోట్లు ఖర్చుచేశామని తెలిపారు. రైతు బీమా కోసం.2,181 కోట్లు, పంట నష్టపరిహారం కోసం 260 కోట్లు చెల్లించామని మేడిపల్లి సత్యం, రామ్మోహన్‌రెడ్డి గణాంకాలతో వివరించారు. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని నిరుపేదలకు నిలువ నీడ కల్పించిన ఘనత మా కాంగ్రెస్‌దే అని వారు అన్నారు.మరో విడతఇందిరమ్మ ఇళ్లుత్వరలోనే మంజూరు చేస్తాం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మిస్తానని గతంలో కెసిఆర్ మభ్యపెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. పేదలకు కరెంటు బిల్లు లేదు, సన్న బియ్యం ఇస్తున్నాం,రేవంత్ రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు చూసి తెలంగాణలో కలుస్తామని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు అడుగుతున్నారని ఎమ్మెల్యే లిద్దరు చెప్పుకున్నారు. కెసిఆర్ కుటుంబం సముద్రంలో మునిగిపోయే నావ లాంటిదని ప్రజలు నమ్మడం లేదని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా బిఆర్ ఎస్ నాయకులు అనేక విధాలుగా కుట్ర చేస్తున్నారని అందువల్లే రాబడి తగ్గిందని ఆవేదన వ్యక్తంచేశారు.

# హత్యాకాండను తక్షణమే ఆపాలి

## మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలి

## శాంతి చర్చల కమిటీ నేతల డిమాండ్




మంగళవారం మహాధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), జూన్ 17, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపాలని శాంతి చర్చల కమిటీ, తెలంగాణ రాష్ట్రం నేతలతో పాటు వివిధ పార్టీల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకార్యక్రమంకు సిపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, టీజేఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, ప్రముఖ సినీ నటులు ఆర్.నారాయణమూర్తి,అరుణోదయ నాయకురాలు విమలక్క, ప్రొఫెసర్ హరగోపాల్, కందిమళ్ల ప్రతాపరెడ్డి, పశ్య పద్మ, రమ, మల్లు లక్ష్మి, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, కే.గోవర్ధన్, ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో 2024 జనవరి నుండి మావోయిస్టులను అణిచివేసే పేరిట ప్రారంభించిన హత్యాకాండలో ఇప్పటి వరకు దాదాపు ఐదు వందల మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో రాజ్యాంగం, చట్టాలలో పేర్కొన్న ఆదివాసుల హక్కులను కాలరాయటమే కాకుండా, అక్కడ ఉన్న ప్రకృతి వనరులు, ఖనిజ సంపదను స్వదేశీ, విదేశీ కార్పోరేట్లకు ధారాదత్తం చేయటమే లక్ష్యంగాఈ హత్యాకాండ కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వమే హత్యలకు పాల్పడటం, గిరిజన బిడ్డలను పొట్టనపెట్టుకోవటం దారుణమన్నారు. నక్సల్ సమస్య సామాజిక అసమానత సమస్య కాబట్టి, శాంతి చర్చల ద్వారానే పరిష్కారం అవుతుందని అభిప్రాయపడ్డారు. టెర్రరిస్టులను ప్రోత్సహించిన పాకిస్తాన్‌తో శాంతి చర్చలు జరిపిన మోదీ ప్రభుత్వం ప్రజల కొరకు పనిచేస్తున్న మావోయిస్టులతో చర్చలు జరిపి శాంతియుత వాతావరణం కొరకు కృషి చేయకపోవటం రాజ్యాంగానికి వ్యతిరేకమని ఆరోపించారు. ఆదివాసీలతో సహా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను ఆపి, కాల్పుల విరమణను ప్రకటించి, మావోయిస్టు పార్టీతో భేషరతుగా శాంతిచర్చలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ మహాధర్నా లో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే ప్రతిపాదన విరమించాలి

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 17 ప్రభాతవార్త:** ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భారీ ధర్నా భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించడంతో పాటు అనుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన భారీ ధర్నాలో సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వము ఆలోచన చేయడం బాధాకరమని అన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా భీమా రంగానికి అప్పజెప్పడం ఎంతవరకు సమంజసమో పునరాలోచించాలన్నారు. రాష్ట్రంలో 15 లక్షాకుపైగా మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదైనారని, బోర్డు ద్వారా చెల్లిస్తున్నటువంటి డబ్బులు కార్మికశాఖ చేతులు దులుపుకొని బీమా కంపెనీకి అప్పజెప్పడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు పెన్షన్ అమలు చేయాలని, ఇన్సూరెన్స్ రంగానికి ఇచ్చే టెండర్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటియూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ బాలరాజ్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన గుట్టు చప్పుడు కాకుండా సంక్షేమ బోర్డు వారు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని, ఇన్సురేన్స్ కంపెనీకి అప్పజెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు వెల్లడించాలని, సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కార్మికులకు నిధులు మంజూరు చేయకుండా జాప్యం చేస్తూ నేడు బీమా కంపెనీ లకు అప్పచెప్పటం విచారకరమన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మోటె నరసింహ , వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షులు ఏం ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి రాజు నూనె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు నెలవారీ లక్ష్యాలు పెట్టుకుని పనిచేయాలి

## పంచాయతీరాజ్ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** అధికారులు నెలవారీగా లక్ష్యాలు పెట్టుకుని పని చేయాలని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆమె పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ సమీక్ష సమావేశంలో శాఖల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని, అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాలను,హామ్ విధానంలో రోడ్ల నిర్మాణం, ఇందిరా మహిళా శక్తి, స్త్రీ నిధి, మిషన్ భగీరథ,ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎన్.శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు. అనం తరం మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అత్యంత కీలకమైన శాఖ, రెండున్నర కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శాఖలోపని చేసిన అధికారులు పదోన్నతులు పొందారని ఆమె గుర్తు చేశారు. పంచాయితీరాజ్‌శాఖలో మంత్రి, ఉద్యోగులు వేరు వేరుగా చూడలేదు.మంత్రి నుంచి మల్టీపర్పస్ వర్కర్ వరకు అందరూ ఒక కుటుంబంగా పనిచేసి గ్రామాలను అభివృద్ధి పరచాలన్నారు. వరంగల్ కలెక్టర్‌గా సింగరేణి సిఎండిగా నా నియోజకవర్గ అభివృద్ధికి శ్రీధర్ ఎంతగానో సహకరించారని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.మేము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో ఉద్యోగ సమస్యలను పరిష్కరిం చాము.93 వేల గ్రామస్థాయి ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నా మని,ఎంపీడీవోల బదిలీల ఫైలు సీఎం వద్ద ఉందన్నారు. ఎంపీడీవోలకు వాహనాల అలవెన్స్ ఫైల్ ఆర్థిక శాఖవద్దకు చేరిందని, ఈ రెండు ఫైళ్ళకు కొద్ది రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. ఎంతోకాలంగా గ్రౌండింగ్ కానీ పనులను రద్దు చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ బిజెపిలో అంతర్గతపోరు

## కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై రాజాసింగ్ రియాక్షన్

## ఆ విషయంలో ఎక్కడికైనా, ఎప్పుడైనా రావడానికి సిద్ధం!



**హైదరాబాద్, జూన్ 17, ప్రభాతవార్త:** తెలంగాణ బీజేపీలో అంతర్గత పోరు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే రాజాసింగ్ "సీనియర్ నాయకుడు"అని, తనను "సామాన్య కార్యకర్తను" అని పేర్కొనడమే కాకుండా, రాజాసింగ్ చెప్పినట్లు తాము పాటిస్తామని రాష్ట్ర కమలం పార్టీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతుంది. దీంతో కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత విభేదాలను విడిచి పెట్టి, ఐక్యంగా లక్ష్య సాధన కోసం పని చేద్దామని కోరారు. మీరు ఎప్పుడు కలిస్తానని చెప్పిన అప్పుడు వచ్చి కలుస్తానన్నారు. పార్టీలోని ప్రతి ఒక్కరూ బాగుండాలని, తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అధికారం లోకి రావాలనేది నా ఉద్దేశ్యం, వ్యక్తిగత లబ్ధి, పదవుల కోసం తాను ఎప్పుడూ పని చేయలేదని రాజాసింగ్ వెల్లడించారు. అయితే, పార్టీని బలోపేతం చేయడం కోసం అంకితభావంతో పని చేశాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. తెలంగాణలోని మొత్తం 119 నియోజకవర్గాలలో బీజేపీ విజయం సాధించడంపై దృష్టి పెట్టడానికి బదులుగా, పార్టీకి నిస్వార్థ సేవ చేసినప్పటికీ, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని, అడ్డంకులు సృష్టించడం జరుగుతోంది అని పేర్కొన్నారు. ఒక పార్టీ కార్యకర్తను ఇబ్బంది పెడితే ఏం లాభం? ఇది పార్టీకి ఏమైనా ఉపయోగపడుతుందా? అని ప్రశ్నించారు. తాను ఎప్పుడూ పార్టీకి అనుకూలంగా నిలబడ్డాను.ఈ రోజు కూడా నా కోసం కాకుండా, పార్టీ ఐక్యత కోసమే పని చేస్తున్నాను, లక్షలాది మంది కార్యకర్తల మనోబలాన్ని కాపాడుకోవడం కోసం మాట్లాడు తున్నాను అని చెప్పుకొచ్చారు. కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నాను..కొంచెం సమయం కేటాయించండి వ్యక్తిగతంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకుందాం అన్నారు. కిషన్‌రెడ్డి ఎక్కడికి, ఎప్పుడు అనేది నిర్ణయిస్తే తాము రావడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. తాను పార్టీని విభజించడానికి కాదు. ఐక్యంగా ఉండటానికి ఇక్కడ ఉన్నాను అని ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పుకొచ్చారు.



# మోడీ పాలనతో రెండింతల అభివృద్ధి

## నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** దేశంలో నరేంద్ర మోడీ 11 సంవత్సరాల పాలనలో అన్ని రంగాల్లో రెండింతలు అభివృద్ధి కనిపిస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జీరో బ్యాలెన్స్‌తో ప్రారంభించిన జన్‌ధన్ యోజనపై అప్పట్లో ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. కానీ ఈరోజు కోట్లాది అకౌంట్లు ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు సుమారు 6 లక్షల కోట్ల రూపాయలు డిపాజిట్ అయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో పేదలకు 4 కోట్ల ఇండ్లు నిర్మించింది. రాబోయే 5 సంవత్సరాల్లో మరో 3 కోట్ల ఇండ్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆ పనులు ప్రారంభమయ్యాయని, పిఎం ఉజ్వల యోజన కింద గ్రామీణ మహిళలకు లక్షలాది ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చిందన్నారు. కోవిడ్ టైంలో ప్రారంభమైన ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా 5 కిలోల ఉచిత బియ్యం పథకం కొనసాగుతుందన్నారు.

# వికసిత సంకల్ప సభల కోసం బిజెపి కార్యాచరణ

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** తెలంగాణలో వికసిత్ సంకల్ప సభలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక విడు దల చేసిన ప్రకటన విడుదల చేశారు. బిజెపి రాష్ట్ర స్థాయి నేతలు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు నియోజకవర్గాల లో మం డలం, పట్టణ ప్రాంతాల్లో పాల్గొంటారని తెలి పారు. ఈ సభల ద్వారా నరేంద్ర మోడీ ప్రభు త్వం ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి కార్యక్ర మాలు, సాధించిన విజయాలు గ్రామీణ స్థాయిలో ప్రజలకు చేరవేయడం లక్ష్యమన్నారు.

# వాగ్ధానాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన

## బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 17 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అన్ని వర్గాలకు సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా పాలన కొనసాగిస్తుందని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ అన్నారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన నిర్వాహక వైఫల్యాల దృష్ట్యా ప్రజలు కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారు. గత ఎన్నికల సమయంలో బిసి, ఎస్సీ, యువ డిక్లరేషన్‌ల పేరుతో ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక పాలనలో నిరక్ష్యం స్పష్టంగా కనిపి స్తుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి మాట వినడం లేదని ఐఏఎస్ అధికారులపై లీకులు ఇచ్చే స్థితికి దిగజారడం దురదృష్టకరమన్నారు.. సిఎంఓ ఆదేశాలకే అధికారులు స్పందించక పోతున్నారన్న ఆరోపణలు వినపడుతు న్నాయ న్నారు. ప్రభుత్వ వైఫల్యాల బాధ్యతను ఉద్యోగు లపై నెట్టడం అనాగరికపు చర్య అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలనను గాలికి వదిలిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది.రిటైర్డ్ ఉద్యోగులకు పిఎఫ్, పెన్షన్, ఇతర బెనిఫిట్లు ఇవ్వలేమన్న మాటలు ముఖ్యమంత్రి నోటివెంట రావడం దురదృష్టకరం అన్నారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అమలు చేయకుండా అడ్డుకోవడం దుర్మార్గం. ప్రజలకు ఇచ్చిన హామీలఅమలు బాధ్యత సిఎంపై ఉందని, ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రతి హామీని

18-6pg10exBVWKH.qxd:18-6pg10exBVWKH.qxd 01/01/01 6:49 AM Page 1



# డబ్ల్యూటీసి గెలవకున్నా.. నంబర్ వన్‌లో ఆస్ట్రేలియా

## నాలుగుకి పడిపోయిన ఇండియా

## లేటెస్ట్ ర్యాంకింగ్స్‌లో షాకింగ్





**న్యూఢిల్లీ:** 2025 వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో (డబ్ల్యూటీసీ) దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. కానీ లేటెస్ట్ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మాత్రం ఆ జట్టు నెంబర్ వన్ స్థానానికి చేరుకోలేకపోయింది. అదే సమయంలో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి చెందిన ఆస్ట్రేలియా నెంబర్ వన్‌గా నిలిచింది. త్వరలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ప్రారంభం కానుంది, దీనికి ముందు టెస్ట్ ఫార్మాట్‌లో తాజా ర్యాంకింగ్‌లను ఐసీసీ విడుదల చేసింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025 రన్నరప్ ఆస్ట్రేలియా ప్రస్తుతం టెస్ట్ ర్యాంకింగ్‌లలో మొదటి స్థానంలో ఉంది, ప్రస్తుతం ఆ జట్టుకు 123 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2025 ఛాంపియన్ దక్షిణాఫ్రికాకు ర్యాంకింగ్‌లలో ప్రయోజనం చేకూరింది, ఇది రెండో స్థానానికి చేరుకుంది, ఇప్పుడు ఆ జట్టు 114 పాయింట్లతో ఉంది. ఇంగ్లాండ్ 113 రేటింగ్ పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. కొన్ని నెలల క్రితం వరకు భారత జట్టు టెస్ట్ ర్యాంకింగ్‌లలో అగ్రస్థానంలో ఉంది, అయితే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో వరుస సిరీస్‌లలో ఓడిపోవడంతో నాల్గో స్థానానికి పడిపోయింది, ప్రస్తుతం 105 పాయింట్లు ఉన్నాయి. డబ్ల్యూటీసీ 2021 విజేత న్యూజిలాండ్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. పాకిస్తాన్ ఏడో, వెస్టిండీస్ ఎనిమిదో, బంగ్లాదేశ్ తొమ్మిదో, ఐర్లాండ్ పదో స్థానంలో ఉన్నాయి. భారత్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్ ఇంగ్లాండ్‌తో సిరీస్‌తో ప్రారంభం కానుంది. భారత జట్టు ఈ ఏడాదిలో ఇంగ్లాండ్, వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్‌లు ఆడనుంది. అయితే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కోసం జట్లు ఐసీసీ ర్యాంకింగ్‌ల ఆధారంగా అర్హత సాధిస్తాయి. ప్రస్తుత ర్యాంకింగ్‌ల ఆధారంగా, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, శ్రీలంక, వెస్టిండీస్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ డబ్ల్యూటీసీ 2025-27కి అర్హత సాధించాయి. వన్డే, టీ20లలో జట్టు ర్యాంకింగ్‌ల గురించి మాట్లాడితే, భారత్ ఇప్పటికీ ఈ రెండు ఫార్మాట్‌లలో నంబర్1 జట్టుగా కొనసాగుతోంది.

# ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో నం.1 స్మృతి

## 15, 16 స్థానాల్లో రోడ్రిక్స్, హర్మన్‌ప్రీత్





**న్యూఢిల్లీ:** భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసిసి మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్ 1 స్థానానికి ఎగబాకింది, దాదాపు ఆరు సంవత్సరాల విరామం తర్వాత కెరీర్‌లో ఇది ఒక ప్రధాన మైలురాయిగా నిలిచింది. 727 రేటింగ్ పాయింట్లతో, స్మృతి ఒక స్థానం మెరుగుపరుచుకుని, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్ట్, ఇంగ్లాండ్ కెప్టెన్ నటాలీ స్కైవర్ బ్రంట్‌లను అధిగమించింది. ఇద్దరూ ఇప్పుడు 719 పాయింట్లతో సమానంగా ఉన్నారు. 2019 తర్వాత భారత ఓపెనర్ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండటం ఇదే మొదటిసారి. ముఖ్యంగా కొలంబోలో శ్రీలంక మరియు దక్షిణాఫ్రికాతో జరిగిన భారత్ ముక్కోణపు సిరీస్ ఫైనల్‌లో స్మృతి సెంచరీ చేసింది. ఆమె కెరీర్‌లో 11వ వన్డే సెంచరీ అయిన ఆ ఇన్నింగ్స్ ఆమెను ర్యాంకింగ్స్‌లో తన సన్నిహిత ప్రత్యర్థులను అధిగమించేలలా చేసింది. టాప్ 10లో నిలకడగా స్థానం సంపాదించినప్పటికీ, ఈ టాప్‌కి తిరిగి రావడం చాలా కాలం నిరీక్షణకు ముగింపు పలికింది. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఇతర భారత క్రీడాకారిణులు జెమిమా రోడ్రిగ్స్ 15వ స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 16వ స్థానంలో ఉన్నారు, దక్షిణాఫ్రికాకు చెందిన టాజ్మిన్ బ్రిట్స్ ఐదు స్థానాలు ఎగబాకి 27వ స్థానానికి చేరుకోగా, ఆమె సహచరురాలు మరియు మాజీ కెప్టెన్ సునే లూస్ ఏడు స్థానాలు ఎగబాకి 42వ స్థానానికి చేరుకుంది. వెస్టిండీస్ జట్టులో షెమైన్ కాంప్‌బెల్ 62వ స్థానానికి, ఓపెనర్ కియానా జోసెఫ్ 67వ స్థానానికి చేరుకుంది. కాగా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో, కేప్ హిల్‌లో దక్షిణాఫ్రికాపై నాలుగు వికెట్లు తీసిన అఫీ ఫ్లెచర్ నాలుగు స్థానాలు ఎగబాకి 19వ స్థానానికి చేరుకుంది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ నాన్కులులెకో మ్లాబా బౌలర్ల జాబితాలో ఆరు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి చేరుకోగా, క్లోయ్ ట్రయాన్ కూడా ఆరు స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి చేరుకుంది. మ్లాబా 11 స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకుంది.

# చరిత్రనే మార్చిన టి20 ట్రై సిరీస్

## తొలిసారి మూడో సూపర్ ఓవర్

## నేపాల్‌పై నెదర్లాండ్స్ ఉత్కంఠ విజయం



**న్యూఢిల్లీ:** నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ చరిత్రను మార్చివేసింది. ఈ మ్యాచ్‌లో, రెండు జట్ల మధ్య 3-3 సూపర్ ఓవర్లు ఆడబడ్డాయి. నెదర్లాండ్స్ మరియు నేపాల్ మధ్య జరిగిన స్కాట్లాండ్ టీ20 ట్రై సిరీస్‌లో తొలిసారి మూడు సూపర్ ఓవర్ల తర్వాత విజేతను ప్రకటించారు. గ్లాస్గోలో జరిగిన ఈ ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ నేపాల్‌ను ఓడించింది. రెండు జట్లు 20 ఓవర్లలో 152 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. ఆ తర్వాత సూపర్ ఓవర్‌లో కూడా విషయం టైగా ముగిసింది. చివరికి, నెదర్లాండ్స్ మూడవ సూపర్ ఓవర్‌లో గెలిచింది. జాక్ లియాన్‌కాషెట్ అద్భుతంగా బౌలింగ్ చేసి నెదర్లాండ్స్‌ను చిరస్మరణీయ విజయానికి నడిపించారు. చివరి సూపర్ ఓవర్‌లో అతను ఒక్క పరుగులూ ఇవ్వకుండా రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్ స్కాట్లాండ్ టీ20 ట్రైసిరీస్‌లో రెండవ మ్యాచ్. నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. ఇక నేపాల్ 8 వికెట్లకు 152 పరుగులు చేయడంతో స్కోరు టై అయింది. మొదటి సూపర్ ఓవర్ లో నేపాల్ 19 పరుగులు చేసింది. కుశాల్ భుర్టెల్ 5 బంతుల్లో 18 పరుగులు చేశాడు. కానీ నెదర్లాండ్స్ కూడా సులభంగా 19 పరుగులు చేసింది. మాక్స్ ఓఖిడౌడ్ కేవలం 3 బంతుల్లో 12 పరుగులు, లెవిట్ 6 పరుగులు చేశారు. రెండవ సూపర్ ఓవర్‌లో నెదర్లాండ్స్ మొదట బ్యాటింగ్ చేసి 17 పరుగులు చేసింది. స్కాట్ ఎడ్వర్డ్స్ ఒక సిక్స్ కొట్టాడు. నేపాల్‌పై ఒత్తిడి ఉంది, కానీ రోహిత్ పౌడెల్ (7), ఆరీ (10) కలిసి స్కోరును సమం చేశారు. రెండు జట్లు వదులుకోవడానికి సిద్ధంగా లేవు, కాబట్టి మ్యాచ్ మూడవ సూపర్ ఓవర్‌లోకి వెళ్ళింది. ఈసారి లయన్‌కాచెట్ నెదర్లాండ్స్ తరపున అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అతను మొదటి బంతికే రోహిత్ పౌడెల్‌ను అవుట్ చేసి, మూడు బంతుల తర్వాత రూపేష్ సింగ్‌ను అవుట్ చేశాడు. నేపాల్ ఒక్క పరుగు కూడా చేయలేకపోయింది మరియు ఒత్తిడిలో కూలిపోయింది. నెదర్లాండ్స్ గెలవడానికి కేవలం ఒక పరుగు మాత్రమే అవసరం. మైఖేల్ లెవిట్ మొదటి బంతికే లామిచానే బౌలింగ్‌లో సిక్స్ కొట్టడం ద్వారా జట్టుకు విజయాన్ని అందించాడు.

# ఆసియా కప్‌లో భారత్ మహిళల ఆర్చరీ టీం వరల్డ్ రికార్డు



**న్యూఢిల్లీ:** ఆసియా కప్‌లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు అండర్21 ప్రపంచ రికార్డును నెలకొల్పింది. సింగపూర్‌లో జరుగుతున్న ఆసియా కప్ 2025లో భారత మహిళల కాంపౌండ్ ఆర్చరీ జట్టు రికార్డు స్థాయిలో ప్రదర్శన ఇచ్చింది, ర్యాంకింగ్ రౌండ్‌లో అండర్21 ప్రపంచ రికార్డును తిరగరాసింది. షణ్ముఖి బుడ్డే, తేజల్ సాల్వే మరియు తనిష్క తోకల్ త్రయం అసాధారణమైన ప్రదర్శన చేసి 2101 పాయింట్లతో లీడర్ బోర్డ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇది 2076లో భారతదేశం పేరిట ఉన్న మునుపటి అండర్21 ప్రపంచ రికార్డును అధిగమించింది, ఈ రికార్డును 2023 ఆసియా కప్ ఎడిషన్ సందర్భంగా దీప్శి, ప్రగతి మరియు సాక్షిచౌదరి ఒకే వేదికపై నెలకొల్పారు. కుశాల్ దలాల్ 714 స్కోరుతో కాంపౌండ్ పురుషుల ర్యాంకింగ్ రౌండ్‌లో ముందంజలో ఉన్నాడు. కాంపౌండ్ మహిళల విభాగంలో షణ్ముఖి నాగ సాయి బుడ్డే 706 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచాడు, ఆ తర్వాత సహచరురాలు తేజల్ సాల్వే 700 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాడు. పురుషుల రికర్వ్ విభాగంలో విష్ణు చౌదరి మరియు పరాస్ హుడా వరుసగా మూడు మరియు నాల్గవ స్థానంలో నిలిచారు, ఇద్దరూ 669 పాయింట్లు సాధించారు. రికర్వ్ మహిళలలో, వైష్ణవి బాబారావు పవార్ భారతదేశంలో అత్యుత్తమ ప్రదర్శనకారిగా నిలిచారు, 654 పాయింట్లతో 7వ స్థానంలో నిలిచారు.

# వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** సిఏవిఏ పురుషుల అండర్19 వాలీబాల్ ఛాంపియన్‌షిప్-2025లో భారత్ కాంస్య పతకం సాధించింది. ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లోని జెఏఆర్ స్పోర్ట్స్ హాల్‌లో మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో 3-1 తేడాతో కిర్గిజ్‌స్థాన్‌ను ఓడించింది. గ్రూప్ దశలో ఆటుపోట్లకు గురైన భారత జట్టు అద్భుతమైన ప్రదర్శనతో పతకాన్ని గెలుచుకుంది. ఈ విజయం మధ్య ఆసియా వాలీబాల్ వేదికపై యువ భారత జట్టుకు ఒక ముఖ్యమైన విజయాన్ని సూచిస్తుంది. కాంస్య పతక పోరులో 21-25, 25-14, 25-08, 25-23 సెట్ స్కోర్లతో కిర్గిజ్‌స్థాన్‌ను 3-1 తేడాతో ఓడించడంలో భారతదేశం అసాధారణమైన స్థితిస్థాపకత మరియు జట్టుకృషిని ప్రదర్శించింది. ప్రారంభ సెట్‌ను కోల్పోయిన తర్వాత, జట్టు వ్యూహాత్మక ప్రతిభతో తిరిగి పుంజుకుంది. మరియు మిగిలిన సెట్లలో ఆటను నియంత్రించింది. ఉజ్బెకిస్తాన్ 2 పై 25-20, 19-25, 25-16, 25-22 సెట్ స్కోర్లతో విజయం సాధించిన తర్వాత భారత్ జట్టు కాంస్య పతక పోరులో తన స్థానాన్ని సంపాదించుకుంది. కెప్టెన్ మహేంద్ర ధుర్వే కీలకమైన మ్యాచ్‌లో 21 పాయింట్లతో ముందుండి నడిపించాడు. రజత్ సింగ్, ఆదర్శ్ రాయ్ మరియు కునాల్ దాస్ కూడా టోర్నమెంట్ అంతటా గణనీయంగా దోహదపడ్డారు. భారతదేశం మూడవ స్థానాన్ని దక్కించుకోగా, ఇరాన్ ఫైనల్‌లో ఉజ్బెకిస్తాన్ 1ని ఓడించి బంగారు పతకాన్ని గెలుచుకోగా, ఉజ్బెకిస్తాన్ 1 రజతంతో సంతృప్తి చెందింది.

# ఏటీఎంలలో పెరిగిన రూ.100, రూ.200 నోట్ల లభ్యత

**ముంబై, జూన్ 17:** ఏటీఎంల్లో రూ.100, రూ.200 నోట్ల లభ్యత పెరిగింది. ఏటీఎంల్లో (తిగిల్బీ)ఎప్పటికప్పుడు ఈ నోట్లు అందుబాటులో ఉండేలా చూడాలని బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచించిన గడువుకు మూడు నెలల ముందే వీటి లభ్యత 73 శాతం పెరిగింది. గతేడాదిలో డిసెంబర్‌లో 65 శాతంగా ఉన్న ఈ నోట్ల లభ్యత ప్రస్తుతం 73 శాతానికి చేరింది. ఏటీఎంలను నిర్వహిస్తున్న సీఎంఎస్ ఇన్ఫోసిస్టమ్స్ ఈ గణాంకాల్ని వెల్లడించింది.ప్రజల కోసం చిన్న నోట్లు ప్రజలు ఎక్కువగా వాడే నోట్ల లభ్యతను పెంచే ఉద్దేశంతో బ్యాంకులు, వైట్ లేబుల్ ఏటీఎం (తిగిలీ)ఆపరేటర్లు వాటి ఏటీఎంలలో రూ.100, రూ.200 నోట్లు అందుబాటు ఉండేలా చూడాలని ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆదేశాలు జారీ చేసింది. 2025 సెప్టెంబరు 30 నాటికి 75 శాతం ఏటీఎంలు, 2026 మార్చి 31 నాటికి 90 శాతం ఏటీఎంల్లో రూ.100 లేదా రూ.200 నోట్ల ఉపసంహరణ జరగాలని తెలిపింది. ఇక ఆర్‌బీఐ నిర్దేశించిన గడువుకు మూడు నెలల కంటే ముందే ఈ నోట్ల వినియోగం 73 శాతం చేరడం విశేషం. బ్యాంకులు తమ ఏటీఎంల్లో చిన్న నోట్ల స్టాక్‌ను నియమితంగా నింపుతున్నాయి. వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు కూడా ఆర్‌బీఐ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. పాత



ఏటీఎంలలో పెద్దనోట్ల కోసం మాత్రమే ప్రత్యేకంగా ట్రేలుఉండేవి. రూ.100, ..200 నోట్ల లభ్యతలో పెరుగుదల ప్రజలకు నగదు లావాదేవీలలో ఎంతో సౌలభ్యం కలిగించనుంది. ఆర్‌బీఐ నిర్దేశించిన గడువులను ముందుగానే చేరుకోవడం దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు మంచి సూచన. ప్రజలు చిన్న మొత్తాల చెల్లింపుల కోసం ఇక ఏటీఎంల ముందు తిప్పలు పడాల్సిన అవసరం ఉండదు.

# టీసీఎస్ కొత్త పాలసీ.. బెంచ్‌పై ఇక 35 రోజులే !

**ముంబై, జూన్ 17:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ కొత్త పాలసీని తీసుకొచ్చింది. ఇకపై ఏటా ప్రతి ఉద్యోగి 225 బిల్లబుల్ బిజినెస్ డేస్ పనిచేసి ఉండాలన్న నిబంధన తీసుకొచ్చింది. బెంచ్ మీద ఉండే సమయాన్ని 35 రోజులకు పరిమితం చేసింది. జూన్ 12 నుంచి ఈ కొత్త నిబంధనను అమల్లోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు పనిచేయకుండా ఉండే సమయాన్ని తగ్గించడం, వర్క్‌ఫోర్స్‌ను సమర్థంగా వినియోగించుకోవడమే లక్ష్యంగా దీన్ని తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఐటీ కంపెనీల్లో బిల్లబుల్ డేస్ అంటే క్లయింట్ ప్రాజెక్ట్‌పై పని చేయాల్సిన రోజులు. ఇది ఏడాదికి 225 రోజులుగా టీసీఎస్ నిర్ణయించింది. అంటే ప్రతి ఉద్యోగి కనీసం అన్ని రోజులు ప్రాజెక్టులపై పని చేయాల్సి ఉంటుంది. ఇక ఏ ప్రాజెక్ట్‌పై పనిచేయకుండా ఖాళీగా ఉండే సమయాన్ని బెంచ్ పీరియడ్‌గా పేర్కొంటారు. ఇకపై 35 రోజులు మాత్రమే ఒక ఉద్యోగి బెంచ్ మీద ఉండాలి. దీర్ఘకాలం పాటు ఏ ఉద్యోగి ప్రాజెక్టుపై లేకుండా ఖాళీగా ఉండకూడదని కొత్త పాలసీ నిర్దేశిస్తోంది. అలా జరిగితే అతడి పారితోషికం, కెరీర్‌లో వృద్ధి, చివరికి ఉద్యోగ జీవితం పైనా ప్రభావం పడుతుందని కంపెనీ తన పాలసీ డాక్యుమెంట్‌లో పేర్కొంది. టీసీఎస్‌లో ఏ ప్రాజెక్ట్‌కు ఎవరు సరిపోతారు? ఎవరి నైపుణ్యాలు సరిపోతాయి?



వంటివి రిసోర్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్ చూస్తుంది. దీనికి గ్లోబల్ హెడ్‌గా ఉన్న చంద్రశేఖరన్ రామ్‌కుమార్ నిర్ణయానికి అనుగుణంగా ఈ పాలసీ రూపుదిద్దుకుంది. అసోసియేట్‌కు ఏ ప్రాజెక్ట్‌నూ కేటాయించని సందర్భంలో తనకు సరిపడే ప్రాజెక్ట్ అప్పగించేలా ఎప్పటికప్పుడు యూనిట్/ రీజనల్ ఆర్‌ఎంజీతో సంప్రదింపులు జరపడం వారిదే బాధ్యత అని పాలసీలో పేర్కొన్నారు. బెంచ్‌పై ఉన్న ఉద్యోగులు సంస్థ అందిస్తున్న ఐఎవాల్వ్, ఫ్రెస్కో ప్లే, వీఎల్ఎస్, లింక్డిన్ వంటి ప్లాట్‌ఫామ్‌లను వినియోగించుకొని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. ఆర్‌ఎంజీ నిర్దేశించిన సెషన్లకు హాజరవ్వాలి. బెంచ్‌పై ఉండేటప్పుడు ఆఫీసుకు రావడం తప్పనిసరి. వర్క్‌ఫ్రమ్ ఆఫీసు నుంచి మినహాయింపులు, ఫ్లెక్సిబుల్ వర్క్ వంటివి వర్తించవు.

# ఇంటెల్‌లో భారీగా ఉద్యోగాల తొలగింపు !

**ముంబై, జూన్ 17:** ప్రపంచవ్యాప్తం గా ఐటీ రంగం మళ్లీ ఊహించని దిశగా వెళ్లుతోంది. కోవిడ్ తర్వాత ప్రారంభమైన ఆర్థిక మాంద్యం ప్రభావాలు ఇంకా విడిపోలేదు. భారీగా ఉద్యోగ నియామకాలు చేసిన కంపెనీలు ఇప్పుడు ఆగమాగం చేస్తున్నాయి. గడచిన రెండు సంవత్సరాలుగా టెక్ దిగ్గజాలు తమ ఖర్చులను తగ్గించుకోవాలని ఉద్యోగులను వరుసగా తొలగిస్తున్నాయి. ఇందులో తాజా పేరుగా ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ కూడా చేరింది. తాజా సమాచారం ప్రకారం, జూలై మధ్యలో ఉద్యోగాలను తొలగించే ప్రక్రియను ప్రారంభించడానికి ఇంటెల్ సన్నాహాలు చేస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే మెయిల్ పంపినట్లుగా తెలుస్తోంది. కాగా ఇటీవల కొత్తగా నియమితులైన దినివీ లిప్‌బు టాన్ మొదటిసారిగా ఈ తొలగింపులను చేపడుతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.ఎలాంటి విభాగాలపై ఇది ప్రభావం చూపుతుందన్న దానిపై స్పష్టత లేదు. కథనం ప్రకారం ఇంటెల్ కంపెనీ జూలై నెల మధ్యలో ఉద్యోగుల తొలగింపులను ప్రారంభించాలని ప్లాన్ చేస్తోందని, ఈ ప్రక్రియ ఈ నెలాఖరు నాటికి ముగిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే ఈ తొలగింపులు ఎంతమంది ఉద్యోగులను ప్రభావితం చేస్తాయనే దానిపై ఇంకా ఎటువంటి స్పష్టత లేదు.



ఏయే ప్రాంతాల్లో ఉద్యోగ తొలగింపులు ఉంటాయనేదానిపై కూడా అధికారిక సమాచారం లేదు. అయితే తొలగింపులు మాత్రం జరుగుతాయని తెలుస్తోంది. కంపెనీ బలోపేతంలో భాగంగానే ఈ తొలగింపులు జరుగుతున్నాయని తెలుస్తోంది. కష్టమర్ల అవసరాలను తీర్చడమే మా లక్ష్యమని ఇంటెల్ కూడా ఓ బహిరంగ ప్రకటనలో తెలిపింది.గత కొద్ది నెలల్లో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ లాంటి దిగ్గజ సంస్థలు కూడా పెద్ద మొత్తంలో ఉద్యోగులను తొలగించాయి.

# స్టార్‌బక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా డాలీ చాయ్‌వాలా!

**న్యూఢిల్లీ, జూన్ 17:** సోషల్‌మీడియాలో ఫేమస్ అయిన డాలీ చాయ్‌వాలాను ప్రముఖ కాఫీ దిగ్గజం స్టార్‌బక్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిందన్న వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ వదంతులకు చెక్ పెడుతూ స్టార్‌బక్స్ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము ఎవరినీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించలేదని తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో స్టార్‌బక్స్‌కు అధికారిక ప్రచారకర్తలు ఎవరూ లేరని స్పష్టం చేసింది. స్టార్‌బక్స్‌కు డాలీ చాయ్‌వాలా బ్రాండ్ అంబాసిడర్ అంటూ మీమ్స్ నెట్టింట చక్కర్లు కొట్టాయి. దీన్ని చూసి చాలా మంది నిజమని భావించారు. ఈ ప్రచారం హోరెత్తడంతో కంపెనీ స్పష్టత ఇవ్వాల్సి వచ్చింది. నాగ్‌పూర్‌కు చెందిన టీ విక్రేత ఈ డాలీ చాయ్‌వాలా. ప్రత్యేక శైలిలో టీ అమ్మే ఆయన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. గతేడాది మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ భారత్ పర్యటన సందర్భంగా చాయ్‌వాలాతో చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఈ షార్ట్ వీడియో వైరల్ కావడంతో డాలీ చాయ్‌వాలా ఫేమస్ అయ్యాడు.



# వాణిజ్యం

# అక్రమ వసూళ్లపై ఇపిఎఫ్‌ఓ అసహనం


**న్యూఢిల్లీ, జూన్ 17:** ఆన్‌లైన్ పోర్టల్ ఉపయో గించి భవిష్య నిధి ఖాతాలకు సంబంధించిన సేవలు అందిస్తామని ముందుకొచ్చే మధ్య వర్తులతో అప్రమత్తంగా వ్యవహరించాలని, తమ చందాదార్లను ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌ఓ) హెచ్చరించింది. కీలక సమాచారం వారి చేతికి వెళ్లకుండా చూడాలని స్పష్టం చేసింది. సేవలను వేగంగా, పారదర్శ కంగా, వినియోగదారు హితంగా అందించేం దుకు ఈపీఎఫ్‌ఓ వరుసగా సంస్కరణలు చేపడుతోందని కార్మిక మంత్రిత్వ శాఖ వెల్లడిం చింది. ఈపీఎఫ్‌ఓలో సుమారు 7 కోట్ల మందికి పైగా చందాదార్లు ఉన్నారు. ఇందులో ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రస్తుత, మాజీ ఉద్యో గులు ఉన్నారు. పలు సైబర్ కేఫ్ ఆపరేటర్లు/ ఫిన్‌టెక్ కంపెనీలు చందాదార్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి, సేవలు అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఈపీఎఫ్‌ఓ తెలిపింది. ఈపీఎఫ్‌ఓ సంబంధిత సేవలు అందించేందుకు థర్డ్‌పార్టీ కంపెనీలు, వాటిని దుర్వినియోగం చేస్తే చందాదార్ల నష్ట పోవాల్సి ఉంటుందని తెలిపింది. ఇలాంటి సేవలు అందించేందుకు బయటి సంస్థలు/ వ్యక్తులకు ఈపీఎఫ్‌ఓ అనుమతి ఇవ్వలేదని వెల్లడించింది. ఈపీఎఫ్‌ఓలో సమస్యలు ఉంటే, సీపీజీఆర్ఏఎంఎస్ లేదా ఈపీఎఫ్ఐజీఎంస్ పోర్టళ్లలో తెలియజేస్తే, వాటికి పరిష్కారం నిర్ణీత సమయంలో లభిస్తుందని వివరించింది. 2024-25లో ఫిర్యాదులు 2024-25లో ఈపీఎఫ్ ఐజీఎంస్ పోర్టల్‌లో 16,01,202 ఫిర్యాదులు, సీపీజీఆర్ఏఎంఎస్‌లో 1,74,328 ఫిర్యాదులు రాగా, 98 పరిష్కరించినట్లు తెలిపింది. చందాదార్లు, యాజమాన్య సంస్థలు, పింఛనుదార్లు ఆన్‌లైన్ సేవల కోసం



ఈపీఎఫ్‌ఓ పోర్టల్, ఉమాంగ్ యాప్‌లను వినియోగించుకోవాలని సూచించింది. సేవలు వేగంగా, పారదర్శకంగా, వినియోగదారులకు అనుకూలంగా అందించేందుకు ఈపీఎఫ్‌ఓ వరుసగా మార్పులు చేస్తోంది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూన్ 17:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చనుందనే సంకేతాలు ఇందుకు కారణమయ్యాయి. టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని పౌరులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించడం ఇందుకు నేపథ్యం. ఇరు దేశాల మధ్య యుద్ధం ప్రాంతీయ పోరుకు దారితీయొచ్చన్న భయాలు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో చమురు ధరలు కూడా పెరగడంతో సూచీలు ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ 200 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 24,900 దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 81,869.47 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,427.01 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. 212 పాయింట్ల నష్టంతో 81,583.30 వద్ద ముగిసింది. నిఫ్టీ 93.10 పాయింట్ల నష్టంతో 24,853.40 వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువ 86.24గా ఉంది. ఎటర్నల్, సన్ ఫార్మా, టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.28 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3405 డాలర్ల వద్ద ట్రేడయింది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14